


# పోరు తెలంగాణ
డిజిటల్ తెలుగు దినపత్రిక




కరీంనగర్ సంపుటి: 11 సంచిక: 322 మంగళవారం 22-09-2026 ఎడిటర్: కొండ ప్రవీణ్ కుమార్ పేజీలు: 04 వెల: 04

# 20 ఏళ్ల కిందట తన చేతిలో ఓడిన ప్రత్యర్థికి కీలక పదవి

- 20 ఏళ్ల నాటి ప్రత్యర్థి గౌస్ రబ్బానీకి ప్రభుత్వంలో పదవిపై హామీ
- తొలి రాజకీయ విజయానికి 20 ఏళ్లు పూర్తయిన సందర్భంగా మిడ్జిల్‌లో పర్యటన
- రబ్బానీకి తగిన బాధ్యతలు అప్పగించాలని డిప్యూటీ సీఎం భట్టికి సూచన



2లో

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన పూర్వ రాజకీయ ప్రత్యర్థికి కీలక హామీ ఇచ్చారు. సరిగ్గా రెండు దశాబ్దాల క్రితం జడ్పీటీసీ ఎన్నికల్లో తనపై పోటీ చేసి ఓటమిపాలైన మహమ్మద్ గౌస్ రబ్బానీకి ప్రభుత్వంలో సముచిత స్థానం కల్పిస్తామని ఆయన ప్రకటించారు.

## పార్టీ పేరు మార్చాలంటూ ఈసీ ఆదేశం

ఘాటుగా స్పందించిన కవిత



- 15 రోజుల్లోగా మూడు ప్రత్యామ్నాయ పేర్లను సమర్పించాలని కవితకు ఈసీ సూచన
- కొత్త పేర్లు పంపకపోతే పార్టీ దరఖాస్తును క్లోజ్ చేస్తామని హెచ్చరిక
- కొత్త పేర్లు పంపే ప్రసక్తే లేదన్న కవిత

సొంత పార్టీ స్థాపనతో తెలంగాణ రాజకీయాల్లో సరికొత్త ప్రస్థానాన్ని ప్రారంభించాలనుకున్న మాజీ ఎమ్మెల్యే కల్వకుంట్ల కవితకు కేంద్ర ఎన్నికల సంఘం ఊహించని బిగ్ షాక్ ఇచ్చింది. 'తెలంగాణ రక్షణ సేన (౨=ా)' - మిగతా 2 లో

## తెలంగాణ పాక్, శ్రీలంకలా దివాలా తీస్తుంది

కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలపై బండి సంజయ్ ఫైర్

- రాష్ట్రాన్ని బీఆర్ఎస్, కాంగ్రెస్ ప్రభుత్వాలు అప్పుల కుప్పగా మార్చాయన్న సంజయ్
- రూ. 10 లక్షల కోట్ల అప్పుల భారాన్ని ప్రజలపై రుద్దారని మండిపాటు
- రాష్ట్రం అభివృద్ధిపథంలో సాగాలంటే బీజేపీ అధికారంలోకి రావాలని వ్యాఖ్య



తెలంగాణను అప్పుల కుప్పగా మార్చడంలో గత బీఆర్ఎస్ ప్రభుత్వానికి, ఇప్పటి కాంగ్రెస్ ప్రభుత్వానికి పెద్ద తేడా లేదు అంటూ కేంద్ర సహాయ మంత్రి బండి - మిగతా 2 లో

## సంక్షోభంలో టీఎంసీ.. మమతా బెనర్జీ కీలక నిర్ణయం

- బెంగాల్ రాష్ట్ర అధ్యక్ష పదవిని చేపడుతున్నట్లు మమత ప్రకటన
- కొన్ని గంటల ముందే పదవికి రాజీనామా చేసిన చంద్రికా భట్టాచార్య
- కొత్త అధ్యక్షుడిని నియమించడం లేదని, తానే బాధ్యతలు నిర్వహిస్తానన్న మమత



పశ్చిమ బెంగాల్‌లో తీవ్ర అంతర్గత సంక్షోభాన్ని ఎదుర్కొంటున్న తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ)పై పట్టు సాధించేందుకు అధినేత్రి మమతా బెనర్జీ కీలక నిర్ణయం తీసుకున్నారు. పార్టీ రాష్ట్ర అధ్యక్ష బాధ్యతలను - మిగతా 2 లో

## శతాబ్దపు అతిపెద్ద ఇంధన సంక్షోభాన్ని అధిగమించాం

- 21వ శతాబ్దపు అతిపెద్ద ఇంధన సంక్షోభాన్ని భారత్ విజయవంతంగా అధిగమించిందని వెల్లడి
- పశ్చిమాసియా యుద్ధం వల్ల తలెత్తిన సంక్షోభాన్ని వ్యూహాత్మకంగా ఎదుర్కొన్నామని స్పష్టం
- చమురు రంగ కంపెనీలు రూ. 75,000 కోట్లకు పైగా నష్టాలను భరించాయని వెల్లడి
- ఇంధనం అందించే దేశాల సంఖ్యను 40కి పెంచుకున్నామన్న మోదీ



2లో

పశ్చిమాసియా యుద్ధం కారణంగా తలెత్తిన 21వ శతాబ్దపు అతిపెద్ద ఇంధన సంక్షోభాన్ని భారత్ విజయవంతంగా అధిగమించిందని ప్రధాని నరేంద్ర మోదీ ప్రకటించారు. సరైన సమయంలో

## మధ్యవర్తిత్వంలో పాకిస్థాన్‌తో పోలిక

చైనా జర్నలిస్టుకు భారత రాయబారి గట్టి కౌంటర్



- పశ్చిమాసియా మధ్యవర్తిత్వంపై పాక్‌తో పోలికను తిరస్కరించిన భారత్
- రెండు దేశాల ఆర్థిక వ్యవస్థలను చూస్తేనే తేడా తెలుస్తుందన్న రాయబారి
- ఆ పోలిక అన్యాయమని చైనాలో స్పష్టం చేసిన విక్రమ్ దొరైస్వామి

పశ్చిమాసియా వివాదంలో మధ్యవర్తిత్వానికి సంబంధించి భారత్‌ను పాకిస్థాన్‌తో - మిగతా 2 లో

## మీరు చాలా పాప్యులర్... ఉషా వాన్స్‌పై ట్రంప్ ప్రశంసలు

- సెకండ్ లేడీ ఉషా వాన్స్ పిల్లల పోడ్‌కాస్ట్‌లో పాల్గొన్న ట్రంప్
- వైట్‌హౌస్‌లో ఉషాను అందరూ ఇష్టపడతారంటూ ప్రశంస
- ఓవల్ ఆఫీసులో చిన్నారుల పుస్తకాన్ని చదివిన ట్రంప్, ఉషా
- ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్‌ను కూడా మెచ్చుకున్న అమెరికా అధ్యక్షుడు
- భారత సంతతికి చెందిన తొలి అమెరికన్ సెకండ్ లేడీగా గుర్తింపు పొందిన ఉషా

2 లో..



## కుప్పంలోనూ బంగారం నిక్షేపాలు ఉన్నాయంటున్నారు

- వెలికితీస్తాం: సీఎం చంద్రబాబు
- కుప్పాన్ని 'స్వర్ణ కుప్పం'గా తీర్చిదిద్దడమే లక్ష్యమన్న సీఎం చంద్రబాబు
- రూ.118 కోట్లతో ఆధునిక బస్ స్టేషన్, డిపో నిర్మాణానికి శంకుస్థాపన
- కర్నూలు జిల్లా జొన్నగిరి తరహాలోనే కుప్పంలోనూ బంగారు గనులు ఉన్నాయని వెల్లడి
- గత ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు, సీఎంలో ఫ్యాక్షన్ యుగం ముగిసిందని స్పష్టీకరణ
- అమరావతి రాజధానిగా ఉండాలని ప్రజలు కోరుకుంటే, గొడ్డలి పార్టీ 'మావిగన్' అంటోందని ఎద్దేవా



2లో

తన సొంత నియోజకవర్గమైన కుప్పాన్ని ఒక అభివృద్ధి కేంద్రంగా, దేశానికే ఆదర్శంగా నిలిపే 'స్వర్ణ కుప్పం' నిర్మాణానికి నాంది పలుకుతున్నట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. కుప్పం పర్యటనలో భాగంగా...

## మంత్రి నారా లోకేశ్ కు దక్షిణ కొరియా అధికారిక ఆహ్వానం

- ద్వైపాక్షిక సంబంధాలు, పెట్టుబడుల ఆకర్షణే ప్రధాన ఎజెండా
- ఎల్జీ, హ్యోసంగ్ వంటి దిగ్గజ సంస్థలతో కీలక సమావేశాలు
- సీఐఐ భాగస్వామ్య సదస్సు కోసం కొరియాలో ప్రత్యేక రోడ్ షో



ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి పెట్టుబడులను ఆకర్షించే లక్ష్యంతో రాష్ట్ర ఐటీ, విద్యా, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేశ్ దక్షిణ కొరియాలో పర్యటించనున్నారు. ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలను మరింత బలోపేతం చేసే ఉద్దేశంతో తమ దేశంలో పర్యటించాలని రిపబ్లిక్ ఆఫ్ కొరియా (దక్షిణ కొరియా) ప్రభుత్వం ఆయన్ను అధికారికంగా ఆహ్వానించింది. ఈ మేరకు ఆయన జూలై 5 నుంచి 11వ తేదీ వరకు కొరియాలో పర్యటించనున్నారు. ఈ పర్యటనలో భాగంగా మంత్రి లోకేశ్.. కొరియాలోని పలు మంత్రిత్వ శాఖల ప్రతినిధులు, పారిశ్రామికవేత్తలతో కీలక సమావేశాల్లో పాల్గొంటారు. ఈ పర్యటన - మిగతా 2 లో

## పాపికొండల విహార యాత్రకు గ్రీన్ సిగ్నల్

20 రోజుల తర్వాత పునఃప్రారంభం

- 20 రోజుల విరామం తర్వాత తిరిగి ప్రారంభంకానున్న పాపికొండల యాత్ర
- సాంకేతిక లోపంతో నిలిచిపోయిన విహార యాత్రకు అధికారుల గ్రీన్ సిగ్నల్
- తనిఖీల అనంతరం 15 ప్రైవేట్, ఒక ఏపీటీడీసీ బోటుకు అనుమతి



పర్యాటకులకు, ప్రకృతి ప్రేమికులకు శుభవార్త. గోదావరి నదిలో రమణీయ దృశ్యాలకు నెలవైన పాపికొండల విహార యాత్రకు మార్గం సుగమమైంది. సాంకేతిక కారణాలతో సుమారు 20 రోజుల పాటు నిలిచిపోయిన - మిగతా 2 లో

## పాపికొండల విహార యాత్రకు గ్రీన్ సిగ్నల్

మొదటిపేజీ తరువాయి - బోటు సేవలను తిరిగి ప్రారంభించేందుకు అధికారులు అనుమతులు మంజూరు చేశారు. శనివారం (జులై 5) నుంచి ఈ సేవలు పునఃప్రారంభం కానున్నాయి. పోలవరం జిల్లా దేవీపట్నం మండలంలోని గండి పోచమ్మ ఆలయం నుంచి 15 ప్రైవేట్ బోట్లు, ఆంధ్రప్రదేశ్ పర్యాటక అభివృద్ధి సంస్థ (ఏపీటీడీసీ)కు చెందిన ఒక బోటు ప్రయాణానికి సిద్ధంగా ఉన్నాయి. రంపచోడవరం రెవెన్యూ డివిజనల్ ఆఫీసర్ (ఆర్డీవో) స్వాతి, జాయింట్ కలెక్టర్ ప్రశాంత్ కుమార్ నేతృత్వంలోని అధికారుల బృందం భద్రతా ఏర్పాట్లను, బోట్ల స్థితిగతులను సమీక్షించిన అనంతరం ఈ నిర్ణయం తీసుకుంది. గత నెల జూన్ 14న గండి పోచమ్మ ఆలయం నుంచి పాపికొండలకు వెళ్తున్న ఒక పర్యాటక బోటులో దేవీపట్నం పోలీస్ స్టేషన్ సమీపంలో సాంకేతిక లోపం తలెత్తింది. ఈ ఘటనతో ప్రయాణికుల భద్రతను దృష్టిలో ఉంచుకుని అధికారులు వెంటనే బోటు సేవలను తాత్కాలికంగా నిలిపివేసి, అన్ని బోట్లకు క్షుణ్ణంగా తనిఖీలు చేపట్టారు. ప్రస్తుతం అన్ని బోట్లను పరిశీలించి, అనుమతులు మంజూరు చేశామని జలవనరుల శాఖ అసిస్టెంట్ ఇంజనీర్ భాస్కర్ ధ్రువీకరించారు. వర్షాకాలం నేపథ్యంలో పర్యాటకుల తాకిడి పెరుగుతుండటంతో, తాజా నిర్ణయంతో పర్యాటక రంగం తిరిగి ఊపందుకుంటుందని, తద్వారా స్థానిక ఉపాధికి భరోసా లభిస్తుందని భావిస్తున్నారు. ప్రయాణికుల భద్రతకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ, కఠినమైన నిబంధనల నడుమ ఈ సేవలను కొనసాగిస్తామని అధికారులు స్పష్టం చేశారు.c

## తెలంగాణ... పాక్, శ్రీలంకలా దివాలా తీస్తుంది

మొదటిపేజీ తరువాయి - సంజయ్ విమర్శలు గుప్పించారు. రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ పరిధిలో ఈరోజు పలు అధికారిక కార్యక్రమాల్లో పాల్గొన్న ఆయన.. అనంతరం మీడియాతో మాట్లాడుతూ కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలపై మండిపడ్డారు. రాష్ట్ర ఖజానాను లూటీ చేస్తూ ఏకంగా రూ.10 లక్షల కోట్ల మేర అప్పుల భారాన్ని సామాన్యుడి నెత్తిన రుద్దారని దుయ్యబట్టారు. ఈ తరహా బాధ్యతారాహిత్యమైన ధోరణి ఇలాగే కొనసాగితే... భవిష్యత్తులో మన రాష్ట్రం కూడా పాకిస్థాన్, శ్రీలంకల మాదిరి దివాలా తీసే దుస్థితికి చేరుకుంటుందని హెచ్చరించారు. ఈ సంక్షోభం నుంచి గట్టెక్కి ప్రగతిపథంలో పయనించాలంటే రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి రావడం ఒక్కటే మార్గమని ఆయన స్పష్టం చేశారు. తెలంగాణలో కొనసాగుతున్న ప్రతి చిన్న అభివృద్ధి వెనుక మోదీ సర్కార్ పంపిన నిధులే ఉన్నాయని గుర్తుచేశారు. పల్లెల ప్రగతి కోసం ఢిల్లీ నుంచి నేరుగా వస్తున్న ఆర్థిక సంఘం నిధులను సైతం ఇక్కడి పాలకులు జీతాల చెల్లింపుల కోసం దారిమళ్లిస్తున్నారని సంజయ్ ఆరోపించారు. కేంద్రం ప్రవేశపెట్టిన ప్రజాహిత పథకాలపై కోర్టులకెళ్లడం ఏంటని ప్రశ్నించిన ఆయన... వీబీ జీ రామ్ జీ పథకం ద్వారా ఉపాధి కల్పించి శాశ్వత సంపదను సృష్టిస్తుంటే... దానిపై కూడా రాజకీయం చేస్తున్నారని మండిపడ్డారు. ప్రధాని మోదీకి దక్కుతున్న ఆదరణను తట్టుకోలేకనే ప్రతిపక్షాలు ఈర్ష్యతో ఇటువంటి దిగజారుడు చర్యలకు పాల్పడుతున్నాయని, కానీ ప్రజలు అన్నింటినీ గమనిస్తున్నారని అన్నారు.

## సంక్షోభంలో టీఎంసీ.. మమతా బెనర్జీ కీలక నిర్ణయం

మొదటిపేజీ తరువాయి - స్వయంగా చేపడుతున్నట్లు ఆమె శనివారం ప్రకటించారు. అంతకుముందే రాష్ట్ర అధ్యక్షురాలిగా ఉన్న చంద్రికా భట్టాచార్య తన పదవితో పాటు పార్టీలోని అన్ని బాధ్యతలకు రాజీనామా చేశారు. శనివారం మధ్యాహ్నం చంద్రికా భట్టాచార్య తన రాజీనామా లేఖను సమర్పించారు. పార్టీ బ్యాంకు ఖాతాల నిర్వహణ, కేంద్ర ఎన్నికల సంఘం వద్ద పార్టీ ప్రతినిధిగా వ్యవహరించే బాధ్యతల నుంచి కూడా ఆమె తప్పుకున్నారు. కాగా, రాజీనామా అనంతరం ఆమె తిరుగుబాటు వర్గం నేత రితబ్రత బెనర్జీతో సమావేశమైనట్లు సమాచారం. చంద్రికా రాజీనామా అనంతరం ఫేస్‌బుక్ లైవ్ ద్వారా మమతా బెనర్జీ ప్రసంగించారు. కొత్త అధ్యక్షుడిని నియమించడం లేదని, తానే ఆ బాధ్యతలను నిర్వర్తిస్తానని స్పష్టం చేశారు. ఇదే సమయంలో తన విధేయులైన కునాల్ ఘోష్, మదన్ మిత్రాలను పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శులుగా నియమించారు. 2026 అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ చేతిలో పరాజయం పాలైన తర్వాత టీఎంసీలో విభేదాలు భగ్గుమన్నాయి. పార్టీకి చెందిన 80 మంది ఎమ్మెల్యేలలో ఏకంగా 58 మంది రితబ్రత బెనర్జీ నేతృత్వంలోని తిరుగుబాటు వర్గంలో చేరారు. మమత నాయకత్వాన్ని సవాలు చేస్తూ, గత నెలలో ఆమెను జాతీయ అధ్యక్షురాలి పదవి నుంచి తొలగిస్తున్నట్లు ప్రకటించి, ఆ స్థానంలో అరూప్ రాయ్‌ను ఎన్నుకున్నారు. ఈ పరిణామాలపై మమత బెనర్జీ తీవ్రంగా స్పందించారు. 'నిజమైన తృణమూల్' అని చెప్పుకోవడం మాని, తిరుగుబాటుదారులు అధికారికంగా బీజేపీలో చేరాలని ఆమె సవాలు విసిరారు. పార్టీ పేరు, గుర్తు, నిధుల కోసమే వారు కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. "నా గొంతు నొక్కాలంటే నన్ను చంపాల్సిందే. అవసరమైతే పార్టీ గుర్తును మెడలో వేసుకుని ప్రజల్లోకి వెళతాను" అని ఆమె భావోద్వేగంగా వ్యాఖ్యానించారు. జూలై 21న నిర్వహించే పార్టీ సంప్రదాయ అమరవీరుల దినోత్సవ ర్యాలీ యథావిధిగా జరుగుతుందని స్పష్టం చేశారు. కాగా, పార్టీ నియంత్రణపై ఇరు వర్గాల వాదనలను ఎన్నికల సంఘం ప్రస్తుతం పరిశీలిస్తోంది.

## శతాబ్దపు అతిపెద్ద ఇంధన సంక్షోభాన్ని అధిగమించాం

మొదటిపేజీ తరువాయి - తీసుకున్న విధానపరమైన నిర్ణయాలు, వ్యూహాత్మక ప్రణాళికలు మరియు పటిష్ఠమైన దౌత్యం వల్లనే ఇది సాధ్యమైందని ఆయన స్పష్టం చేశారు. శనివారం రాజస్థాన్‌లోని బలోత్రా జిల్లాలో ఒక భారీ ఆయిల్ రిఫైనరీ ప్రాజెక్టును ప్రారంభించిన అనంతరం నిర్వహించిన బహిరంగ సభలో ఆయన ప్రసంగించారు. "నవ భారత సంకల్పం, కృషితో 21వ శతాబ్దపు అతిపెద్ద ఇంధన సంక్షోభాన్ని మనం అధిగమించాం" అని ప్రధాని మోదీ పేర్కొన్నారు. పశ్చిమాసియా యుద్ధం కారణంగా హర్మూజ్ జలసంధి వంటి కీలక సముద్ర మార్గాల్లో ఇంధన సరఫరాకు తీవ్ర విఘాతం ఏర్పడిన విషయాన్ని ఆయన ఈ సందర్భంగా గుర్తుచేశారు. ఇటువంటి క్లిష్ట పరిస్థితుల్లో సంక్షోభాన్ని ముందుగానే అంచనా వేసి, జాతీయ వనరులను సద్వినియోగం చేసుకోవడంతో పాటు, దౌత్య సంబంధాల ద్వారా చమురు సరఫరాకు ఆటంకం కలగకుండా చర్యలు తీసుకున్నామని వెల్లడించారు. ఇంధన సంక్షోభం తలెత్తిన సమయంలో వినియోగదారులపై ఆర్థిక భారం పడకుండా ప్రభుత్వ రంగ చమురు సంస్థలు రూ. 75,000 కోట్లకు పైగా నష్టాలను భరించాయని, ప్రభుత్వం వారికి పూర్తి అండగా నిలిచిందని ప్రధాని వివరించారు. దౌత్యపరమైన చొరవతో, మనకు ఇంధనం అందించే దేశాల సంఖ్యను 25 నుంచి 40కి పెంచుకున్నామని, దీనివల్ల దేశంలో ఎక్కడా కొరత ఏర్పడకుండా చూడగలిగామని తెలిపారు. కొందరు ప్రతిపక్ష నేతలు ప్రజల్లో భయాందోళనలు సృష్టించే ప్రయత్నం చేసినప్పటికీ, ప్రభుత్వం తెరవెనుక చేసిన కృషి చరిత్రాత్మకమని వ్యాఖ్యానించారు. ఈ విజయం 'ఆత్మనిర్భర్ భారత్' స్ఫూర్తికి నిదర్శనమని ఆయన కొనియాడారు.

## మీరు చాలా పాప్యులర్... ఉషా వాన్స్‌పై ట్రంప్ ప్రశంసలు



మొదటిపేజీ తరువాయి - అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ అర్ధాంగి ఉషా వాన్స్‌పై అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రశంసలు కురిపించారు. అమెరికా స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఉషా వాన్స్ నిర్వహిస్తున్న పిల్లల అక్షరాస్యత పోడ్‌కాస్ట్‌కు ట్రంప్ ప్రత్యేక అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "వైట్‌హౌస్‌లో మీరు చాలా పాప్యులర్. మిమ్మల్ని అందరూ ఇష్టపడతారు" అని ఉషాను ఉద్దేశించి అన్నారు. అమెరికా సెకండ్ లేడీ హోదాలో ఉషా వాన్స్ నిర్వహిస్తున్న 'స్టోరీటైమ్ విత్ ది సెకండ్ లేడీ' కార్యక్రమం కోసం వారు ఓవల్ ఆఫీసులో కలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ట్రంప్, ఉషా కలిసి వైట్‌హౌస్ హిస్టారికల్ అసోసియేషన్ ప్రచురించిన 'ప్రెసిడెంట్స్ ప్లే!' అనే పిల్లల పుస్తకాన్ని చదివారు. ఈ కార్యక్రమానికి తనను ఆహ్వానించడం గౌరవంగా భావిస్తున్నానని ట్రంప్ పేర్కొన్నారు. దీనికి ఉషా బదులిస్తూ, ఓవల్ ఆఫీసులోకి పిల్లలను ఆహ్వానించినందుకు అధ్యక్షుడికి ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్‌ను కూడా ట్రంప్ మెచ్చుకున్నారు. "మీ భర్త గొప్ప ఉపాధ్యక్షుడిగా పనిచేస్తున్నారు. ఎన్నో క్లిష్ట సమయాల్లో కూడా మేమిద్దరం కలిసి పనిచేస్తూ అనేక సమస్యలను పరిష్కరిస్తున్నాం" అని తెలిపారు. తన 11 మంది మనవళ్లు, మనవరాళ్లు ఈ కార్యక్రమాన్ని తప్పక చూసేలా చేస్తానని ట్రంప్ సరదాగా వ్యాఖ్యానించారు. భారత సంతతికి చెందిన తొలి అమెరికన్ సెకండ్ లేడీగా గుర్తింపు పొందిన ఉషా వాన్స్, వృత్తిరీత్యా న్యాయవాది. ఆమె పిల్లల్లో అక్షరాస్యత, విద్యను ప్రోత్సహించేందుకు ఈ పోడ్‌కాస్ట్ సిరీస్‌ను ప్రారంభించారు. ఇందులో భాగంగా పరిపాలనలోని ఉన్నతాధికారులను, ఇతర ప్రముఖులను అతిథులుగా ఆహ్వానిస్తున్నారు.

## కుప్పంలోనూ బంగారం నిక్షేపాలు ఉన్నాయంటున్నారు

మొదటిపేజీ తరువాయి - రూ.118 కోట్ల వ్యయంతో నిర్మించనున్న అత్యాధునిక ఆర్టీసీ బస్ స్టేషన్, డిపో పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభలో ప్రసంగించిన చంద్రబాబు, అభివృద్ధి ప్రణాళికలను వివరిస్తూనే గత ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో విమర్శనాస్త్రాలు సంధించారు.

### కుప్పంలోనూ బంగారు గనులు

కర్నూలు జిల్లా జొన్నగిరిలో గోల్డ్ ఫీల్డ్స్ ప్రారంభించామని తెలిపారు. ఇప్పుడు కుప్పం ప్రాంతంలోనూ బంగారు గనులు ఉన్నాయని నిపుణులు చెబుతున్నారని చంద్రబాబు సంచలన విషయం వెల్లడించారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి ఆ బంగారు నిక్షేపాలను వెలికితీసి, 'స్వర్ణ కుప్పం' ఆవిష్కరణకు నిజమైన అర్థం కల్పిస్తామని ప్రకటించారు.

మైక్రో ఇరిగేషన్‌లో దేశానికే ఆదర్శంగా నిలిచిన కుప్పం మోడల్‌ను రాష్ట్రవ్యాప్తంగా అమలు చేస్తామన్నారు. హంద్రీ-నీవా జలాలతో 110 చెరువులు నింపామని గుర్తుచేశారు. రాయలసీమను ఉద్యాన హబ్?గా మార్చే 'పూర్వోదయ' ప్రాజెక్టుకు వచ్చే నెల మదనపల్లెలో శంకుస్థాపన చేస్తామని తెలిపారు.

### ఉద్యోగాల కేంద్రంగా కుప్పం

ఒకప్పుడు ఎన్టీఆర్ హయాంలో కుప్పంలో బస్ స్టేషన్‌కు శంకుస్థాపన జరిగిందని, ఇప్పుడు అదే స్థానంలో సౌర విద్యుత్ వంటి ఆధునిక సదుపాయాలతో మోడల్ బస్ స్టేషన్, డిపో నిర్మాణానికి శ్రీకారం చుట్టామని చంద్రబాబు తెలిపారు. కుప్పాన్ని స్వర్ణ కుప్పంగా మార్చే క్రమంలో పరిశ్రమల స్థాపనకు పెద్దపీట వేస్తున్నామన్నారు. "ఉద్యోగాల కోసం కుప్పం యువత బయటకు వెళ్లడం కాదు, ఇతర ప్రాంతాల వారు ఉద్యోగాల కోసం కుప్పానికి వచ్చే పరిస్థితి కల్పిస్తాం" అని ఆయన ఉద్ఘాటించారు.

ఒక్క రోజులోనే రూ.9,322 కోట్ల పెట్టుబడులతో 30 ప్రాజెక్టులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు, ఒప్పందాలు జరిగాయని, వీటి ద్వారా సుమారు 80 వేల మందికి ఉపాధి లభిస్తుందని వివరించారు. ప్రఖ్యాత అడిడాస్ ఫుట్‌వేర్ సంస్థతో పాటు టూ సీటర్ ట్రైనీ ఎయిర్‌క్రాఫ్ట్ తయారీ, డెయిరీ, ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమలు కుప్పానికి వస్తున్నాయని వెల్లడించారు.

### కాలుష్య రహిత, సుస్థిర అభివృద్ధి

ఎస్సీ, ఎస్టీలకు సోలార్ రూఫ్‌టాప్ ద్వారా ఉచిత విద్యుత్, బీసీ, ఓసీలకు రూ.552 కోట్లతో సౌర విద్యుత్ సదుపాయం కల్పిస్తామని చెప్పారు. 'నెట్ జీరో' విధానంలో భాగంగా ఇళ్లపైనే కూరగాయలు పండించుకోవడం, ఈ-సైకిళ్ల వాడకం పెంచి కుప్పాన్ని కాలుష్య రహిత నగరంగా తీర్చిదిద్దాలని పిలుపునిచ్చారు. కుప్పంలోని బ్లూ గ్రానైట్‌కు ప్రపంచవ్యాప్తంగా ఉన్న డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకొని 'హెరిటేజ్ గ్రానైట్ క్లస్టర్' ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు.

### గత పాలనపై తీవ్ర విమర్శలు

గత ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం కుప్పంపై కక్ష కట్టిందని, అభివృద్ధిని అడ్డుకుందని చంద్రబాబు ఆరోపించారు. "నీళ్లు తెచ్చామని సినిమా సెట్టింగులు వేసి డ్రామాలు ఆడారు. 2019-24 మధ్య నన్ను నా నియోజకవర్గంలోనే తిరగనివ్వకుండా అడ్డంకులు సృష్టించారు. నాకు సహకరించిన వారిని వేధించారు" అని మండిపడ్డారు. రాయలసీమలో ఫ్యాక్షన్ రాజకీయాలకు కాలం చెల్లిందని, ఇప్పుడు అభివృద్ధే తమ అజెండా అని స్పష్టం చేశారు. సంఘ విద్రోహ శక్తుల పట్ల కఠినంగా వ్యవహరిస్తానని హెచ్చరించారు. వివేకానందరెడ్డి హత్య, కోడికత్తి డ్రామా, డాక్టర్ సుధాకర్, డ్రైవర్ సుబ్రహ్మణ్యం ఘటనలను ప్రస్తావిస్తూ గత ప్రభుత్వంలో జరిగిన అరాచకాలను ఎండగట్టారు.

### 'మావిగన్' అంటూ గొడ్డలి పార్టీ వింత వాదన

రాజధానిపై గత ప్రభుత్వం రోజుకో మాట మాట్లాడిందని విమర్శించారు. ప్రజలందరూ అమరావతినే రాజధానిగా కోరుకుంటుంటే, 'గొడ్డలి పార్టీ' మాత్రం వాటికన్ తరహాలో 'మావిగన్' కావాలంటోందని ఎద్దేవా చేశారు. గొడ్డలి పార్టీ అని తాము అనడం కాదని, వారే అంగీకరిస్తున్నారని వ్యాఖ్యానించారు. కుప్పం అభివృద్ధికి సుర్బానా జురాంగ్, ఐఐటీ కాన్పూర్ వంటి సంస్థల సహకారంతో మాస్టర్ ప్లాన్ సిద్ధం చేస్తున్నామని తెలిపారు. పర్యాటకాన్ని ప్రోత్సహించేందుకు ఎలిఫెంట్ సఫారీ, రాక్ క్లైంబింగ్ వంటి ప్రాజెక్టులను అభివృద్ధి చేస్తామన్నారు. ప్రజా భాగస్వామ్యంతో కుప్పాన్ని దేశంలోనే ఒక ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతానని చంద్రబాబు పునరుద్ఘాటించారు. ఈ కార్యక్రమంలో మంత్రి మండిపల్లి రామ్ ప్రసాద్ రెడ్డి, ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు, ఆర్టీసీ వైస్ ఛైర్మన్ మునిరత్నం, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

## మంత్రి నారా లోకేశ్ కు దక్షిణ కొరియా అధికారిక ఆహ్వానం

మొదటిపేజీ తరువాయి - ద్వైపాక్షిక సహకారాన్ని పెంపొందించేందుకు దోహదపడుతుందని చెన్నైలోని దక్షిణ కొరియా కాన్సులేట్ జనరల్ చాంగ్ న్యూన్ కిమ్, మంత్రి లోకేశ్ కు పంపిన ఆహ్వాన లేఖలో పేర్కొన్నారు. భారత్-కొరియా మధ్య సంబంధాలను మరింత పటిష్ఠం చేయడంలో ఈ పర్యటన ఒక కీలక ముందడుగు అవుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

### లోకేశ్ పర్యటన షెడ్యూల్

జులై 5న సియోల్‌లో ఇండియా దయాస్పోరా ఏర్పాటు చేసే ఆత్మీయ సమావేశానికి హాజరై అక్కడి భారతీయులు, ముఖ్యంగా తెలుగువారిని ఉద్దేశించి ప్రసంగిస్తారు. జులై 6వ తేదీన దక్షిణ కొరియాకు చెందిన టెక్ స్టార్టప్ సంస్థల ప్రతినిధులతో రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొని, పెట్టుబడులపై చర్చలు జరుపుతారు. అనంతరం, హ్యోసంగ్ భారీ పరిశ్రమల సంఘం అధ్యక్షుడు టకేషి యొకోటా, సియోల్ సెమీకండక్టర్స్ వైస్ ప్రెసిడెంట్ టేహ్యూంగ్ లీతో లోకేశ్ ప్రత్యేకంగా సమావేశమవుతారు. జులై 7న ప్రపంచ ప్రఖ్యాత ఎలక్ట్రానిక్స్ దిగ్గజం ఎల్జీ టవర్స్‌లో కీలక సమావేశం జరగనుంది. ఎల్జీ కెమ్ గ్లోబల్ స్ట్రాటజీ సెంటర్ ప్రెసిడెంట్ యున్ జు కోహ్ ఏర్పాటు చేసిన విందు సమావేశంలో లోకేశ్ పాల్గొంటారు. ఈ భేటీకి ఎల్జీ అనుబంధ సంస్థల ఉన్నత స్థాయి ప్రతినిధుల బృందాలు కూడా హాజరుకానున్నాయి. జులై 8వ తేదీన కొరియన్ మెరైన్ అక్విప్‌మెంట్ అసోసియేషన్ ప్రతినిధులతో భేటీ ఉంటుంది. జులై 9న కొరియన్ పొలిటికల్ అఫైర్స్, ఇంటర్నేషనల్ ట్రేడ్ ఘ ఇన్వెస్ట్‌మెంట్స్ విభాగాల డిప్యూటీ మంత్రులతో వేర్వేరుగా భేటీ అవుతారు. జులై 10వ తేదీన వివిధ సంస్థల ప్రతినిధులతో పెట్టుబడుల గురించి చర్చించడంతో పాటు, కొరియా ఆటో ఇండస్ట్రీ కోఆపరేషన్ ఏజెన్సీ ప్రతినిధులతో రౌండ్ టేబుల్ సమావేశానికి హాజరవుతారు. అదే రోజు రాత్రి, విశాఖలో జరగనున్న సీఐఐ పార్టనర్‌షిప్ సమ్మిట్-2026ను విజయవంతం చేయాలని కోరుతూ కొరియా కంపెనీల ప్రతినిధులతో నిర్వహించే ప్రత్యేక రోడ్ షోలో పాల్గొంటారు. 11వ తేదీన దక్షిణ కొరియా నుంచి తిరిగి రానున్నారు. ఈ పర్యటన ద్వారా ఏపీకి భారీగా పెట్టుబడులు వస్తాయని ప్రభుత్వం ఆశిస్తోంది.

## 20 ఏళ్ల కిందట తన చేతిలో ఓడిన ప్రత్యర్థికి కీలక పదవి

మొదటిపేజీ తరువాయి - మహమ్మద్ గౌస్ రబ్బానీకి ప్రభుత్వంలో సముచిత స్థానం కల్పిస్తామని ఆయన ప్రకటించారు. తన తొలి రాజకీయ విజయానికి 20 ఏళ్లు పూర్తయిన సందర్భంగా శనివారం మహబూబ్‌నగర్ జిల్లా మిడ్జిల్ మండలంలో ముఖ్యమంత్రి పర్యటించారు. 2006 జులై 4న జరిగిన జడ్పీటీసీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసిన రబ్బానీపై రేవంత్ రెడ్డి స్వతంత్ర అభ్యర్థిగా విజయం సాధించారు. ఈ చారిత్రక సందర్భాన్ని పురస్కరించుకుని ఏర్పాటు చేసిన సభలో ముఖ్యమంత్రి ప్రసంగించారు. రబ్బానీకి తగిన పదవిని గుర్తించి, బాధ్యతలు అప్పగించాలని అక్కడికక్కడే ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను ఆదేశించారు. దీనితో పాటు తన రాజకీయ ప్రస్థానం ప్రారంభమైన మిడ్జిల్ మండల సమగ్ర అభివృద్ధికి అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. నాటి సంఘటనలను గుర్తుచేసుకున్న రేవంత్ రెడ్డి, అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం రబ్బానీని జడ్పీ ఛైర్మన్‌గా నియమించాలని భావించిందని పేర్కొన్నారు. గత 35 ఏళ్లుగా సింగిల్ విండో ఛైర్మన్‌గా, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా పార్టీకి రబ్బానీ చేసిన సేవలు వృథా కావని ఆయన స్పష్టం చేశారు. ఈ పర్యటనలో భాగంగా ఉర్కొండపేటలోని పబ్బతి ఆంజనేయ స్వామి ఆలయంలో రేవంత్ రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించి, పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం మిడ్జిల్‌లో కల్వకుర్తి, నాగర్ కర్నూలు ప్రాంతాల్లో గుర్తింపు పొందిన నాయకుడు ద్యాప గోపాల్ రెడ్డి విగ్రహంతో పాటు, డాక్టర్ బీ.ఆర్. అంబేద్కర్ విగ్రహాన్ని ఆయన ఆవిష్కరించారు. రాజకీయాల్లో 20 ఏళ్లు.. భావోద్వేగ పోస్ట్ చేసిన సీఎం రేవంత్ రెడ్డి 20 ఎముతీం అఅ జూశీశ్రీఱఅఎం జవీ =వఋఖ్ష =వఎఎ ఒష్మీతీవం వశీఆశీఖ్రీ జూశీర్ రాజకీయాల్లో 20 ఏళ్లు పూర్తి చేసుకున్న సీఎం రేవంత్ రెడ్డి మిడ్జిల్ రేవంత్ రెడ్డి నుంచి రేవంతన్నగా తన ప్రస్థానాన్ని గుర్తుచేసుకున్న సీఎం తెలంగాణ పునర్నిర్మాణ శ్రామికుడిగా పనిచేస్తానని హామీ తనకు అండగా నిలిచిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన రాజకీయ ప్రస్థానంలో ఒక ముఖ్యమైన మైలురాయిని చేరుకున్నారు. ప్రజా జీవితంలోకి అడుగుపెట్టి 20 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఆయన శనివారం సోషల్ మీడియా వేదికగా ఒక భావోద్వేగభరితమైన పోస్ట్ చేశారు. తన సుదీర్ఘ ప్రయాణాన్ని గుర్తుచేసుకుంటూ, భవిష్యత్తు కార్యాచరణను ప్రజలతో పంచుకున్నారు. రెండు దశాబ్దాల క్రితం మిడ్జిల్‌లో 'రేవంత్ రెడ్డి'గా మొదలైన తన ప్రస్థానం, నేడు ప్రజల ఆదరాభిమానాలతో 'రేవంతన్న'గా వారి గుండెల్లో నిలిచిపోయిందని ఆయన పేర్కొన్నారు. ఈ అద్భుత ప్రయాణం తన జీవితంలో ఒక ప్రత్యేక అధ్యాయమని అభివర్ణించారు. ఈ 20 ఏళ్ల కాలంలో ప్రతి సంఘర్షణలో, ప్రజల కోసం తాను చేసిన ప్రతి పోరాటంలో అండగా నిలిచిన ఆత్మీయులకు, మిత్రులకు, శ్రేయోభిలాషులకు మరియు కార్యకర్తలకు ఆయన హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఇదే స్ఫూర్తితో భవిష్యత్తులో 'తెలంగాణ పునర్నిర్మాణ శ్రామికుడి'గా, ప్రజల ఆకాంక్షలను నెరవేర్చే సేవకుడిగా పనిచేస్తానని హామీ ఇచ్చారు. అన్నింటికీ మించి 'రేవంతన్న'గా ప్రజల హృదయాల్లో తన స్థానాన్ని మరింత సుస్థిరం చేసుకుంటానని మాట ఇచ్చారు. ప్రస్తుతం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన ఈ పోస్ట్ సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతోంది.

## పార్టీ పేరు మార్చాలంటూ ఈసీ ఆదేశం



మొదటిపేజీ తరువాయి - పేరుతో పార్టీ రిజిస్ట్రేషన్ కోసం ఆమె చేసుకున్న దరఖాస్తుపై ఏకంగా వెయ్యికి పైగా అభ్యంతరాలు వచ్చాయని సీఈసీ వెల్లడించింది. పార్టీ పేరు మార్చాల్సిందేనంటూ ఆదేశాలు జారీ చేసింది. పార్టీ నమోదు ప్రక్రియ ముందుకు సాగాలంటే 15 రోజుల్లోగా మరో మూడు ప్రత్యామ్నాయ పేర్లను తమకు సమర్పించాలని స్పష్టం చేస్తూ కవితకు అధికారికంగా లేఖ రాసింది. నిర్ణీత గడువులోగా కొత్త పేర్లు పంపకపోతే, ఎలాంటి ముందస్తు సమాచారం లేకుండానే పార్టీ రిజిస్ట్రేషన్ దరఖాస్తును క్లోజ్ చేస్తామని సీఈసీ ఆ లేఖలో కఠినంగా హెచ్చరించింది. ఈసీ పంపిన లేఖపై కల్వకుంట్ల కవిత అత్యంత ఘాటుగా స్పందించారు. ఎన్నికల సంఘం లేఖలో పేర్కొన్న అభ్యంతరాలకు తాము ఇప్పటికే రాతపూర్వక సమాధానాలు ఇచ్చామని తెలిపారు. ఈసీ కోరినట్లుగా ప్రత్యామ్నాయంగా కొత్త పేర్లను పంపే ప్రసక్తే లేదని ఆమె తేల్చిచెప్పారు. 'తెలంగాణ రక్షణ సేన' పేరుపైనే తాము ముందుకు వెళ్తామని, అవసరమైతే ఈ విషయంలో కేంద్ర ఎన్నికల సంఘంపై కోర్టుకు వెళ్లి న్యాయపోరాటం చేయడానికైనా సిద్ధమని కవిత స్పష్టం చేశారు. నిజానికి ఈ ఏడాది ఫిబ్రవరిలో కవిత తన కొత్త పార్టీ కోసం 'తెలంగాణ ప్రజా జాగృతి', 'తెలంగాణ జాగృతి', 'తెలంగాణ రక్షణ సేన', 'తెలంగాణ రాష్ట్ర జాగృతి', 'తెలంగాణ ప్రజా శక్తి' అనే ఐదు పేర్లను ఈసీకి ప్రతిపాదించారు. ఆ తర్వాత ఏప్రిల్ 25న మునీరాబాద్‌లో భారీ ఎత్తున నిర్వహించిన ఆవిర్భావ సభలో... తమ పార్టీ పేరు 'తెలంగాణ రాష్ట్ర సేన' (౧=సా) అని కవిత స్వయంగా ప్రకటించి, పార్టీ జెండాను కూడా ఆవిష్కరించారు. అయితే, ఆ తర్వాత కేవలం మూడు రోజుల వ్యవధిలోనే (ఏప్రిల్ 28న) ఈ పేరును 'తెలంగాణ రక్షణ సేన'గా మారుస్తూ, ఈ పేరుపై నెల రోజుల్లోగా ప్రజల నుంచి అభ్యంతరాలు కోరుతూ పత్రికల్లో నోటిఫికేషన్ ఇవ్వాలని ఈసీ ఆదేశించింది. మూడు రోజుల్లోనే 'రాష్ట్ర సేన' కాస్త 'రక్షణ సేన'గా ఎందుకు మారిందనే దానిపై అప్పట్లో పెద్ద ఎత్తున చర్చ నడిచింది. ప్రస్తుతం 'తెలంగాణ రక్షణ సేన' పేరుతోనే కవిత కేడర్‌ను సమాయత్తం చేస్తూ ప్రజా క్షేత్రంలో పోరాటాలు నిర్వహిస్తుండగా... ఇప్పుడు ఏకంగా వేల సంఖ్యలో అభ్యంతరాలు రావడం, ఈ ఈసీ స్పందన నేపథ్యంలో ఈ ౧=సా' పేరు కవితకు దక్కుతుందా? లేదా? అనేది ఉత్కంఠగా మారింది.

## మధ్యవర్తిత్వంలో పాకిస్థాన్‌తో పోలిక



మొదటిపేజీ తరువాయి - సరికాదని, అది అత్యంత అహేతుకమైన పోలిక అని చైనాలోని భారత రాయబారి విక్రమ్ దొరైస్వామి స్పష్టం చేశారు. ప్రతి దేశం తన జాతీయ ప్రయోజనాలను పరిగణనలోకి తీసుకునే నిర్ణయాలు తీసుకోవాలని ఆయన పేర్కొన్నారు. బీజింగ్‌లోని ఓ విశ్వవిద్యాలయంలో నిర్వహించిన 14వ ప్రపంచ శాంతి ఫోరంలో విక్రమ్ దొరైస్వామి ప్రసంగించారు. ఈ సందర్భంగా ఓ చైనా జర్నలిస్టు, పశ్చిమాసియాలో ఇరాన్-అమెరికా మధ్య ఉద్రిక్తతల నెలకొన్న తరుణంలో పాకిస్థాన్ మధ్యవర్తిత్వ ప్రయత్నాలు చేస్తోందని, ఈ విషయంలో భారత్ పాత్ర ఏమిటని ప్రశ్నించారు. దీనికి దొరైస్వామి సూటిగా సమాధానమిచ్చారు. "భారత్‌ను పాకిస్థాన్‌తో పోల్చడం కొంత అన్యాయమైన విషయం. ఇరు దేశాల ఆర్థిక వ్యవస్థలను పరిశీలిస్తేనే మీకు వాస్తవాలు అర్థమవుతాయి" అని ఆయన వ్యాఖ్యానించారు. అంతర్జాతీయ వ్యవస్థలో ఏ దేశం ఎలాంటి పాత్ర పోషిస్తోందన్న అంశం ఆధారంగానే వాటిని అంచనా వేయాలని సూచించారు. పశ్చిమాసియా వివాదంలో ఇప్పటికే పలు దేశాలు మధ్యవర్తిత్వానికి ప్రయత్నిస్తున్నాయని, ఈ రద్దీలో తాము చేరడం వల్ల ప్రత్యేకంగా ప్రయోజనం ఏమీ ఉండదని దొరైస్వామి అభిప్రాయపడ్డారు. గతంలో భారత్ ఇటువంటి పాత్రలు పోషించినప్పటికీ, ప్రస్తుత పరిస్థితుల్లో దీనివల్ల ఆశించిన ఫలితం ఉండదని స్పష్టం చేశారు. పశ్చిమాసియా, ఉక్రెయిన్ వంటి అంతర్జాతీయ సంక్షోభాల పరిష్కారంలో చైనా కూడా మధ్యవర్తిత్వానికి చొరవ చూపలేదన్న విషయాన్ని ఆయన పరోక్షంగా గుర్తుచేశారు. అగ్ర దేశాలు తమ వ్యూహాత్మక ప్రయోజనాలకు అనుగుణంగానే ఇటువంటి నిర్ణయాలు తీసుకుంటాయని ఆయన వివరించారు.

## కొత్తపల్లి అంగన్వాడి కేంద్రంలో పోషణ మాస కార్యక్రమం ఏర్పాటు



**పోరు తెలంగాణ ప్రతినిధి (భూమేశ్వర్) :** ముప్కాల్ మండలంలోని కొత్తపల్లి గ్రామ అంగన్వాడి కేంద్రంలో పోషణ మాస కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణీలకు బాలింతలకు 0-6 సంవత్సరం లోపు పిల్లలకు పోషక విలువలు వ్యక్తిగత పరిశుభ్రత ఆహార పదార్థాల వినియోగం లాంటి అంశాలపై అవగాహన కల్పించారు ఈ కార్యక్రమంలో సర్పంచ్ నిశాంత్, ఐసిడీఎస్ సూపర్వైజర్ మాధవి, ఐకెపి ఎపిఎం శ్యాం, కార్యదర్శి రాజు, అంగన్వాడీలు పద్మ, రేఖ, ఆశ, మానస, బాలింతలు పిల్ల తలలు పాల్గొన్నారు.

## బాల్కొండ మండల కేంద్రంలో పలు గణేష్ మండపాలను సందర్శించిన డిసిసి మాజీ అధ్యక్షులు



**పోరు తెలంగాణ ప్రతినిధి (భూమేశ్వర్) :** బాల్కొండ మండలంలో పలు వినాయక మండపాలను మాజీ డీసీసీ అధ్యక్షులు మానాల మోహన్ రెడ్డి సందర్శించారు. ఇత్వర్‌పేట్, జలాల్‌పూర్, కిసాన్ నగర్, బాల్కొండ గ్రామాల్లోని పలు వినాయక మండపాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...విఘ్నేశ్వరుడి ఆశీస్సులు,కృప రాష్ట్ర ప్రజలందరిపై ఎల్లప్పుడూ ఉండాలని, రైతులందరూ పాడిపంటలతో సుఖసంతోషాలతో ఉండాలని కోరుకున్నట్లు తెలిపారు. వినాయక నిమజ్జన కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో, ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని, నిమజ్జనం సమయంలో మండపాల నిర్వాహకులు మరియు యువత తగిన జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బాల్కొండ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ప్రవీణ్, వెంకటేష్ గౌడ్, సర్పంచ్ మోహన్ రెడ్డి,సర్పంచ్ సంతోష్, ప్రవీణ్ గౌడ్, కిషన్,గంగాధర్,సంజీవ్, వాజిద్,రవి,తౌటు గంగాధర్, శ్రీను,కపిల్,నగేష్, యుసుఫ్ గారు తదితర కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## యూరియా బుకింగ్‌కు రైతుల నానా తిప్పలు

### స్మార్ట్‌ఫోన్, యాప్‌పై అవగాహన లేక రైతుల ఇబ్బందులు



పోరు తెలంగాణ పతినిధి(దండేపల్లి).కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన యాప్ ఆధారిత యూరియా బుకింగ్ విధానంతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. యూరియా కోసం ముందస్తుగా యాప్‌లో బుకింగ్ చేసుకోవాల్సి ఉండటంతో, స్మార్ట్‌ఫోన్ లేని రైతులతో పాటు యాప్ వినియోగంపై అవగాహన లేని రైతులు నానా తిప్పలు పడుతున్నారు. యాప్‌లో నమోదు చేసుకోవడం, బుకింగ్ చేయడం వంటి ప్రక్రియలు తెలియక పలువురు రైతులు ఇతరుల సహాయం కోసం ఎదురుచూడాల్సిన పరిస్థితి నెలకొంది. గ్రామీణ ప్రాంతాల్లో స్మార్ట్‌ఫోన్ వినియోగంపై అవగాహన తక్కువగా ఉన్న రైతులకు ఈ విధానం మరింత ఇబ్బందికరంగా మారిందని రైతులు పేర్కొంటున్నారు. యూరియా బుకింగ్ ప్రక్రియను రైతులకు సులభతరం చేయడంతో పాటు, గ్రామస్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించి సహాయక కేంద్రాలను ఏర్పాటు చేయాలని రైతులు కోరుతున్నారు.

## ప్రభుత్వ పాఠశాలలో అల్పాహారం ప్రారంభం

### సర్పంచ్ జీల రాజు ఆధ్వర్యంలో



**పోరు తెలంగాణ ఓదెల ప్రతినిధి రవీంద్ర చారి :** పెద్దపల్లి జిల్లా ఓదెల మండలం శాన గొండ ప్రభుత్వ పాఠశాలలో హరే రామ హరే కృష్ణ ఫౌండేషన్ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాపకంగా ప్రవేశపెట్టిన అల్పాహారాన్ని స్థానిక సర్పంచ్ జీల రాజు పాలకవర్గంతో ప్రారంభించారు కార్యక్రమంలో విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు

## తేనీటి విందులో పాల్గొన్న రేగా కాంతారావు దంపతులు





**భద్రాద్రి కొత్తగూడెం,(పోరు తెలంగాణ-పినపాక నియోజకవర్గ ప్రతినిధి-వల్లెపోగు రాము)అశ్వాపురం, సెప్టెంబర్ 21:-** మండల దీ=ూ పార్టీ సీనియర్ నాయకులు కందుల కృష్ణార్జున్ రావు ఇంట్లో ఏర్పాటు చేసిన తేనీటి విందుకు హాజరైన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షులుడపినపాక మాజీ శాసనసభ్యులు రేగా కాంతారావు-సుధారాణి దంపతులు. ఈకార్యక్రమంలో మండలం యువజన అధ్యక్షులు గద్దల రామకృష్ణ, కళ్యాణంపురం ఉపసర్పంచ్ చల్లా రాజేష్,జగ్గారం మాజీ సర్పంచ్ రాంబాబు,నజీర్ షోను, మేకల భాస్కర్, శాంసోను,సతీష్, సీనియర్ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# మారెళ్లపాడు ప్రాజెక్టు పేటెంట్ బిఆర్ఎస్ పార్టీ దే

### సొమ్మొకరిది-సోకొకరిది
### కేసిఆర్ స్వప్నం సీతారామ ప్రాజెక్టు.
### రేగా కాంతారావు మానస పుత్రిక మారెళ్ళపాడు.
### బిఆర్ఎస్ పోరాట ఫలితమే లెఫ్ట్ కెనాల్ నిర్మాణం.
### అశ్వాపురం బిఆర్ఎస్ పార్టీ డిమాండ్.





**భద్రాద్రి కొత్తగూడెం,(పోరు తెలంగాణ- పినపాక నియోజకవర్గం ప్రతినిధి-వల్లెపోగు రాము)అశ్వాపురం సెప్టెంబర్ 21:-** కెసిఆర్ కలల స్వప్నం సీతారామ ప్రాజెక్టు,రేగా కాంతారావు మానస పుత్రిక మారెళ్ళపాడు ఎత్తిపోతల పథకమని కేవలం ఈ ప్రభుత్వంలో 25 కోట్ల రూపాయల వ్యయంతో లెఫ్ట్ కెనాల్ మాత్రమే నిర్మించారని,తక్షణమే మిగిలిన పనులను ప్రారంభించి మారెళ్ళ పాడు రిజర్వాయర్కు గోదావరి నీళ్లు తరలించి,తద్వారా మండలంలోని అన్ని చెరువులను,కుంటలను నింపి మండలంలోని ప్రతి ఎకరాకు గోదావరి జలాలను అందించాలని,మండల రైతాంగానికి రాష్ట్ర మంత్రులు హామీ ఇవ్వాలని అశ్వాపురం బిఆర్ఎస్ పార్టీ మండల నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.అశ్వాపురం మండల కేంద్రంలోని తెలంగాణ భవన్ లో మండల అధ్యక్షుడు కోడి అమరేందర్ ఆధ్వర్యంలో నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో మండల అధ్యక్షులు కోడి అమరేందర్ మాట్లాడుతూ మారెళ్లపాడు ఎత్తిపోతల పథకం గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో తెలంగాణా తొలి ముఖ్యమంత్రి కేసీఆర్,పినపాక శాసనసభ్యులు రేగా కాంతారావు ప్రత్యేక చొరవతో మంజూరైన పథకమని.2023 జనవరిలో రూ.420 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టిన ఈ పథకానికి మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు ప్రత్యేక చొరవతో తక్షణమే రూ.25 కోట్ల నిధులు మంజూరు చేయించి పనులకు శ్రీకారం చుట్టారని తెలిపారు.కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సుమారు రెండేళ్లపాటు మారెళ్ళపాడు పనులపై నిర్లక్ష్యంగా వ్యవహరించిందని బీఆర్ఎస్ నాయకులు విమర్శించారు.ఈ ప్రాంత రైతుల త్యాగంతో నిర్మించిన సీతారామ ప్రాజెక్టు ద్వారా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు స్విచ్లు వస్తే మోటార్లు ఆన్ చేసి గోదావరి జలాలను నెత్తిన చల్లుకొని ఖమ్మం జిల్లాకు నీళ్లు తరలించకు పోతుంటే, ఈ ప్రాంత రైతాంగానికి సాగునీరు ఇవ్వకుండా చుక్క నీరు కూడా ఇక్కడి నుంచి తరలించేది లేదని బిఆర్ఎస్ పార్టీ హెచ్చరిక తో, స్థానిక రైతాంగంతో కలిసి బిఆర్ఎస్ పార్టీ నిర్వహించిన నిరంతర పోరాటాల,ఆందోళనల ఫలితమే నేడు మారెళ్ళ పాడు లెఫ్ట్ కెనాల్ నిర్మాణమని ఆయన అన్నారు.సాగునీళ్ల కోసం పోరాటం చేస్తుంటే మా పార్టీ నాయకులను జైలుకు పంపిన ఘనత కూడా ఈ ప్రభుత్వానికి దక్కుతుందన్నారు. కేవలం మారెళ్ళ పాడు లెఫ్ట్ కెనాల్ పనులు మాత్రమే పూర్తయ్యాయని,25 కోట్ల రూపాయల పనులకు మూడు సంవత్సరాలు పడితే మిగిలిన 400 కోట్ల రూపాయల పనులకు ఎన్ని సంవత్సరాలు పడుతుందని,తక్షణమే నేడు అశ్వాపురం మండలానికి విచ్చేస్తున్న మంత్రులు మిగిలిన పనులను పూర్తి చేస్తామని హామీ ఇవ్వాలని డిమాండ్ చేశారు.నీళ్ల నిధులు నియామకాల కోసం ఏర్పడిన తెలంగాణలో స్వరాష్ట్రంలో కరువైనా,కాలమైనా రాష్ట్రంలో రైతాంగానికి సాగునీటి కొరత ఉండకూడదని, వృధాగా సముద్రానికి పోతున్న గోదావరి జిల్లాలను ఒడిసిపట్టి ఉమ్మడి ఖమ్మం,మహబూబాబాద్ జిల్లాల్లోని రైతాంగానికి సాగునీరు అందించాలనే లక్ష్యంతో తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ సీతారామ ప్రాజెక్టును ప్రతిష్టాత్మకంగా చేపట్టారని బిఆర్ఎస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి మర్రి మల్లారెడ్డి అన్నారు. 2005 లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ దివంగత ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర్ రెడ్డి ప్రభుత్వంలో మండలంలో రాజీవ్ సాగర్ ప్రాజెక్టు నిర్మాణం తలపెట్టారని,2005 నుండి 2014 వరకు వారు అధికారంలో ఉన్న తొమ్మిది సంవత్సరాలు ఆ పనులు కాగితాలకే పరిమితం అయ్యాయని ఎద్దేవా చేశారు. ఈ ప్రాజెక్టు ద్వారా గోదావరి జలాలను ఆంధ్ర ప్రాంతానికి తరలించే డిజైన్ ఉన్న ఈ ప్రాజెక్టును రీ డిజైన్ చేసి సీతారామ ప్రాజెక్టుగా రూపకల్పన చేసి తరలించే ఆరు లక్షల ఎకరాలకు సాగు నీరందించే లక్ష్యంతో 2017లో శంకుస్థాపన చేసిన సీతారామ ప్రాజెక్టు పనులు శరవేగంగా పూర్తిచేసి రైతులకు సాగునీరు అందించాలనే లక్ష్యంతో గత ప్రభుత్వం ముందుకు సాగిందన్నారు.గత ప్రభుత్వం చేసిన నిర్మాణంతోటే కృషి తోటే నేడు గోదావరి జిల్లాలు బీడు భూములుగా మారిన సాగు భూములకు తరలుతున్నాయని ఆయన అన్నారు. ఈ విషయం ఈ ప్రభుత్వంలో ఉన్న మంత్రులు గత ప్రభుత్వంలో కూడా మంత్రులుగా ఉన్నారని వారికి తెలుసన్నారు. ఎన్ని మాయ మాటలు చెప్పిన సాగునీటి ప్రాజెక్టుల చిత్తశుద్ధి, రైతులపై చిత్తశుద్ధి ఉన్నది బిఆర్ఎస్ పార్టీకేనని అది రాష్ట్ర రైతాంగానికి మొత్తం తెలుసని ఆయన పేర్కొన్నారు.మారెళ్ళ పాడు ఎత్తిపోతల పథకం పేటెంట్ బిఆర్ఎస్ పార్టీ కే చెందుతుందని బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు సూది రెడ్డి గోపాలకృష్ణారెడ్డి అన్నారు.గత ప్రభుత్వంలో సీతారామ ప్రాజెక్టు నిర్మాణంలో భాగమైన మారెళ్ళ పాడు ఎత్తిపోతల పథకం 420 కోట్లతో మంజూరు అయిందని,ఈ పథకం డిజైన్ మారెళ్ళ పాడు రిజర్వాయర్కు నీటిని తరలించి అశ్వాపురం మండలంలోని ప్రతి ఎకరాకు,ఏజెన్సీ ప్రాంతంలో ఉన్న సాగుభూములతో సహా సాగునీరు అందించాలని ఉద్దేశంతో దీన్ని డిజైన్ చేశారన్నారు.25 కోట్ల పనులకు మారెళ్లపాడు లెఫ్ట్ కెనాల్ మాత్రమే పూర్తయిందని,కేవలం ఆరు పంచాయతీల రైతుల సాగుభూమి తుమ్మలచెరువు ఆయకట్టుకు మాత్రమే నీరు అందుతుందని,మిగిలిన పనులను కూడా తక్షణమే పూర్తిచేసి అశ్వాపురం మండలంలోని అన్ని చెరువులు కుంటలు నింపి సాగు భూములకు నిరంధించాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.నిర్మాణం విషయంలో కూడా గత ప్రభుత్వంలో రూపొందించిన రూ.420 కోట్ల ప్రాజెక్టు డిజైన్‌నే కొనసాగించాలని ప్రస్తుతం డిజైన్‌లో మార్పులు చేయడం వల్ల భవిష్యత్తులో రైతులకు తీవ్ర నష్టం జరిగే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.ఏజెన్సీ ప్రాంతంలోని అన్ని గ్రామపంచాయతీల ఆయకట్టు రైతులకు సాగునీరు అందించేలా ప్రభుత్వం స్పష్టమైన హామీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. తక్షణమే మారెళ్ళ పాడు ఎత్తిపోతల పథకానికి సంబంధించిన మిగిలిన పనులను ప్రారంభించాలని,లేనిపక్షంలో మండల రైతాంగంతో కలిసి బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలు నిర్వహిస్తామని హెచ్చరించారు... ఈ కార్యక్రమంలో మండల దీ=ూ పార్టీ ప్రధాన కార్యదర్శి మర్రి మల్లారెడ్డి,సీనియర్ నాయకులు ఈదరా సత్యనారాయణ,జాలే రామకృష్ణ రెడ్డి,కందుల కృష్ణార్జునరావు,మాజీ ఎంపీపీ కొల్లు మల్లారెడ్డి,మాజీ వైస్ ఎంపీపీ కంచుగట్ల వీరభద్రం,సూదిరెడ్డి గోపిరెడ్డి,నియోజకవర్గం ఎస్సీ సెల్ అధ్యక్షుడు వెన్న అశోక్ కుమార్,నియోజకవర్గ యువజన విభాగం ఉప అధ్యక్షుడుబిజగ్గారం ఉప సర్పంచ్ లంకెల రమేష్,మండల యువజన అధ్యక్షులు గద్దల రామకృష్ణ,సీనియర్ నాయకులు నేలపట్ల సత్యనారాయణ రెడ్డి,నక్కనబోయిన పాపారావు,చిలక వెంకటరమయ్య,కల్యాణపురం సర్పంచ్ లకావత్ రామారావు,గొల్లగూడెం సర్పంచ్ కోండ్రు సోమయ్య,గొల్లగూడెం ఉప సర్పంచ్ బొల్లినేని గణేష్,ఆనందాపురం ఉపసర్పంచ్ దేవనబోయిన మహేష్,మల్లెలమడుగు ఉప సర్పంచ్ గాడిద మహేష్,కల్యాణపురం ఉప సర్పంచ్ చల్లా రాజేష్ తదితర నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఆంధ్ర రాష్ట్రానికి భద్రాచలం డిపో నుండి బస్సులు పొడిగింపు

### భద్రాచలం బస్ డిపో మేనేజర్ జంగయ్య వెల్లడి.




**భద్రాచలం సెప్టెంబర్ 21 పోరు తెలంగాణ జిల్లా ప్రతినిధి కూరపాటి దాసు :** భద్రాచలం డిపో నుండి ఆంధ్ర రాష్ట్రానికి పెంచిన బస్సు సర్వీస్ లు విజయవాడ సెక్టార్ నందు సూపర్ లగ్జరీ బస్సు లు 3.00, 4.20, 5.30, 13.40, 14.10, 15.00 గంటలకు బయలుదేరు తాయని, తిరుగు ప్రయాణం లో 7.45, 8.45, 10.00, 19.00, 19.30, 20.00 గంటలకు బయలుదేరుతాయని, గుంటూరు సెక్టార్ నందు ఢిలక్స్ బస్సు లు 8.20, మరియు 20.00 గంటలకు బయలుదేరు తాయని, తిరుగుప్రయాణంలో 8.10, 16.30 గంటలకు బయలుదేరు తాయని, అమలాపురం వయ కుక్కునూరు, రాజమండ్రి మీదుగా డీలక్స్ బస్సు లు 4.30, 10.30 గంటలకు మరియు బస్సు 21.00 బయలు దేరు తాయని, తిరుగుప్రయాణంలో 8.15 గంటలకు మరియు డీలక్స్ బస్సు లు 16.30, 21.00 గంటలకు బయలుదేరు తాయని, భీమవరం వయ పాల్వంచ, దమ్మపేట, చింతలపూడి, ఏలూరు ద్వారా డీలక్స్ బస్సు ఉదయం 6.30 గంటలకు బయలుదేరు బయలుదేరుతుందని, తిరుగు ప్రయాణంలో మధ్యాహ్నం 1.45 గంటలకు బయలుదేరి ఏలూరు వయ కొత్తగూడెం, సత్తుపల్లి, చింతలపూడి మీదుగా భద్రాచలం చేరుతుందని, అలాగే డీలక్స్ బస్సు మధ్యాహ్నం 2:00 గంటలకు భద్రాచలం నుండి బయలుదేరి వయా కొత్తగూడెం సత్తుపల్లి చింతలపూడి ఏలూరుకు వెళుతుందని, మరుసటి రోజు తిరుగు ప్రయాణంలో ఏలూరులో ఉదయం 8.00 గంటలకు భద్రాచలం కు బయలుదేరుతోందని ఆయన అన్నారు. అన్ని సర్వీస్ లకు రిజర్వేషన్ సౌకర్యం కలదు. భద్రాచలం చుట్టు ప్రక్కల ప్రజలు ఈ యొక్క అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని భద్రాచలం డిపో మేనేజర్ పి జంగయ్య కోరారు.

# ఘనంగా 50 సంవత్సరాల జెండా ఆవిష్కరణ కార్యక్రమం

### అంబేద్కర్ ఆశయాలను కొనసాగిద్దాం



**పోరు తెలంగాణ నెక్కొండ సెప్టెంబర్ 21 :** తెలంగాణ రాష్ట్ర అంబేద్కర్ యువజన సంఘం వరంగల్ జిల్లా అధ్యక్షులు మాంకాల యాదగిరి వరంగల్ జిల్లా పరిధిలోని వరంగల్ ఆర్టిఏ జంక్షన్ ఖమ్మం రోడ్డులో అంబేద్కర్ జంక్షన్లో తెలంగాణ రాష్ట్ర అంబేద్కర్ యువజన సంఘం 50 సంవత్సరాల జెండావిష్కరణ కార్యక్రమాన్ని వరంగల్ జిల్లా అధ్యక్షుడు మాంకాల యాదగిరి ఆవిష్కరించడం జరిగినది, అనంతరం జిల్లా అధ్యక్షులు మాంకాల యాదగిరి మాట్లాడుతూ భారత రాజ్యాంగ నిర్మాత, ఆర్థిక శాస్త్రవేత్త, సామాజిక, సాంఘిక రాజకీయం బాబాసాహెబ్ డాక్టర్ అంబేద్కర్ గారి పేరు మీద 1976 సంవత్సరంలో ఆంధ్రప్రదేశ్ అంబేద్కర్ యువజన సంఘం ఏర్పాటు చేయడం జరిగింది ఈ సంఘం 1033/77 నెంబర్ తో సెప్టెంబర్ 21, 1977 తో ఏర్పాటు చేయడం జరిగింది, నేటికీ 50 సంవత్సరాలు రజితోత్సవ గోల్డెన్ జూబ్లీ ఉత్సవాలను నిర్వహించడం జరుగుతున్నది, ఇట్టి సుదీర్ఘ కాలంలో అనేకమంది సభ్యులు సంఘ నిర్మాణం కొరకు సంఘ భవిష్యత్ కొరకు కృషి చేయడం జరిగింది, సంఘంలో సేవలతించి మరణించిన వారికి ఈ సందర్భంగా జోహార్లు అర్పిస్తూ ఘన నివాళులు, నినాదాలు చేయడం జరిగింది, యువత అంబేద్కర్ ఆదర్శంగా తీసుకొని అంబేద్కర్ఆలోచన విధానాన్ని, సామాజిక చైతన్యశీ కొరకు కృషి చేయాలని, అంబేద్కర్ ఆశయాలను కొనసాగిస్తూ యువకులు, యువజన సంఘాలు నిలవాలని పిలుపునివ్వడం జరిగింది ఈ కార్యక్రమంలో ఉమ్మడి వరంగల్ జిల్లా సాంస్కృతిక కార్యదర్శి కళా వెంకట్, ఉసిల్ల మల్లయ్య , ఉశిల్ల నరసింహారావు, అంబేద్కర్ విగ్రహ కమిటీ అధ్యక్షులు సాదు రాజశేఖర్, సభ్యులు సీదురి రుద్రాన్ష్, ఎర్ర సాయికిరణ్, సిద్దు, మన్నె నర్సింగం, పాకనటి రవి తదితరులు పాల్గొన్నారు

# వినాయక నిమజ్జనంపై కీలక సమావేశం



**పోరు తెలంగాణ ప్రతినిధి // మెట్ పల్లి వేంపేట్:** వేంపేట్ గ్రామంలో వినాయక నిమజ్జన కార్యక్రమాన్ని ప్రశాంతంగా, భక్తిశ్రద్ధలతో, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా నిర్వహించేందుకు గ్రామపంచాయతీ పాలకవర్గం ఆధ్వర్యంలో వినాయక మండపాల నిర్వాహకులు, యూత్ అధ్యక్షులు, సభ్యులతో కీలక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి సర్పంచ్ గోరుమంతుల ప్రవీణ్ కుమార్ అధ్యక్షత వహించారు. ఈ సమావేశానికి మెట్‌పల్లి ఎస్సై కిరణ్ ముఖ్య అతిథిగా హాజరై నిమజ్జన కార్యక్రమంలో తీసుకోవాల్సిన భద్రతా చర్యలు, ట్రాఫిక్ నియంత్రణ, యువత పాటించాల్సిన జాగ్రత్తలపై పలు సూచనలు చేశారు. ముఖ్యంగా డీజే వినియోగం, అధిక శబ్దం వల్ల కలిగే ఇబ్బందులు, శబ్ద కాలుష్యం తదితర అంశాలపై వివరించారు. పోలీసుల సూచనలు, నిబంధనలు పాటిస్తూ నిమజ్జన కార్యక్రమాన్ని ప్రశాంతంగా నిర్వహించాలని కోరారు. ఈ సందర్భంగా సర్పంచ్ గోరుమంతుల ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ వేంపేట్ గ్రామంలో వినాయక నిమజ్జన కార్యక్రమాన్ని అందరూ కలిసి ఐక్యత, సోదరభావంతో విజయవంతం చేయాలని కోరారు. ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరిస్తూ శాంతిభద్రతలకు ఎలాంటి విఘాతం కలగకుండా సహకరించాలని హితవు పలికారు. వినాయక మండపాల నిర్వాహకులు, యూత్ అధ్యక్షులు మాట్లాడుతూ నిమజ్జన కార్యక్రమం విజయవంతంగా నిర్వహించేందుకు గ్రామపంచాయతీ పాలకవర్గానికి, పోలీసులకు అన్ని విధాలా సహకరిస్తామని తెలిపారు. అనంతరం మెట్‌పల్లి ఎస్సై కిరణ్‌ను గ్రామపంచాయతీ పాలకవర్గం, వినాయక మండపాల నిర్వాహకులు మరియు యూత్ ప్రతినిధులు శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ సమావేశంలో ఉపసర్పంచ్ అల్లూరి సురేందర్ రెడ్డి, వార్డు సభ్యులు చంద్రాచారి దశకంఠ రాజు, జెల్ల శ్రీనివాస్ యాదవ్, నల్ల రాజశేఖర్ రెడ్డి, నలిమేల అంజిరెడ్డి, పాలకవర్గ సభ్యులు గోరుమంతుల రఘు, మారంపెల్లి లత- రమేష్,బీర్కుల మౌనిక--మహేష్, మగ్గిడి శైలజ--రాము, అలాగే వివిధ వినాయక మండపాల నిర్వాహకులు మరియు యూత్ అధ్యక్షులు పాల్గొన్నారు.

# ఉత్తమ ఉపాధ్యాయులకు అవార్డుల ప్రధానం



**మహేశ్వరం, సెప్టెంబర్ 21, పోరు తెలంగాణ న్యూస్ ప్రతినిధి :** మహేశ్వరం మండల పరిషత్ సమావేశ మందిరంలో ఉత్తమ ఉపాధ్యాయుల అవార్డు ప్రధాన ఉత్సవ కార్యక్రమం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో శారదమ్మ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ.. విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని తెలిపారు. సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల సేవలు ఎంతో విలువైనవని ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన ఎంఈఓ కస్నా నాయక్ మాట్లాడుతూ.. విద్యార్థులను ఉన్నత స్థితికి తెస్తున్న ఉపాధ్యాయుల పాత్ర ఎంతో గొప్పదని ఆయన పేర్కొన్నారు. మండల స్థాయిలో ఎంపికైన 20 మంది ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పి ఆర్ టి యు తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు జానకిరామ్, గౌరవాధ్యక్షులు ఆనంద్ కుమార్, ప్రధాన కార్యదర్శి మధుసూదన్ రెడ్డి, యుటిఎఫ్ అధ్యక్షులు ఆంజనేయులు, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, ఎస్ యు టి ఎస్ అధ్యక్షులు చంద్రశేఖర్, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ టి ఏ పి యు ఎస్ అధ్యక్షులు వసంత్ కుమార్, ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ రెడ్డి పాల్గొన్నారు.

# జైపూర్ ప్రజావాణి కి రెండు ఫిర్యాదులు



**పోరు తెలంగాణ మంచిర్యాల జిల్లా సెప్టెంబర్ 21 :** జైపూర్ మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సోమవారం, ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి మండలంలోని వివిధ శాఖలకు చెందిన మండల స్థాయి అధికారులు హాజరై ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా మొత్తం రెండు ఫిర్యాదులు అందగా, వాటిలో రెవెన్యూ శాఖకు (01) మరియు విద్యుత్తు శాఖకు (01) చొప్పున ఫిర్యాదులు వచ్చాయి. సంబంధిత శాఖల అధికారులు ఫిర్యాదులను స్వీకరించి, వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించడం జరిగింది. ఈ సందర్భంగా ఎంపీడీవో శ్రీపతి బాపు రావు మాట్లాడుతూ, మండలంలోని అన్ని గ్రామాల ప్రజలు ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని, తమ సమస్యలకు సంబంధించిన ఫిర్యాదులను ప్రజావాణిలో సమర్పించి పరిష్కారం పొందవచ్చని తెలిపారు.

# బూర్గంపాడు మండలం లో ఇందిరమ్మ ఇళ్ల పట్టాలు పంపిణీ,సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే పాయం

**భద్రాద్రి కొత్తగూడెం,పోరు తెలంగాణ-పినపాక నియోజకవర్గం ప్రతినిధి భూర్గంపాడు, సెప్టెంబర్ 21:-** మండలం ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో పినపాక శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు 30మంది లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల పట్టాలను పంపిణీ చేశారు. అలాగే రూ.7లక్షల 80 వేల రూపాయల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తున్నామని తెలిపారు. పేదల సొంతింటి కలను నెరవేర్చడంతో పాటు, ఆపదలో ఉన్న కుటుంబాలకు సీఎంఆర్ఎఫ్ ద్వారా ఆర్థిక భరోసా కల్పిస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి పోతిరెడ్డి వెంకటేశ్వర్ రెడ్డి కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి వారాల వేణు ఎంపీడీవో,హౌసింగ్ ఏఈ, మండల అధ్యక్షులు, సర్పంచులు,ఉపసర్పంచులు, వార్డు సభ్యులు,ముఖ్య నాయకులు, అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

# భీమారం మండలంలోని వెంచర్లపై ఆరా

## డీటీసీపీ పేరుతో మోసం? పూర్తి వివరాలు ఇవ్వాలని ప్రజావాణిలో వినతి.



**పోరు తెలంగాణ మంచిర్యాల, సెప్టెంబర్ 21 :** మంచిర్యాల జిల్లా భీమారం మండల పరిధిలోని రియల్ ఎస్టేట్ వెంచర్లపై అధికారులు ఆరా తీయాలని మండల పౌరుడు మంతెన నమ్మయ్య డిమాండ్ చేశారు. భీమారం మండల పరిధిలోని గ్రామాల్లో డీటీసీపీ లే-అవుట్స్ అంటూ కొందరు ప్రజలను బహిరంగంగానే మోసం చేస్తున్నారని, సోషల్ మీడియాలో విస్తృత ప్రచారం చేస్తున్నారని ఆదివారం ప్రజాపాలన కార్యక్రమంలో నోడల్ అధికారికి వినతి పత్రం అందజేశారు. మండల వ్యాప్తంగా ఎన్ని వెంచర్లు ఉన్నాయి? వాటికి డీటీసీపీ అనుమతి ఉందా? లేదా? అనుమతి ఉంటే ఆయా వెంచర్ల అనుమతి సంఖ్య, పంచాయతీ ధృవీకరణ తేదీ, రహదారులు, పార్కులు, మౌలిక వసతులు ఉన్నాయా? లేవా? అనే పూర్తి వివరాలను అధికారికంగా సేకరించి ఇవ్వాలని కోరారు. అదేవిధంగా నిబంధనలకు విరుద్ధంగా, అనుమతులు లేకుండా ప్లాట్ల విక్రయాలు జరుపుతున్న వెంచర్లపై ఇప్పటివరకు తీసుకున్న చర్యలేంటో తెలపాలని వినతిలో పేర్కొన్నారు. ప్రజల ప్రయోజనార్థం ఈ సమాచారాన్ని ప్రజావాణి ద్వారా అందించాలని ఆయన కోరారు.

# షాద్ నగర్ నుండి ఇబ్రహీంపట్నం వరకు బస్సులను నడపాలి



**మహేశ్వరం సెప్టెంబర్ 21, పోరు తెలంగాణ న్యూస్ ప్రతినిధి :** షాద్ నగర్, మహేశ్వరం నుండి ఇబ్రహీంపట్నం వరకు ఆర్టీసీ బస్సులను నడపాలని కోరుతూ శివగంగా దేవాలయం చైర్మన్ అల్లె కుమార్ నియోజకవర్గంకాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి, మాజీ ఎమ్మెల్యే కేఎల్ఆర్ ఆదేశంతో సోమవారం గ్రేటర్ హైదరాబాద్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ శ్రీధర్ కు వినతిపత్రాన్ని అందజేశారు. షాద్ నగర్ నుండి ఇబ్రహీంపట్నం వరకు అనేక మంది వ్యాపారస్తులు, విద్యార్థులు, రైతులు, ఉద్యోగస్తులు మహేశ్వరం ప్రాంతం నుండి వివిధ పనులకు వెళ్లడం జరుగుతుందని తెలిపారు. ఈ ప్రాంత ప్రజలకు బస్సులు లేక అనేక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని తెలిపారు. ప్రజల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని షాద్ నగర్, మహేశ్వరం నుండి ఇబ్రహీంపట్నం వరకు బస్సులను నడిచే విధంగా ఏర్పాట్లు చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు తిరుపతయ్య, రాములు, రాఘవేందర్ రెడ్డి పాల్గొన్నారు.

# ఓదెలలో కొండా లక్ష్మణ్ బాపూజీ వర్ధంతి వేడుకలు

## గ్రామ శాఖ అధ్యక్షులు ఇప్పనపల్లి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో



**పోరు తెలంగాణ ఓదెల ప్రతినిధి రవీంద్ర చారి :** ఓదెల మండల కేంద్రంలో కొండా లక్ష్మణ్ బాపూజీ వర్ధంతి సందర్భంగా ఓదెల గ్రామ పద్మశాలి సంఘం అధ్యక్షులు డాక్టర్ ఇప్పనపల్లి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ఘన నివాళి అర్పించడం జరిగినది ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పద్మశాలిలు సమాజంలో ఆర్థికంగా రాజకీయంగా ఎంతో ఎదగాలని అన్నారు ఈకార్యక్రమంలో పద్మశాలి సంఘం ప్రధాన కార్యదర్శి మెరుగు సారంగం ముఖ్యఅతిథిగా రూపు నారాయణపేట మాజీ సర్పంచ్ అంకం రమేష్ ఓదెల పద్మశాలి సంగం గౌరవ అధ్యక్షులు మెరుగు భీష్మ చారి కమిటీ సభ్యులు క్యాతం టైలర్ శ్రీనివాస్ , మెడికల్ రాజేంద్రప్రసాద్ సదానందం సత్యనారాయణ తాటికొండ సత్యం వంగరి రమేష్ సింగని నరసింహులు గుండేటి కుమార్ బూర రామచంద్రం ఆడెపు రవి కొక్కుల సదానందం అరూకాల హోటల్ సదానందం కుల బాంధవులు అందరు కలిసి ఘనంగా బాపూజీకి ఘన నివాళి అర్పించినారు

# కొండ లక్ష్మణ్ బాపూజీ వర్ధంతి ఘనంగా నిర్వహణ



**పోరు తెలంగాణ సెప్టెంబర్ 21: కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి :** కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా వాంకిడి మండల కేంద్రంలోని జేత్వాన్ బుద్ధ విహార్‌లో సోమవారం స్వాతంత్ర్య సమరయోధుడు కొండ లక్ష్మణ్ బాపూజీ 14వ వర్ధంతిని లక్ష్మణ సేవా సదన్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించారు. చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పరిసర ప్రాంతాల వారికి, బుద్ధ విహార్‌లో అరటిపండ్లు పంపిణీ చేశారు. సొసైటీ చైర్మన్ గాదే అవినాష్ కొండ లక్ష్మణ్ బాపూజీ సేవలను, ప్రజా ఉద్యమాలను ప్రస్తావించారు. బాపూజీ వాంకిడి మండల కేంద్రంలో జన్మించడం గర్వకారణమని, ప్రతి సంవత్సరం ఆయన జ్ఞాపకార్థం జయంతి, వర్ధంతి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ అశోక్ ముహుల్కర్, మడావి దౌలత్, సాగ్రావ్ డోన్డోజి దుర్గే, కోబ్రాగడే తదితరులు పాల్గొన్నారు.

## భూ సేకరణ, పునరావాస

# ప్రక్రియ వేగవంతం చేయాలి

## నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి....




**పోరు తెలంగాణ సెప్టెంబర్ 21: కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి :** కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా సాగునీటి ప్రాజెక్టులు, కాలువల నిర్మాణంలో భూములు, ఇండ్లు కోల్పోతున్న వారికి మెరుగైన పరిహారం అందించి పునరావాసం కల్పించాలని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి సూచించారు. సోమవారం హైదరాబాద్‌లోని సచివాలయం నుంచి రవాణా, వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, నీటిపారుదల శాఖ కార్యదర్శులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, చీఫ్ ఇంజనీర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రతిష్టాత్మక సాగునీటి ప్రాజెక్టులు, కాలువల నిర్మాణంలో ముంపునకు గురయ్యే భూముల సేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని, భూములు, ఇండ్లు కోల్పోయే వారికి త్వరగా పరిహారం అందించి పునరావాసం కల్పించాలని, రైతులకు మెరుగైన మార్కెట్ ధర ప్రకారం పరిహారం చెల్లించాలని ఆదేశించారు. భూసేకరణ, పునరావాస ప్రక్రియలో ఆలస్యం జరగకుండా రెవెన్యూ, నీటిపారుదల శాఖల అధికారులు సమన్వయంతో వ్యవహరించాలని సూచించారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఎం. డేవిడ్, నీటిపారుదల శాఖ ఇంజనీరింగ్ అధికారులు తిరుపతి, భద్రయ్య, కె.వి. రమణ, వేణుగోపాల్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# హియరింగ్ ప్రక్రియ వేగవంతం చేయాలి

## రాష్ట్ర ముఖ్య ఎలక్టోరల్ అధికారి సుదర్శన్ రెడ్డి....



**పోరు తెలంగాణ సెప్టెంబర్ 21: కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి :** కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణలో భాగంగా మ్యాపింగ్ కాని, అనమలిస్ ఓటర్లకు నోటీసులు జారీ చేసి హియరింగ్ ప్రక్రియను వేగవంతం చేయాలని రాష్ట్ర ముఖ్య ఎలక్టోరల్ అధికారి సుదర్శన్ రెడ్డి సూచించారు. సోమవారం హైదరాబాద్‌లోని కార్యాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, సబ్ కలెక్టర్లు, రెవెన్యూ మండల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. అక్టోబర్ 20లోగా అనమలిస్ జాబితాలోని ఓటర్లు, మ్యాపింగ్ కాని ఓటర్ల హియరింగ్ ప్రక్రియ పూర్తి చేయాలని, డేటా ఎంట్రీలో పొరపాట్లు లేకుండా పర్యవేక్షించాలని, ఫారం 6, 7, 8 దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలని, హియరింగ్ ప్రక్రియను ప్రశాంతంగా చేపట్టాలని ఆదేశించారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) యువరాజ్ మర్మాట్ సమావేశంలో పాల్గొన్నారు. జిల్లాలో ఇప్పటివరకు 1,00,676 నోటీసులు అందజేయడం జరిగిందని, 56,538 మంది ఓటర్ల హియరింగ్ పూర్తయిందని, అక్టోబర్ 15లోగా పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటామని తెలియజేశారు. రాజకీయ పార్టీల ప్రతినిధుల సహకారంతో హియరింగ్ ప్రక్రియ పూర్తి చేస్తామని వివరించారు.

# ప్రజావాణి దరఖాస్తులు సత్వరమే పరిష్కరించాలి

## అదనపు కలెక్టర్ యువరాజ్ మర్మాట్....



**పోరు తెలంగాణ సెప్టెంబర్ 21: కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి :** కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా ప్రజావాణి కార్యక్రమంలో వచ్చే దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) యువరాజ్ మర్మాట్ సూచించారు. సోమవారం సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఎం. డేవిడ్‌తో కలిసి అర్జీదారుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. రెబ్బెన మండలం గోలేటికి చెందిన లావుడ్య మమత ఇందిరమ్మ ఇల్లు మంజూరు కోరుతూ, జైనూర్ మండలం జంగాంకు చెందిన కొడప అనుతారావు దివ్యాంగ పింఛన్ కోరుతూ, సిర్పూర్(టి) మండలం పారిగాంకు చెందిన దుర్కే విశ్వనాథ్ నిలిచిపోయిన పింఛన్ పునరుద్ధరణ కోరుతూ దరఖాస్తులు అందజేశారు. జిల్లా కేంద్రానికి చెందిన కాంబ్లే కీర్తికుమార్ ప్రభుత్వ వైద్య కళాశాలలో పొరుగుసేవల ఉద్యోగం కోరుతూ, సిర్పూర్(పి) మండల కేంద్రానికి చెందిన గద్దల రమేష్ విశ్వకర్మ పథకం రుణం కోరుతూ, చింతలమానేపల్లి మండలం బాబాసాగర్‌కు చెందిన పిప్పిరే బాబాజీ తన వాటా భూమిని ఆక్రమించిన వారిపై చర్యలు కోరుతూ దరఖాస్తులు సమర్పించారు. వచ్చిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి అధికారుల సమన్వయంతో పరిష్కరించే దిశగా చర్యలు తీసుకుంటామని అదనపు కలెక్టర్ వివరించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, అర్జీదారులు పాల్గొన్నారు.

# అశ్వాపురం మండలంలో సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేసిన ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు



**భద్రాద్రి కొత్తగూడెం,పోరు తెలంగాణ-పినపాక నియోజకవర్గం ప్రతినిధి అశ్వాపురం సెప్టెంబర్ 21:-**మండలానికి చెందిన పలువురు లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధి (CMRF) ద్వారా మంజూరైన రూ.6 లక్షల 40 వేల రూపాయల విలువైన చెక్కులను పినపాక శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ,ఆపదలో ఉన్న పేద,మధ్యతరగతి కుటుంబాలకు వైద్య ఖర్చుల భారం తగ్గించేందుకు ముఖ్యమంత్రి సహాయ నిధి ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు.అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తామని పేర్కొన్నారు. సీఎంఆర్ఎఫ్ ద్వారా ఆర్థిక సహాయం అందడంతో లబ్ధిదారులు ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లుకి,ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అశ్వాపురం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఓరుగంటి రమేష్ బాబు, సీనియర్ నాయకులు గాదే కేశవరెడ్డి, సర్పంచులు మచ్చ నరసింహారావు, కుంజ జాను, ఉసా అనిల్, వేములపల్లి రమేష్, కాకా రాములు, తూము వీర రాఘవులు, యూత్ కాంగ్రెస్ వైస్ ప్రెసిడెంట్ గొల్లపల్లి నరేష్ కుమార్, జనరల్ సెక్రెటరీ కంటెం నవీన్,తదితరులు పాల్గొన్నారు

# పారిజాతను కలిసిన యాదయ్య



**మహేశ్వరం, సెప్టెంబర్ 21, పోరు తెలంగాణ న్యూస్ ప్రతినిధి:** కాంగ్రెస్ పార్టీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షురాలుగా నియమింపబడిన బడంగ్ పేట్ మాజీ మేయర్, టిపిసిసి ప్రధాన కార్యదర్శి చిగిరింత పారిజాత నరసింహారెడ్డిని మహేశ్వరం మండల కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు ఆవుల యాదయ్య ఆధ్వర్యంలో ఆమెను కలిసి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. మహేశ్వరం ప్రాంతానికి చెందిన పారిజాత నర్సింహారెడ్డి రంగారెడ్డి జిల్లాలో కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవం రావడం ఖాయమని అని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సోషల్ మీడియా కన్వీనర్ నవీన్, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# గణేష్ నిమజ్జనంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూడాలి

## జైపూర్ ఏసిపి వెంకటేశ్వర్.



**పోరు తెలంగాణ మంచిర్యాల సెప్టెంబర్ 21 :** గణేష్ నిమర్జనం సందర్భంగా తీసుకోవలసిన చర్యలపై 21.09.2026, సోమవారం రోజున సింగరేణి థర్మల్ పవర్ ప్లాంట్ ( ఎస్ టి పి పి ) నందు జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్ ఆధ్వర్యంలో మండలంలోని అన్ని శాఖల అధికారులతో కోఆర్డినేషన్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ అన్ని శాఖల అధికారులు సమన్వయం చేసుకొని గణేష్ నిమజ్జన కార్యక్రమంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా విజయవంతం చేయాలని కోరడం జరిగింది. ఈ సమావేశమునకు ఏసీపీ వెంకటేశ్వర్ , సీఐ నవీన్ కుమార్ , ఎంపీడీవో శ్రీపతి బాపురావు , తహసిల్దార్ వనజారెడ్డి , ఎస్సై భూమేష్ , ఫిషరీస్ సూపర్వైజర్ శ్రవణ్ ,మెడికల్ అధికారి శ్రావ్య ఎస్ టి పి పి సింగరేణి అధికారులు, ఫైర్ అధికారులు ఫారెస్ట్ అధికారులు,మరియు వివిధ శాఖల అధికారులు హాజరైనారు.

# బూర్గంపాడు మండలం లో ఇందిరమ్మ ఇళ్ల పట్టాలు పంపిణీ,సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే పాయం

**భద్రాద్రి కొత్తగూడెం,పోరు తెలంగాణ-పినపాక నియోజకవర్గం ప్రతినిధి భూర్గంపాడు, సెప్టెంబర్ 21:-** మండలం ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో పినపాక శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు 30మంది లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల పట్టాలను పంపిణీ చేశారు. అలాగే రూ.7లక్షల 80 వేల రూపాయల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తున్నామని తెలిపారు. పేదల సొంతింటి కలను నెరవేర్చడంతో పాటు, ఆపదలో ఉన్న కుటుంబాలకు సీఎంఆర్ఎఫ్ ద్వారా ఆర్థిక భరోసా కల్పిస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో,హౌసింగ్ ఏఈ, మండల అధ్యక్షులు, సర్పంచులు,ఉపసర్పంచులు, వార్డు సభ్యులు,ముఖ్య నాయకులు, అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.





# భీమారం పద్మశాలి గణేష్ మండలి వద్ద కుంకుమ పూజ





**పోరు తెలంగాణ మంచిర్యాల సెప్టెంబర్ 21 :** భీమారం మండల కేంద్రంలోని పద్మశాలి గణేష్ మండలి వద్ద వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా సోమవారం సామూహిక కుంకుమ పూజను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మహిళలు పెద్ద సంఖ్యలో హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు పసుపు, కుంకుమ, పుష్పాలతో గణనాథుడిని భక్తిశ్రద్ధలతో పూజించి, ప్రత్యేక కుంకుమార్చనలు చేశారు. అనంతరం స్వామివారికి హారతి సమర్పించి కుటుంబ సభ్యులు సుఖసంతోషాలతో ఉండాలని, ప్రజలందరికీ ఆయురారోగ్యాలు ప్రసాదించాలని ప్రార్థించారు. కుంకుమ పూజలో పాల్గొన్న మహిళలు, భక్తులతో మండపం ఆధ్యాత్మిక వాతావరణాన్ని సంతరించుకుంది. అనంతరం మండపం వద్ద అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు ఉత్సవ కమిటీ సభ్యులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

## వాంకిడి ప్రజావాణిలో పలు సమస్యలపై ఫిర్యాదులు



**పోరు తెలంగాణ సెప్టెంబర్ 21: కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి :** కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా వాంకిడి మండల కేంద్రంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అభివృద్ధి పనుల బిల్లులు, పారిశుద్ధ్య సమస్యలపై ఫిర్యాదులు అందాయి. ఆకిని పరిధిలో రహదారి అభివృద్ధి పనులు పూర్తి చేసినా బిల్లులు చెల్లించడంలో జాప్యం జరుగుతోందని కాంట్రాక్టర్ మండోకర్ అనిల్ ఫిర్యాదు చేశారు. చెక్కుపై ఉప సర్పంచ్ సంతకం చేయకుండా పర్సంటేజీ అడుగుతున్నారని ఆరోపిస్తూ ఎంపీడీఓ పాటిల్ జ్యోష్ణకు లిఖితపూర్వకంగా దరఖాస్తు అందజేశారు. ఆరోపణలపై విచారణ జరిపి వాస్తవాలను తేల్చాలని కోరారు. మరోవైపు వాంకిడి గ్రామపంచాయతీ ఒకటో వార్డుకు చెందిన రాంటెంకి రశిక తమ ఇంటి పరిసరాల్లో చెత్తాచెదారం పేరుకుపోవడంతో దుర్వాసన, పారిశుద్ధ్య సమస్యలు ఎదుర్కొంటున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. సమస్యను వార్డు సభ్యుడు, సర్పంచ్, కార్యదర్శి దృష్టికి పలుమార్లు తీసుకెళ్లినా పరిష్కారం కాలేదని తెలిపారు. చెత్తను తొలగించి, ఇకపై తమ ఇంటి పరిసరాల్లో చెత్త వేయకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. రెండు ఫిర్యాదులపై సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి, రికార్డులు మరియు వాస్తవ పరిస్థితులను పరిశీలించిన అనంతరం నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాల్సి ఉంది. కాంట్రాక్టర్ ఆరోపణలపై ఉప సర్పంచ్ వివరణ తెలియాల్సి ఉంది.

## వినాయక నిమజ్జన పాయింట్లు,రూట్ మ్యాప్స్ పరిశీలించిన జిల్లా ఎస్పీ నితికా పంత్



**పోరు తెలంగాణ సెప్టెంబర్ 21: కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి :** కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా వినాయక నిమజ్జన కార్యక్రమాలను ప్రశాంతంగా, సురక్షితంగా నిర్వహించేందుకు జిల్లా పోలీస్ శాఖ చేపడుతున్న ఏర్పాట్లను జిల్లా ఎస్పీ నితికా పంత్ పరిశీలించారు. నిమజ్జన రూట్ మ్యాప్స్, నిమజ్జన పాయింట్లు, తరలించే వినాయక విగ్రహాల సంఖ్య వివరాలను అధికారులు, సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. పాయింట్ల వద్ద బారికేడింగ్, లైటింగ్, ట్రాఫిక్ నియంత్రణ, పోలీస్ బందోబస్తు, క్రేన్లు, అత్యవసర సేవల ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు. మండపాల నిర్వాహకులు, ఉత్సవ కమిటీ సభ్యులతో సమావేశమై ఏర్పాట్లు, సమస్యలు, సూచనలు తెలుసుకుని పోలీస్ శాఖ తరఫున సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా ప్రత్యామ్నాయ మార్గాలు, వాహనాల నియంత్రణ, భక్తుల భద్రతపై దృష్టి సారించాలని అధికారులకు సూచించారు. విద్యుత్ తీగలు, హైటెన్షన్ వైర్ల పట్ల ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని, పోలీస్ సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉండి, ప్రజలు, ఉత్సవ కమిటీలతో సమన్వయంతో పనిచేస్తూ నిమజ్జన కార్యక్రమాన్ని ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలని జిల్లా ఎస్పీ ఆదేశించారు.

## పేదలకు చెందాల్సిన డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు కోటీశ్వరులకు ఎలా వచ్చాయి?

### ప్రశ్నిస్తున్న నిలువ నీడలేని, ఉండడానికి ఇల్లు లేని నిరుపేదలు....

**పోరు తెలంగాణ సెప్టెంబర్ 21: కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి :** కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్ నగర్ పట్టణ మున్సిపాలిటీ ( మరియు రూరల్) ప్రాంతంలో ఇటీవల డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు అలాట్ చేశారు, కానీ అందులో కొందరే గూడు లేని నిరుపేదలు, మరికొందరు విలాసవంతమైన మూడు,నాలుగు అంతస్తుల భవనాలలో నివసిస్తున్న బడా వ్యాపారులు మరి ఇలాంటి విలాసవంతమైన భవనాలలో నివసిస్తున్న వారికి డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు ఎలా కేటాయించారు? ఏ ప్రాతిపదికన వారికి డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు కేటాయించారని ఎండకు ఎండుతూ, వానకు నానుతూ గుడిసెలలో నివసిస్తున్న పేద ప్రజలు ప్రశ్నిస్తున్నారు? అలాగే రాజకీయ నాయకుల ప్రోత్బలంతో కొందరు అనర్హు లకు డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు మరియు గ్రామీణ ప్రాంతాలలో ఇందిరమ్మ ఇల్లు కేటాయించారని పలువురు వాపోతున్నారు? దీనికి మరి ఉన్నతాధికారులా, ,ప్రజాప్రతినిధులా ఎవరు సమాధానం ఇస్తారు వేచి చూడాల్సిందే అంటున్న సామాన్య గరీబు ప్రజలు.


2 BHK Proposals (Apartments at Charigaon Road)
Kagaznagar Municipality

## ప్రజావాణికి ఒకే ఒక్క దరఖాస్తు






**ఓదెల సెప్టెంబర్ 21 పోరు తెలంగాణ ప్రతినిధి రవీంద్ర చారి :** ఓదెల మండల జిల్లా పరిషత్ కార్యాలయంలో ప్రతి సోమవారం ప్రజావాణి కార్యక్రమాన్ని ఎంపీడీవో అనిల్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు ఈ సందర్భంగా మండలంలోని వివిధ గ్రామాల నుంచి వచ్చిన ప్రజలు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. అయితే ప్రజావాణి కార్యక్రమానికి కేవలం ఒక్క దరఖాస్తు మాత్రమే అందింది. రెవెన్యూ శాఖకు సంబంధించిన సమస్యపై ఒక వ్యక్తి దరఖాస్తు సమర్పించారు. ప్రజల నుంచి వచ్చిన దరఖాస్తును అధికారులు స్వీకరించి, సమస్యను పరిశీలించి పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ వనజానాయక్‌తో పాటు వివిధ శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

# ఆదర్శ పాఠశాలలో అల్పాహారం ప్రారంభం

### రాష్ట్ర ప్రభుత్వ విప్,పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయరమణ రావు





**ఓదెల సెప్టెంబర్ 21 పోరు తెలంగాణ ప్రతినిధి రవీంద్ర చారి :** పెద్దపల్లి జిల్లా ఓదెల మండలంలోని ఆదర్శ పాఠశాలలో సోమవారం ప్రభుత్వ పాఠశాలల్లో అల్పాహార కార్యక్రమాన్ని ప్రారంభించడానికి వచ్చిన ప్రభుత్వ విప్,పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయ రమణారావు కు మండల విద్యాధికారి రమేష్,ఆదర్శ పాఠశాల ప్రిన్సిపల్ శిరీష,పాఠశాల విద్యార్థిని విద్యార్థులు ఘనంగా స్వాగతం పలికారు.హరేరామ కృష్ణ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వ విప్, పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయ రమణారావు అల్పాహారాన్ని ప్రారంభించి విద్యార్థులతో కలిసి అల్పాహారం చేశారు.అనంతరం ప్రభుత్వ జూనియర్ కళాశాలను సందర్శించి కళాశాల అధ్యాపకులతో చర్చించి కళాశాల అభివృద్ధికి తోడ్పడుతున్నారు.ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ పెద్దపల్లి శాసనసభ్యులు విజయ రమణారావు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన అల్పాహారం కార్యక్రమాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.గత ప్రభుత్వ హయాంలో పదేళ్లలో విద్యార్థులకు డైట్ ఛార్జీలు పెంచకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారన్నారు. ప్రజా ప్రభుత్వంలో ప్రీ-ప్రైమరీ నుంచి ఇంటర్మీడియట్ వరకు విద్యార్థులందరికీ అల్పాహారం వర్తిస్తుందన్నారు.గత ప్రభుత్వం విద్యా వ్యవస్థను నిర్వీర్యం చేసిందని,ప్రజా ప్రభుత్వం రెండున్నర సంవత్సరాల్లో పెద్దపల్లి నియోజకవర్గంలో 65 కోట్ల రూపాయల తో పలు ప్రభుత్వ పాఠశాలల్లో ప్రహరీ,నూతన తరగతి గదులు,మరుగుదొడ్లు,తదితర అభివృద్ధి పనులు పూర్తి చేశామన్నారు.200 కోట్ల రూపాయలతో ఇంటిగ్రేటెడ్ పాఠశాల నిర్మాణ పనులు జరుగుతున్నాయన్నారు. మిగిలి ఉన్న పనులను సంవత్సర కాలంలో పూర్తి చేస్తామన్నారు. విద్యారంగంలో పెద్దపల్లి జిల్లా రాష్ట్రంలోనే అగ్రగామిగా నిలవడం గర్వకారణం అన్నారు.ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని గ్రామానికి, మండలానికి, జిల్లాకు, రాష్ట్రానికి, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని ఉన్నత విద్యావంతులుగా ఎదగాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఎంపీడీవో అనిల్ రెడ్డి, తాసిల్దార్ వనజ నాయక్, స్థానిక సర్పంచ్ కనికి రెడ్డి సతీష్, ఉపాధ్యాయులు, సింగిల్ విండో చైర్మన్ ఆళ్ళ సుమన్ రెడ్డి, మాజీ సర్పంచ్ ఆకుల మహేందర్ , మాజీ సింగిల్ విండో చైర్మన్ గోపు నారాయణరెడ్డి, గుండేటి ఐలయ్య యాదవ్,డైరెక్టర్లు,పలు గ్రామాల సర్పంచులు, ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# పనులు పూర్తి చేసి అక్టోబర్ నెలలో ముఖ్యమంత్రి చేతుల మీదుగా ప్రారంభించేలా చర్యలు: మంత్రి తుమ్మల

### సత్తుపల్లి ట్రంక్‌కు గోదావరి జలాలు అందించడమే లక్ష్యం

### 25 రోజుల్లో టన్నెల్ పనులు పూర్తి చేయాలి: అధికారులకు మంత్రి తుమ్మల ఆదేశం





**ములకలపల్లి సెప్టెంబర్ 21 పోరు తెలంగాణ జిల్లా ప్రతినిధి కూరపాటి దాసు :** సీతారామ ప్రాజెక్టు ద్వారా సత్తుపల్లి ట్రంక్‌కు గోదావరి జలాలను అందించి రైతులకు సాగునీటి భరోసా కల్పించేందుకు పనులను వేగవంతం చేస్తున్నామని రాష్ట్ర వ్యవసాయ, సహకార, మార్కెటింగ్, చేనేత శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. సత్తుపల్లి మండలం యాతాలకుంట వద్ద సీతారామ ప్రాజెక్టు టన్నెల్ పనులను మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, అశ్వారావుపేట శాసనసభ్యులు జారే ఆదినారాయణ, జిల్లా కలెక్టర్ అంకిత్‌తో కలిసి పరిశీలించారు. యాతాలకుంట టన్నెల్‌లో జరుగుతున్న పనులను పరిశీలించిన మంత్రి, టన్నెల్ నిర్మాణ పనుల పురోగతిపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. టన్నెల్ కింది భాగంలో ఉన్న ఖాళీలను కాంక్రీట్‌తో పటిష్టంగా నింపాలని, గ్రౌటింగ్, ప్యాకింగ్, కాంక్రీట్ పనులను సాంకేతిక ప్రమాణాలకు అనుగుణంగా పూర్తి చేయాలని సూచించారు. టన్నెల్ పనుల్లో నాణ్యత, భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, ఎలాంటి జాప్యానికి తావులేకుండా పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. టన్నెల్‌కు సంబంధించిన మిగిలిన పనులను 25 రోజుల్లో పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటామని అధికారులు మంత్రికి వివరించారు. అక్టోబర్ నెలలో టర్నల్ పనులను పూర్తి చేసి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించే విధంగా అవసరమైన చర్యలు చేపట్టాలని మంత్రి అధికారులను ఆదేశించారు. టన్నెల్ లైనింగ్, కెనాల్ లైనింగ్, రోడ్ క్రాసింగ్స్ తదితర మిగిలిన పనులను సమన్వయంతో వేగవంతం చేయాలని స్పష్టం చేశారు. అనంతరం ములకలపల్లి మండలం కుమ్మరిపాడు గ్రామంలో ఎస్‌టీఎస్‌డీఎఫ్ నిధులతో 4 కోట్ల 63 లక్షల అంచనా వ్యయంతో నిర్మించిన హై లెవల్ బ్రిడ్జి, బీటీ రోడ్డును మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రారంభించారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు రాకపోకలు సులభతరం చేయడంతో పాటు అన్ని కాలాల్లో రవాణా సౌకర్యం అందుబాటులో ఉండేలా మౌలిక వసతులను అభివృద్ధి చేస్తున్నామని మంత్రి తెలిపారు. తదుపరి ములకలపల్లి మండలం కమలాపురం గ్రామంలో సీతారామ ఎత్తిపోతల పథకంలోని మూడో పంప్‌హౌస్‌ను మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఎమ్మెల్యే జారే ఆదినారాయణ, జిల్లా కలెక్టర్ అంకిత్ తో కలిసి పరిశీలించి,మోటార్‌ను ఆన్ చేసి అన్నదైవం ప్రాజెక్టుకు నీటిని విడుదల చేశారు. పంప్‌హౌస్ నుంచి విడుదలైన నీటి ప్రవాహాన్ని పరిశీలించి, నీటి విడుదలకు సంబంధించిన వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. సాగు అవసరాలకు అనుగుణంగా నీటిని సమర్థవంతంగా వినియోగించేలా చర్యలు చేపట్టాలని సూచించారు ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ , సీతారామ ప్రాజెక్టు ద్వారా సత్తుపల్లి ట్రంక్‌కు గోదావరి జలాలను అందించాలన్నది ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి లక్ష్యమని తెలిపారు. ప్యాకింగ్, క టన్నెల్ పనుల్లో తొందరపాటు కంటే నాణ్యత, భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని, భవిష్యత్‌లో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా పటిష్టంగా పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. సత్తుపల్లి ట్రంక్‌కు నీటిని తీసుకెళ్లే క్రమంలో భూసేకరణకు సంబంధించిన సమస్యలను దాదాపుగా పరిష్కరించామని మంత్రి తెలిపారు. భూసేకరణ కోసం ఇటీవల రూ.48 కోట్లు విడుదల చేశామని, ఇంకా అవసరమైన భూముల కోసం జిల్లా కలెక్టర్ ప్రతిపాదనలు పంపితే అవసరమైన నిధులను కూడా సమకూర్చేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. భూసేకరణ, నిర్మాణ పనులు, సాంకేతిక సమస్యలు ఏవైనా ఉంటే వాటిని వేగంగా పరిష్కరించి ప్రాజెక్టు పనులను ముందుకు తీసుకెళ్లాలని అధికారులకు సూచించామని చెప్పారు. ప్రస్తుతం రాష్ట్రంలో వర్షపాతం తక్కువగా ఉండటం, ఎల్‌నినో ప్రభావం వంటి కారణాలతో వర్షాభావ పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉందని మంత్రి అన్నారు. వర్షాలు సకాలంలో లేకపోవడం వల్ల భూగర్భ జలాలు కూడా తగ్గుతున్నాయని, ఈ పరిస్థితుల్లో ఖరీఫ్ పంటలను కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. రైతులు సాగు చేసిన పంటలకు అవసరమైన సమయంలో నీటిని అందించేందుకు గోదావరి జలాలను సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. నీటి లభ్యతను ముందుగానే అంచనా వేసుకుని, ఏ ప్రాంతానికి ఎంత నీరు అవసరమో ప్రణాళిక రూపొందించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. వర్షాభావ పరిస్థితులు వ్యవసాయంతో పాటు విద్యుత్ రంగంపైనా ప్రభావం చూపే అవకాశం ఉందని మంత్రి తెలిపారు. నీటి నిల్వలు తగ్గితే జలవిద్యుత్ ఉత్పత్తి తగ్గే అవకాశం ఉంటుందని, అదే సమయంలో వ్యవసాయం, పరిశ్రమలు, గృహ అవసరాల కోసం విద్యుత్ డిమాండ్ పెరుగుతుందని చెప్పారు. జలవిద్యుత్ ఉత్పత్తి తగ్గినప్పుడు థర్మల్ విద్యుత్‌పై ఎక్కువగా ఆధారపడాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని వివరించారు. అందువల్ల నీటి లభ్యత, విద్యుత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని ముందస్తు ప్రణాళికతో చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు. సీతారామ ప్రాజెక్టు ద్వారా ములకలపల్లి, దమ్మపేట, అశ్వారావుపేట ప్రాంతాల్లో కూడా సాగునీటి అవసరాలను తీర్చేలా ప్రణాళికలు రూపొందిస్తున్నామని మంత్రి తెలిపారు. ముఖ్యంగా దమ్మపేట, అశ్వారావుపేట ప్రాంతాల్లో పెద్ద ఎత్తున ఆయిల్‌పామ్ సాగు జరుగుతున్నందున సాగునీటి సౌకర్యం మరింత మెరుగుపడాల్సిన అవసరం ఉందన్నారు. సుమారు 80 వేల ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగు ఉన్న ప్రాంతాలకు నీటి లభ్యతను పెంచే విధంగా సీతారామ జలాలను వినియోగించాల్సిన అవసరం ఉందన్నారు. నాలుగో పంప్‌హౌస్ ద్వారా అవసరమైన ప్రాంతాలకు నీటిని తీసుకెళ్లేలా పనులను వేగవంతం చేయాలని మంత్రి తెలిపారు. ప్రధాన కాలువలతో పాటు అవసరమైన చోట్ల పైప్‌లైన్ వ్యవస్థను ఏర్పాటు చేస్తే భూసేకరణ సమస్యలు తగ్గుతాయని, నీటిని నేరుగా రైతుల పొలాలకు తీసుకెళ్లే అవకాశం ఉంటుందని చెప్పారు. . అధికారుల మధ్య సమన్వయం లేకపోవడం వల్ల ఎక్కడా పనులు నిలిచిపోకూడదని, ఏదైనా సమస్య తలెత్తితే వెంటనే జిల్లా స్థాయిలో పరిష్కరించాలని అన్నారు. అవసరమైన అంశాలను ప్రభుత్వం దృష్టికి తీసుకువస్తే వాటిని పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. కమలాపురం వద్ద పంప్ మోటార్‌ను ఆన్ చేసి అన్నదైవం ప్రాజెక్టుకు నీటిని విడుదల చేయడం ద్వారా ఈ ప్రాంత రైతులకు సాగునీటి ప్రయోజనం కల్పించే దిశగా మరో అడుగు ముందుకు వేసినట్లు మంత్రి తెలిపారు. విడుదలైన నీరు ఆయకట్టులోని రైతులకు సక్రమంగా అందేలా అధికారులు పర్యవేక్షించాలని సూచించారు. ఈ కార్యక్రమాల్లో సంబంధిత ఇంజినీరింగ్ అధికారులు, రెవెన్యూ అధికారులు, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.ం

## మంత్రుల పర్యటనను విజయవంతం చేయండి ఎమ్మెల్యే పాయం

### ఎమ్మెల్యే పాయం కృషి ఫలించింది

**అశ్వాపురం, సెప్టెంబర్ 21: పోరు తెలంగాణ జిల్లా ప్రతినిధి కూరపాటి దాసు :** అశ్వాపురం మండల రైతుల ఎన్నో ఏళ్ల సాగునీటి కల సాకారం కానుంది. సీతారామ ప్రాజెక్టుకు అనుసంధానంగా నిర్మించిన మారెళ్లపాడు లిఫ్ట్ ఇరిగేషన్ లెఫ్ట్ కెనాల్‌ను సెప్టెంబర్ 23న ప్రారంభించనున్నారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు,గృహ నిర్మాణ సమాచార--పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఉమ్మడి ఖమ్మం జిల్లా ఇన్‌చార్జి మంత్రి వాకిటి శ్రీహరి, మహబూబాబాద్ ఎంపీ బలరాం నాయక్ గారితో పాటు పలువురు ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు హాజరుకానున్నారు. మారెళ్లపాడు లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా తుమ్మల చెరువుకు గోదావరి జలాలను తరలించి రైతుల పంట పొలాలకు సాగునీరు అందించనున్నారు. ఈ పథకం పూర్తిస్థాయిలో అందుబాటులోకి వస్తే వేలాది ఎకరాలకు సాగునీటి ప్రయోజనం కలగనుంది. రైతుల చిరకాల కల నెరవేరుతున్న సందర్భంగా నియోజకవర్గంలోని రైతులు, ప్రజలు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. అలాగే సర్పంచులు, మండల అధ్యక్షులు, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో కార్యక్రమానికి హాజరై విజయవంతం చేయాలని కోరారు.

ఎన్నో ఏళ్ల రైతుల కల..
గోదావరి జలాలతో పచ్చని పంటలకు బాట..



మారెళ్లపాడు లిఫ్ట్ ఇరిగేషన్‌తో అశ్వాపురం రైతుల్లో కొత్త ఆశలు. చి గరింపచేశారు

## చింతలూరు ప్రాథమిక పాఠశాలలో “మత్తు కాదు మేలుకో” షార్ట్ ఫిల్మ్ ఆవిష్కరణ

### “ఏక్ పేడ్ మాకే నామ్” కార్యక్రమం నిర్వహణ



**పోరు తెలంగాణ ప్రతినిధి (భూమేశ్వర్) :** జక్రాన్ పల్లి మండలం చింతలూరు గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయులు పొలాస రాములు రూపొందించిన సామాజిక అవగాహన కల్పించే “ మత్తుకాదు... మేలుకో” మరియు దేశభక్తి సందేశంతో రూపొందించిన “సైనికులకు వందనం”వంటి షార్ట్ ఫిల్మ్ లను జక్రాన్ పల్లి సబ్ ఇన్‌స్పెక్టర్ మహేష్ ఆవిష్కరించారు.ఈ సందర్భంగా సబ్ ఇన్‌స్పెక్టర్ మహేష్ మాట్లాడుతూ,విద్యార్థుల్లో చిన్ననాటి నుంచే మాదకద్రవ్యాలు,చెడు వ్యసనాల పట్ల అప్రమత్తత,దేశభక్తి, సామాజిక బాధ్యత వంటి విలువలను పెంపొందించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండి,తమ భవిష్యత్తును సానుకూల దిశలో నిర్మించుకోవాలని సూచించారు.అదే విధంగా దేశ సరిహద్దుల్లో నిరంతరం సేవలందిస్తున్న సైనికుల త్యాగాలను ప్రతి ఒక్కరూ గుర్తించి గౌరవించాలని తెలిపారు.“మత్తుకాదు... మేలుకో” షార్ట్ ఫిల్మ్ ద్వారా మాదకద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలను,యువతపై వాటి ప్రభావాన్ని తెలియజేస్తూ, వ్యసనాలకు దూరంగా ఉండి ఆరోగ్యకరమైన జీవితాన్ని ఎంచుకోవాలనే సందేశాన్ని అందించారు.“సైనికులకు వందనం” చిత్రం ద్వారా దేశ రక్షణ కోసం కుటుంబాలకు దూరంగా ఉండి సేవలందిస్తున్న సైనికుల త్యాగం, ధైర్యం, దేశభక్తిని విద్యార్థులకు పరిచయం చేశారు.అనంతరం పాఠశాల ఆవరణలో మొక్కలు నాటే కార్యక్రమం “ఏక్ పేడ్ మాకే నామ్” నిర్వహించారు.పచ్చదనం పెంపొందించడం, పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలియజేస్తూ విద్యార్థులు, ఉపాధ్యాయులు కలిసి మొక్కలు నాటారు. నాటిన మొక్కలను సంరక్షిస్తూ వాటి పెరుగుదలకు ప్రతి ఒక్కరూ బాధ్యత తీసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ నాగుల శ్రీనివాస్, కాంగ్రెస్ గ్రామశాఖ అధ్యక్షులు పుప్పాల హన్మాండ్లు,అభిలాష్, లింబాద్రి, శ్రీనివాస్ ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

# అమ్మ పేరిట మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు పునాది వేయాలి

**జడ్.పి.హెచ్.ఎస్ బాల్కొండలో ఘనంగా "ఏక్ పెడ్ మా కే నామ్" మెగా ప్లాంటేషన్ కార్యక్రమం**



**పోరు తెలంగాణ ప్రతినిధి (భూమేశ్వర్) :** బాల్కొండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో పర్యావరణ పరిరక్షణ, పచ్చదనం పెంపుదల మరియు విద్యార్థుల్లో ప్రకృతి పట్ల బాధ్యతను పెంపొందించడమే లక్ష్యంగా "ఏక్ పెడ్ మా కే నామ్"అమ్మ పేరిట ఒక మొక్క మెగా ప్లాంటేషన్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.పాఠశాల ప్రధానోపాధ్యాయులు బట్టు రాజేశ్వర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో గ్రీన్ టీచర్ జి.సురేష్ కుమార్,ఉపాధ్యాయ బృందం, పాఠశాల సిబ్బంది మరియు విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.పచ్చదనం కోసం సమిష్టి కృషి"ఏక్ పెడ్ మా కే నామ్" ఉద్యమం స్ఫూర్తితో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పాఠశాల ఆవరణలో సుమారు 200 మొక్కలను నాటారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు కలిసి మొక్కలు నాటి వాటి సంరక్షణకు ప్రతిజ్ఞ చేయడం ద్వారా పర్యావరణ పరిరక్షణపై తమ నిబద్ధతను చాటుకున్నారు.మొక్కలు నాటడం మాత్రమే కాకుండా, వాటిని నిరంతరం సంరక్షించడం, పెంచడం మరియు భవిష్యత్ తరాలకు పచ్చని వాతావరణాన్ని అందించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని ఈ సందర్భంగా తెలియజేశారు.అమ్మ ప్రేమతో మొక్కలను సంరక్షించాలని తెలిపారు.ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు బట్టు రాజేశ్వర్ మాట్లాడుతూ,తల్లి మనకు జన్మనిచ్చి జీవితాన్ని అందించినట్లే, మొక్కలు మనకు ప్రాణవాయువు, నీడ మరియు జీవనాధారాన్ని అందిస్తాయని పేర్కొన్నారు. ప్రతి విద్యార్థి తన తల్లి పేరిట ఒక మొక్కను నాటి, దానిని తల్లిలాగే ప్రేమతో సంరక్షించాలని పిలుపునిచ్చారు.పర్యావరణ పరిరక్షణ అనేది ఒక్కరోజు కార్యక్రమం కాదని, అది నిరంతర సామాజిక బాధ్యత అని ఆయన అన్నారు. విద్యార్థుల్లో చిన్ననాటి నుంచే ప్రకృతి ప్రేమ, మొక్కల సంరక్షణ మరియు పర్యావరణ స్పృహను పెంపొందిస్తే భవిష్యత్ తరాలకు ఆరోగ్యకరమైన, పచ్చని సమాజాన్ని అందించగలమని తెలిపారు.ప్రతి మొక్క ఒక భవిష్యత్ తరానికి ఆశాకిరణం గ్రీన్ టీచర్ జి. సురేష్ కుమార్ మాట్లాడుతూ,పాఠశాల ఆవరణలో నాటిన ప్రతి మొక్కను సకాలంలో నీరు పోసి, సంరక్షించి, వాటి ఎదుగుదలను పర్యవేక్షించాల్సిన బాధ్యత విద్యార్థులు మరియు పాఠశాల సిబ్బందిపై ఉందని అన్నారు. మొక్కల పెంపకం ద్వారా పర్యావరణ సమతుల్యతను కాపాడటంతో పాటు, విద్యార్థుల్లో బాధ్యతాయుతమైన పౌరసత్వ లక్షణాలు అభివృద్ధి చెందుతాయని పేర్కొన్నారు.పర్యావరణ పరిరక్షణకు బాల్కొండ జెడ్ పి హెచ్ ఎస్ ఆదర్శం,సుమారు 200 మొక్కలను నాటిన ఈ మెగా ప్లాంటేషన్ కార్యక్రమం పాఠశాల ప్రాంగణాన్ని పచ్చదనంతో నింపడమే కాకుండా, విద్యార్థుల్లో పర్యావరణ పరిరక్షణపై అవగాహనను మరింత పెంచింది. ప్రతి విద్యార్థి ఒక మొక్కను నాటి, దాని సంరక్షణ బాధ్యతను స్వీకరించాలనే సందేశాన్ని ఈ కార్యక్రమం అందించింది."ఒక్క తల్లి... ఒక్క విద్యార్థి... ఒక్క మొక్క... ఒక గొప్ప భవిష్యత్తు!"పచ్చని పాఠశాల,ఆరోగ్యకరమైన సమాజం, సుస్థిరమైన భవిష్యత్తు అనే లక్ష్యంతో బాల్కొండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పర్యావరణ పరిరక్షణలో హనుమంత భూమికను పోషిస్తుందని అన్నారు.

# భద్రాచల శ్రీ సీతారాముల స్వామినీసతీ సమేతంగా దర్శించిన తెలంగాణ ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్



**బూర్గంపాడు సెప్టెంబర్ 21పోరు తెలంగాణ జిల్లా ప్రతినిధి కూరపాటి దాసు** : ఏజెన్సీ ప్రాంతాల్లో ఎస్సీ ఎస్టీ ల పై వివక్ష చూపించే వారిని ఉపేక్షించేది లేదని హెచ్చరిక చేశారు.. . సోమవారం ఉదయం 8:30 గంటలకు సతీ సమేతంగా భద్రాచలం సీతారామచంద్ర స్వామివారిని దర్శించుకున్న ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య దంపతులు. బూర్గంపాడు మండలం సారపాక అవినాష్ రెసిడెన్సి లో విలేకరుల సమావేశంలో చైర్మన్ మాట్లాడుతూ దక్షిణ అయోధ్యగా పిలవబడే భద్రాచలం శ్రీ సీతారామస్వామి పుణ్యక్షేత్రం ఏజెన్సీ ప్రాంతంలో ఉండటం ఈ ఏజెన్సీ ప్రాంత ప్రజల అదృష్టమని అలాగే ఈ ప్రాంత అభివృద్ధికి ఇట్టి పుణ్యక్షేత్రం ఎంతగానో తోడ్పడుతుందని అన్నారు భద్రాచల పరిసర ప్రాంతాల ఏజెన్సీ మొత్తంలో పోడు సాగు చేసుకునే ఎస్సీ ఎస్టీలను అధికారులు ఇబ్బందులకు గురి చేయొద్దని అన్నారు. అలాంటి సమస్యలు ఏమైనా ఉంటే కమిషన్ దృష్టికి తీసుకురావాలని ఏజెన్సీ ప్రాంత ప్రజలను చైర్మన్ కోరారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపాడు మండలం సారపాక అవినాష్ రెసిడెన్సి లో విలేకరుల సమావేశంలో తెలంగాణ రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య మాట్లాడుతూ ఎస్సీ ఎస్టీల కుల ధృవీకరణ పత్రాల జాప్యం, అట్రాసిటీ కేసుల విషయంలో నిష్పక్షపాతంగా వ్యవహరించాలని అలాగే ఎస్సీ ఎస్టీలు పొందాల్సిన హక్కులకు ఏ అధికారి ఆటంకంగా నిలవకూడదని తెలిపారు. ఎస్సీ ఎస్టీల అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వంచే అమలు కాపాడుకున్న ప్రభుత్వ సంక్షేమ పథకాలు సరైన రీతిలో వారికి అందుతున్నాయో లేదోనని సమీక్షించాల్సిన బాధ్యత అధికారులపై ఉంది అన్నారు. ఎస్సీ ఎస్టీ ఉద్యోగుల ప్రమోషన్లు, ఇంక్రిమెంట్ల విషయంలో కూడా నిష్పక్షపాతంగా ఉండాలని సూచించారు. ముఖ్యంగా ఏజెన్సీ ప్రాంతాల్లోని ఎస్సీ ఎస్టీల అభివృద్ధికి ఆటంకం కలిగించే విధంగా ఎవరైనా ప్రవర్తించిన కమిషన్కు తెలియజేయాలని అట్టి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవడానికి వెనకాడబోమని ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య తెలియజేశారు. ఈ కార్యక్రమం తెలంగాణ రాష్ట్ర ఎస్సీ ఎస్టీ మెంబర్స్ రాంబాబు నాయక్, లక్ష్మీనారాయణ, నీలాదేవి, సారపాక అవినాష్ రెసిడెన్సి అధినేత పాటి అశోక్, మాల మహానాడు బూర్గంపాడు మండల అధ్యక్షులు జినుగు దాసు, బొప్పని ప్రభాకర్, కొంగ మహేష్, పాటి బిక్షపతి, బిఆర్ఎస్ నాయకులు భూక్య కృష్ణ, లావుడియా బద్రు, నవీన్, ములకలపల్లి నాగరాజు, మంద కీర్తి కుమార్, చలికాని శివరామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు...

# ఖమ్మంలో ఘనంగా ఆయుర్వేద దినోత్సవ వారోత్సవాలు

**పలు అవగాహన, ఆరోగ్య కార్యక్రమాలు**

**పోరు తెలంగాణ, ఖమ్మం, సెప్టెంబర్ 21 :** కేంద్ర ప్రభుత్వ ఆయుష్ మంత్రిత్వ శాఖ పిలుపు మేరకు, ధన్వంతరి జయంతిని పురస్కరించుకుని 11వ జాతీయ ఆయుర్వేద దినోత్సవ వారోత్సవాలు సెప్టెంబర్ 21 నుండి 23 వరకు దేశవ్యాప్తంగా నిర్వహించబడుతున్నాయి. ఇందులో భాగంగా సోమవారం ఖమ్మం నగరంలో పలు సేవా, అవగాహన కార్యక్రమాలను నిర్వహించారు.

**ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం:**

ముస్తఫానగర్ జడ్పీ సెంటర్‌లోని కేవీఎం జెడ్ పి హెచ్ ఎస్ పాఠశాలలో ఉచిత ఆయుర్వేద మెడికల్ క్యాంప్‌ను నిర్వహించారు. ఈ శిబిరంలో పాల్గొన్న విద్యార్థులకు, స్థానిక ప్రజలకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి ఆరోగ్య సలహాలు అందించారు.

**పోషణ్ అభియాన్ పోషకాహార అవగాహన:**

శాంతి నగర్‌లోని యుపిఎస్ అంగన్‌వాడీ సెంటర్‌లో 'పోషణ్ అభియాన్' కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ప్రజలకు, తల్లులకు పోషకాహార ప్రాముఖ్యతను వివరించారు. సరైన పోషకాహారం తీసుకోకపోవడం వల్ల వచ్చే వివిధ లోపాలు, వ్యాధుల పట్ల అవగాహన కల్పించారు.

**ఔషధ మొక్కల పెంపకం పర్యావరణ పరిరక్షణ:**

' ప్రజా జ్యోతి పత్రిక ఖమ్మం జిల్లా ' బ్యూరో సహకారంతో వెలుగు మట్ల పార్కు నందు, అలాగే స్థానిక ఆయుర్వేద డిస్పెన్సరీ ఆవరణలో ఔషధ మొక్కలను నాటారు. ప్రకృతి ప్రసాదించిన ఔషధ మొక్కల ఆవశ్యకతను ప్రజలకు వివరిస్తూ,పర్యావరణాన్ని కాపాడుకోవడానికి ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని కోరారు.

**ముఖ్య ప్రకటన:** సెప్టెంబర్ 23న "మెగా మెడికల్ హెల్త్ క్యాంప్

జాతీయ ఆయుర్వేద దినోత్సవ వేడుకల ముగింపు సందర్భంగా సెప్టెంబర్ 23 బుధవారం ఖానాపురం, యు పి హెచ్ కాలనీ (పబ్లిక్ పార్క్ సమీపంలో) భారీ "ఉచిత మెగా మెడికల్ హెల్త్ క్యాంప్" నిర్వహించబడుతుంది.

**ప్రత్యేకతలు:** ఈ క్యాంప్‌లో ప్రముఖ ఆయుర్వేద, హోమియో, యునాని సీనియర్ వైద్యులు పాల్గొని రోగులకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహిస్తారు.ఉచిత మందుల పంపిణీ: పరీక్షించిన అనంతరం రోగులకు అవసరమైన మందులను ఉచితంగా పంపిణీ చేస్తారు.కావున, ఖమ్మం నగర




చుట్టుపక్కల ప్రాంత ప్రజలందరూ ఈ అవకాశాన్ని ఉపయోగించుకుని, హెల్త్ క్యాంప్‌లో పాల్గొని జయప్రదం చేయాల్సిందిగా నిర్వాహకులు కోరారు.ఈ కార్యక్రమం లో డా వై . ఉపేందర్ సీనియర్ మెడికల్ ఆఫీసర్,డా . ప్రవీన్ కుమార్, ఎం ఓ ,ఫార్మసిస్ట్ వీరయ్య , ఎం ఎన్ ఓ క్రాంతి, బాబు నాయక్ డీపీఎం, యోగ ఇంస్ట్రక్టర్ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# కేటీపీఎస్ లో ఉద్యోగుల ఫిర్యాదులపై జెన్కో స్పందించాలి

**ప్రమోషన్లు, పోస్టింగ్‌లు, సీనియారిటీపై సమగ్ర విచారణ చేపట్టాలి: నేషనల్ అంబేద్కర్ సేన**

**కొత్తగూడెం ఆర్సీ/పాల్వంచ, సెప్టెంబర్ 21(పోరు తెలంగాణ (ప్రతినిధి,జివిరత్నం):** కేటీపీఎస్ -VII స్టేజ్‌లో ఉద్యోగుల నుంచి వచ్చిన ప్రమోషన్లు, పోస్టింగ్‌లు, సీనియారిటీ, ఎస్ ఏ ఓ -I డి వై సి సి ఏ బాధ్యతలు, అకౌంట్స్ విభాగం, ఉద్యోగులపై ఒత్తిడి తదితర ఫిర్యాదులపై టీజీ జెన్కో యాజమాన్యం తక్షణమే స్పందించి విచారణ చేపట్టాలని నేషనల్ అంబేద్కర్ సేన తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు తాలూకా రాజేష్ డిమాండ్ చేశారు. ప్రమోషన్లు, పోస్టింగ్‌లు కేటాయింపులో సీనియారిటీ, అర్హత, కేడర్, ఖాళీలు, సర్వీస్ రికార్డులు, అధికారిక ఉత్తర్వులను పరిశీలించాలని కోరారు. ఎస్ ఏ ఓ -I డివై సిసి ఏ బాధ్యతలు, అకౌంట్స్ విభాగంలోని పోస్టింగ్‌లు, దీర్ఘకాలికంగా కొనసాగుతున్న అధికారుల వ్యవహారశైలిపై వచ్చిన ఫిర్యాదులను కూడా విచారించాలని అన్నారు. ఉద్యోగులను అనుచితంగా మాట్లాడటం, మెమోలు, బదిలీల పేరుతో ఒత్తిడి చేస్తున్నారన్న ఆరోపణలపై సంబంధిత ఉద్యోగుల వాంగ్మూలాలు, రికార్డుల ఆధారంగా నిజానిజాలు తేల్చాలని కోరారు. పాత ప్లాంట్ స్క్రాప్ విక్రయాలకు సంబంధించిన ఆరోపణలపైనా సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ చేశారు. కేటీపీఎస్ -VII స్టేజ్ చీఫ్ ఇంజనీర్‌తో పాటు ఎనర్జీ డిపార్ట్‌మెంట్, ఎనర్జీ సెక్రటరీ, టీజీ జెన్కో సీఎండీ ఈ అంశాలను పరిశీలించి, తప్పు ఉంటే నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని, లేకపోతే రికార్డుల ఆధారంగా స్పష్టత ఇవ్వాలని రాజేష్ కోరారు. సమస్యలపై స్పందన లేకుంటే



శాంతియుత, ప్రజాస్వామ్య పద్ధతిలో ఉన్నతాధికారులకు తదుపరి ప్రతినిధిత్వాలు సమర్పిస్తామని తెలిపారు.

# పోడు భూముల సమస్యలపై అటవీ శాఖ అధికారులతో చర్చించిన ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు



**కొత్తగూడెం సెప్టెంబర్ 21 తెలంగాణ జిల్లా ప్రతినిధి కూరపాటి దాసు :** పినపాక నియోజకవర్గంలోని పలు మండలాలు, గ్రామాల్లో గిరిజన రైతులు ఎదుర్కొంటున్న పోడు భూముల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరుతూ పినపాక శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అటవీ శాఖ జిల్లా అధికారి సిద్దార్థ విక్రమ్ సింగ్, ఐఎఫ్ఎస్, నిషా, ఉప అటవీ సంరక్షణ అధికారి బాబు తదితర అధికారులను కలిసి సమస్యలపై విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో పోడు భూములపై ఆధారపడి జీవిస్తున్న గిరిజన రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను ఎమ్మెల్యే అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. పోడు భూములకు సంబంధించిన సమస్యలు, భూములపై హక్కులు, అటవీ శాఖ పరిధిలో పెండింగ్‌లో ఉన్న అంశాలు, రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను వివరించి, వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలు చేపట్టాలని కోరారు. గిరిజన రైతుల జీవనోపాధికి సంబంధించిన పోడు భూముల సమస్యను సానుకూలంగా పరిశీలించి, క్షేత్రస్థాయిలో పరిస్థితులను పరిశీలించాలని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అధికారులను కోరారు. అర్హులైన గిరిజన రైతులకు ప్రభుత్వ తరుపున న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవడంతో పాటు, పెండింగ్‌లో ఉన్న సమస్యలను గుర్తించి త్వరితగతిన పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. పినపాక నియోజకవర్గంలోని గిరిజన ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం మరియు సంబంధిత శాఖల అధికారులతో సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగుతున్నామని ఎమ్మెల్యే తెలిపారు. పోడు భూముల సమస్యలతో రైతులు ఇబ్బందులు పడకుండా, వారి సమస్యలకు పరిష్కారం దిశగా నిరంతరం కృషి చేస్తామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా అటవీ శాఖ అధికారులు ఎమ్మెల్యే గారు ప్రస్తావించిన అంశాలను పరిశీలించి, సంబంధిత సమస్యలను పరిష్కరిస్తామని తెలిపారు.

# కొత్తపల్లి అంగన్వాడి కేంద్రంలో పోషణ మాస కార్యక్రమం ఏర్పాటు



**పోరు తెలంగాణ ప్రతినిధి (భూమేశ్వర్) :** ముప్కాల్ మండలంలోని కొత్తపల్లి గ్రామ అంగన్వాడి కేంద్రంలో పోషణ మాస కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణీలకు బాలింతలకు 0-6 సంవత్సరం లోపు పిల్లలకు పోషక విలువలు వ్యక్తిగత పరిశుభ్రత ఆహార పదార్థాల వినియోగం లాంటి అంశాలపై అవగాహన కల్పించారు ఈ కార్యక్రమంలో సర్పంచ్ నిశాంత్, ఐసిడీఎస్ సూపర్వైజర్ మాధవి, ఐకెపి ఎపిఎం శ్యాం, కార్యదర్శి రాజు, అంగన్వాడీలు పద్మ, రేఖ, ఆశ, మానస, బాలింతలు పిల్ల తలలు పాల్గొన్నారు.

# కేటీపీఎస్ ఏ కాలనీలో ఘనంగా గణేష్ నవరాత్రి ఉత్సవాలు

**పూజల్లో పాల్గొన్న జాతీయ మాల విద్యుత్ ఉద్యోగుల సంఘం జాతీయ అధ్యక్షుడు బూర్గుల విజయభాస్కరరావు**



**కొత్తగూడెం ఆర్సీ/పాల్వంచ, సెప్టెంబర్ 21(పోరు తెలంగాణ (ప్రతినిధి,జివిరత్నం):** కేటీపీఎస్ ఏ కాలనీలో చెరుకు భాగ్యలక్ష్మి--అశోక్ కార్పొరేటర్ దంపతుల కుమారుల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శ్రీ గణేష్ నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. సోమవారం జరిగిన ఉత్సవాల్లో జాతీయ మాల విద్యుత్ ఉద్యోగుల సంఘం జాతీయ అధ్యక్షుడు బూర్గుల విజయభాస్కరరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీ గణనాథుని దర్శించుకుని ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అనంతరం తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొని భక్తులతో కలిసి అన్నప్రసాదాన్ని స్వీకరించారు.ఎన్నో సంవత్సరాలుగా భక్తిశ్రద్ధలతో గణేష్ నవరాత్రి ఉత్సవాలను నిర్వహిస్తూ, అన్నదానం వంటి సేవా కార్యక్రమాలను చేపడుతున్న చెరుకు భాగ్యలక్ష్మి--అశోక్ కుటుంబ సభ్యులు, వారి కుమారులు, ఉత్సవ కమిటీ సభ్యులను బూర్గుల విజయభాస్కరరావు అభినందించారు. భక్తి, సేవా భావంతో ఇటువంటి కార్యక్రమాలను కొనసాగించడం అభినందనీయమని పేర్కొన్నారు. శ్రీ గణనాథుని ఆశీస్సులతో నిర్వాహకులు, భక్తులు, వారి కుటుంబ సభ్యులు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆయన ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# అల్పాహారాన్ని ప్రారంభించిన సర్పంచ్ రాగిడి మంగ

**విద్యార్థులకు పౌష్టికాహారం గా అల్పాహారం**



**పోరు తెలంగాణ ఓదెల ప్రతినిధి రవీంద్ర చారి** : ఓదెల మండలంలోని జీలకుంట ప్రభుత్వ పాఠశాలలో ప్రభుత్వం ప్రవేశపెట్టిన విద్యార్థులకు ఉచిత అల్పాహారం పథకం గ్రామ సర్పంచ్ రావిడి మంగ ఘనంగా ప్రారంభించారు. చిన్నారులకు స్వయంగా అల్పాహారం వడ్డించారు. ఈ పథకం ద్వారా ప్రతిరోజు ఉదయం విద్యార్థులకు పౌష్టికాహారంతో కూడిన అల్పాహారం ఉచితంగా అందించడం జరుగుతుందని, దీని వల్ల పిల్లల హాజరు, ఆరోగ్యం మెరుగుపడుతుందని ,విద్యార్థులు ఆకలితో బడికి రాకూడదనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి ఈ పథకం ప్రారంభించారని రాగిడి మంగ తెలిపారు .. రాష్ట్రంలో ఏ విద్యార్థి కూడా అర్ధాకలితో పాఠశాలకు వెళ్లకూడదన్న లక్ష్యంతో కాంగ్రెస్ ప్రభుత్వం ఈ పథకాన్ని అమలు చేస్తోందని తెలిపారు. విద్యార్థుల ఆరోగ్యం, భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని ఆరోగ్యకరమైన అల్పాహారం అందించాలని ప్రభుత్వం నిర్ణయించిందని పేర్కొన్నారు. ఖాళీ కడుపుతో పాఠశాలకు వచ్చే విద్యార్థులు పాఠాలపై ఏకాగ్రత చూపలేకపోతున్నారని, వారి అభ్యాస సామర్థ్యాన్ని పెంచడమే ఈ పథకం ప్రధాన ఉద్దేశమని చెప్పారు. ఈ సందర్భంగా తెలంగాణ ప్రభుత్వానికి సర్పంచ్ ధన్యవాదాలు తెలిపారు ..

# గూడెంలో ఘనంగా కుంకుమ పూజ



**పోరు తెలంగాణ పతినిధి (దండేపల్లి):** దండేపల్లి మండలశీ లోగూడెం గ్రామంలో గణపతి మండపం వద్ద కుంకుమ పూజ కార్యక్రమం ఘనంగా జరిగింది. రుద్ర టీం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పూజలో మహిళా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. మహిళలు భక్తిశ్రద్ధలతో గణపతికి కుంకుమ పూజ నిర్వహించి నైవేద్యం సమర్పించారు. ఈ కార్యక్రమం భక్తిమయ వాతావరణంలో విజయవంతంగా జరిగింది.

# గురుకుల టెండర్ల అక్రమాలపై ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్‌కు ఫిర్యాదు

**కలెక్టరేట్‌లో స్వేరోస్ ప్రతినిధుల వినతి**



**కొత్తగూడెం ఆర్సీ/పాల్వంచ, సెప్టెంబర్ 21(పోరు తెలంగాణ (ప్రతినిధి,జివిరత్నం):** గురుకుల టెండర్ల ప్రక్రియలో జరుగుతున్న అక్రమాలు, నిబంధనల ఉల్లంఘనలపై సమగ్ర విచారణ చేపట్టాలని కోరుతూ స్వేరోస్ ప్రతినిధులు సోమవారం కలెక్టరేట్‌లో ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. టెండర్ల ప్రక్రియలో పూర్తి పారదర్శకత పాటించేలా చర్యలు తీసుకోవాలని, అక్రమాలు జరిగినట్లు తేలితే బాధ్యులపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని వారు కోరారు. గురుకులాల టెండర్లకు సంబంధించిన అంశాలను సమగ్రంగా పరిశీలించి, అర్హులైన వారికి న్యాయం జరిగేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో స్వేరోస్ జిల్లా అధ్యక్షుడు కేసరి రవిందర్, ఉపాధ్యక్షుడు వానపాకుల నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# నీటిపారుదల ప్రాజెక్టుల భూసేకరణ, ఆర్‌డఆర్ పనులను వేగవంతం చేయాలి

**అధికారులకు రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆదేశం**

**కొత్తగూడెం సెప్టెంబర్ 21 పోరు తెలంగాణ జిల్లా ప్రతినిధి కూరపాటి దాసు** : రాష్ట్రంలోని నీటిపారుదల ప్రాజెక్టులకు అవసరమైన భూసేకరణ, అటవీ భూముల పరిహారం, పునరావాసం--పునరావాస పునరుద్ధరణ (ఆర్‌డఆర్) పనులను వేగవంతం చేయాలని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలోని అన్ని నీటిపారుదల ప్రాజెక్టులకు సంబంధించిన పెండింగ్ భూసేకరణ, అటవీ భూముల పరిహారం, ఆర్‌డఆర్ పనుల పురోగతిపై రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు సోమవారం సంబంధిత జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా నుంచి ఐడీఓసీ కార్యాలయం నుంచి భద్రాచలం సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ, అదనపు కలెక్టర్ డి. వేణుగోపాల్, జిల్లా అటవీ శాఖ అధికారి సిద్ధార్థ విక్రమ్ సింగ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ, నీటిపారుదల ప్రాజెక్టులకు అవసరమైన భూసేకరణ, అటవీ భూముల పరిహారం, ఆర్‌డఆర్ పనులకు అవసరమైన నిధులను పూర్తిస్థాయిలో విడుదల చేసేందుకు ముఖ్యమంత్రి అంగీకరించారని తెలిపారు. నీటిపారుదల శాఖకు కేటాయించిన నిధులతో పాటు ఇతర వనరుల నుంచి నిధులను బదిలీ చేసి అవసరమైన మేరకు సమకూర్చేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని చెప్పారు. 2026--27 ఆర్థిక సంవత్సరంలో భూసేకరణ కోసం రూ.6 వేల కోట్ల వరకు



నిధులు విడుదల చేయనున్నట్లు మంత్రి తెలిపారు. ఇప్పటికే రూ.1,050 కోట్లు, తాజాగా మరో రూ.1,500 కోట్లు కలిపి మొత్తం రూ.2,550 కోట్లు విడుదల చేసినట్లు పేర్కొన్నారు. విడుదలైన నిధుల్లో అధిక భాగం ఇప్పటికీ అధికారుల ఖాతాల్లోనే ఉండి లబ్ధిదారులకు చేరకపోవడం ఆందోళనకరమని అన్నారు. భూసేకరణ లబ్ధిదారులకు పరిహారం చెల్లింపులను కలెక్టర్లు వేగవంతం చేయాలని ఆదేశించారు. నిధుల కొరత లేదా ఇతర కారణాలతో పరిహారం చెల్లింపులు నిలిచిపోతే సంబంధిత వివరాలను ప్రభుత్వానికి పంపి అదనపు నిధుల కోసం ప్రతిపాదనలు సమర్పించాలని సూచించారు. విడుదలైన నిధులను అధికారుల వద్ద ఉంచి పనులను పెండింగ్‌లో పెట్టవద్దని స్పష్టం చేశారు. భూసేకరణ పనులకు ప్రత్యేక అధికారులను నియమించి బాధ్యతలు అప్పగించడంతో పాటు, ఈ అంశాన్ని అత్యంత ప్రాధాన్యతగా తీసుకుని ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించారు. . ఇప్పటికే విడుదలైన రూ.2,550 కోట్లను పూర్తిగా వినియోగించిన అనంతరం అవసరాన్ని బట్టి అదనపు నిధులు విడుదల చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు. భూసేకరణ ప్రక్రియలో రైతుల సూచనలు, అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోవాలని మంత్రి అన్నారు. కలెక్టర్లు, ఉన్నతాధికారులు రైతులతో నేరుగా చర్చించి స్నేహపూర్వక వాతావరణంలో భూసేకరణ ప్రక్రియను పూర్తి చేయాలని సూచించారు. భూసేకరణ నిబంధనల ప్రకారం జరగాలని, రైతులకు ఎలాంటి అన్యాయం జరగకుండా పరిహారం మార్కెట్ విలువకు సాధ్యమైనంత సమీపంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నీటిపారుదల ప్రాజెక్టుల కోసం ముఖ్యమంత్రి బడ్జెట్‌కు అదనంగా ఇతర వనరుల నుంచి నిధులు సమకూర్చి మంజూరు చేస్తున్నందున అధికారులు భూసేకరణను అత్యంత ప్రాధాన్యతతో పూర్తి చేయాలని మంత్రి సూచించారు. రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ, ఇప్పటికే అవార్డులు జారీ చేసిన భూములకు సంబంధించిన పరిహారం చెల్లింపులను మొదటి ప్రాధాన్యతగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. అవార్డు జారీ చేసిన తరువాత కూడా ఎక్కువ కాలం పరిహారం అందకపోతే ప్రజల్లో అసంతృప్తి పెరగడంతో పాటు అధిక పరిహారం కోసం డిమాండ్లు పెరిగే అవకాశం ఉంటుందని తెలిపారు. నీటిపారుదల ప్రాజెక్టుల పెండింగ్ భూసేకరణపై ప్రతి వారం సమీక్ష నిర్వహించి పనులను వేగవంతం చేయాలని సూచించారు. ఈ సమావేశంలో సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# వినాయక నిమజ్జన ఏర్పాట్లపై వివిధ శాఖల అధికారులతో సీపీ సమన్వయ సమావేశం



**పోరు తెలంగాణ న్యూస్ //రామగుండం** : పెద్దపల్లి వినాయక నిమజ్జన కార్యక్రమాలను ప్రశాంతంగా, సురక్షితంగా, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా నిర్వహించేందుకు రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝా ఆధ్వర్యంలో వివిధ ప్రభుత్వ శాఖల అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పోలీస్,సింగరేణి, మున్సిపల్, రెవెన్యూ,విద్యుత్, వైద్య ఆరోగ్య, ఎస్‌డీఆర్‌ఎఫ్, అగ్నిమాపక,ఫిషరీస్ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు. వినాయక నిమజ్జనానికి సంబంధించిన ఏర్పాట్లు,భద్రతా చర్యలు,ప్రజలకు కల్పించాల్సిన మౌలిక సదుపాయాలు, అత్యవసర పరిస్థితుల్లో చేపట్టాల్సిన చర్యలపై సీపీ అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా సీపీ అంబర్ కిశోర్ ఝా మాట్లాడుతూ, వినాయక నిమజ్జన కార్యక్రమం పెద్ద ఎత్తున జరిగే నేపథ్యంలో అన్ని శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో ముందస్తు ప్రణాళికతో పనిచేయాలని సూచించారు.గత సంవత్సరం నిమజ్జనం సందర్భంగా ఎదురైన సమస్యలు, ఇబ్బందులు, లోపాలను సమీక్షించి,అవే సమస్యలు ఈ సంవత్సరం పునరావృతం కాకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. నిమజ్జన ప్రదేశాలు, శోభాయాత్ర మార్గాలు,రద్దీ ప్రాంతాలు,పార్కింగ్ ప్రదేశాలను ముందుగానే పరిశీలించి అవసరమైన ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఫిషరీస్,సంబంధిత శాఖల అధికారులు నిమజ్జన ప్రదేశాల్లో నీటి లోతు, ప్రమాదకర ప్రాంతాలను ముందుగానే గుర్తించి, అవసరమైన చోట హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని తెలిపారు. ప్రమాదాల నివారణకు రక్షణ సిబ్బంది,శిక్షణ పొందిన ఈతగాళ్లు, రెస్క్యూ బృందాలు, అవసరమైన రక్షణ పరికరాలను అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. మున్సిపల్ అధికారులు నిమజ్జన ప్రదేశాల్లో పారిశుద్ధ్యం, తాగునీరు,లైటింగ్, రోడ్ల పరిస్థితి, పార్కింగ్ తదితర ఏర్పాట్లను పర్యవేక్షించాలని సూచించారు. విద్యుత్ శాఖ అధికారులు నిమజ్జన మార్గాలు, మండపాలు, నిమజ్జన ప్రదేశాల్లో విద్యుత్ వైర్లు, స్తంభాలు, తాత్కాలిక విద్యుత్ కనెక్షన్లను ముందుగానే పరిశీలించి,ఎలాంటి ప్రమాదాలకు అవకాశం లేకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అగ్నిమాపక శాఖ అధికారులు అత్యవసర పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని అవసరమైన ఫైర్ టెండర్లు,సిబ్బంది, రక్షణ పరికరాలను కీలక ప్రాంతాల్లో సిద్ధంగా ఉంచాలని తెలిపారు.సింగరేణి అధికారులు తమ పరిధిలోని నిమజ్జన మార్గాలు, రహదారులు, సంబంధిత ప్రాంతాల్లో అవసరమైన సహకారం అందించాలని, ప్రజల రాకపోకలకు ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. పోలీస్ అధికారులు నిమజ్జన శోభాయాత్ర మార్గాల్లో ట్రాఫిక్ నియంత్రణ,రద్దీ నిర్వహణ, బందోబస్తు, పార్కింగ్,క్రేన్‌లు, ఇతర అత్యవసర సేవల సమన్వయంపై ప్రత్యేక దృష్టి సారించాలని సీపీ ఆదేశించారు. నిమజ్జన కార్యక్రమం సజావుగా జరిగేలా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ సమావేశంలో అదనపు డీసీపీ (పరిపాలన) కె.శ్రీనివాస్,ఆర్‌జీ-1 జీఎం లలిత్ కుమార్,స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ నాగేంద్ర గౌడ్, గోదావరిఖని ఏసీపీ ఎం.రమేష్, జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు, ఇన్‌స్పెక్టర్ ఇంద్రసేనారెడ్డి, రామగుండం సీఐ కృష్ణకుమార్, గోదావరిఖని 2 టౌన్ సీఐ ప్రసాద్ రావు, జైపూర్ సీఐ నవీన్ కుమార్,ఎస్ఐ భూమేష్‌తో పాటు వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# జిల్లాలో రహదారి ప్రమాదాల నివారణకు పటిష్టమైన చర్యలు

**జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**

**పోరు తెలంగాణ న్యూస్// మంచిర్యాలసెప్టెంబర్ 21, 2026** : జిల్లాలో రహదారి ప్రమాదాల నివారణకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పటిష్టమైన చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సోమవారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో డి.సి.పి. ఎ.భాస్కర్, జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య, జిల్లా అటవీ అధికారి రాహుల్ కిషన్ జాదవ్, బెల్లంపల్లి సబ్ కలెక్టర్ మనోజ్ లతో కలిసి రహదారి భద్రత సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో రహదారి ప్రమాదాలు తగ్గించేందుకు, నివారణకు అధికారుల సమన్వయంతో చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణ చర్యలు పటిష్టంగా అమలు చేయాలని, వాహనదారులు రోడ్డు భద్రత నియమాలు తప్పనిసరిగా పాటించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని తెలిపారు. మున్సిపల్ పరిధిలో రోడ్డు ప్రమాదాల నివారణకు స్పీడ్ బ్రేకర్లు, ఇతర రోడ్డు భద్రత సూచికలు ఏర్పాటు చేయాలని తెలిపారు. మున్సిపల్ పరిధిలోని రోడ్లపై చెత్త, ఆటంకాలను వెంటనే తొలగించాలని, ట్రాఫిక్ పోలీసు విభాగం రోడ్లపై అనధికార వాహన నిలుపుదల, నిబంధనల ఉల్లంఘన పట్ల కఠిన చర్యలు తీసుకోవాలని తెలిపారు. రోడ్లపై తక్కువ విజిబిలిటీ ఉన్న చోట్ల లైటింగ్ ఏర్పాటు చేయాలని, జాతీయ రహదారులపై రంబుల్ స్ట్రిప్స్, లైటింగ్, జాగ్రత్త సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని, రహదారులపై వాహనాలు నిలపకుండా రహదారులు భవనాలు, పోలీసు శాఖల ఆధ్వర్యంలో చర్యలు తీసుకోవాలని తెలిపారు. రవాణా శాఖ ఆధ్వర్యంలో రోడ్లపై అదుపు తప్పిన, ఓవర్ లోడెడ్ వాహనాలు, పరిమితికి మించి వేగంగా వెళ్లే వాహనాలు, ఫిట్ నెస్ లేని స్కూల్ బస్సులపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ట్రాఫిక్ పోలీసు అధికారులు ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ తప్పనిసరి చేయడంలో కఠినంగా వ్యవహరించాలని తెలిపారు. మున్సిపల్ కమిషనర్లు తమ పరిధిలో రోడ్డు భద్రతకు అవసరమైన చర్యలు





చేపట్టాలని, గ్రామీణ ప్రాంతాలలో, అంతర్గత రహదారులలో తగిన జాగ్రత్తలు తీసుకోవడం జరుగుతుందని, జిల్లా వ్యాప్తంగా వేగ పరిమితి బోర్డులు, హెచ్చరిక బోర్డులు, జాగ్రత్త సూచికలు ఏర్పాటు చేయాలని తెలిపారు. ఓవర్ లోడింగ్, మితిమీరిన వేగం, డ్రంక్ అండ్ డ్రైవింగ్, రాంగ్ సైడ్ డ్రైవింగ్ లపై ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని తెలిపారు. రోడ్లపై సంచరించే పశువులను అందుబాటులో ఉన్న గోశాలకు తరలించాలని, నూతన గోశాల ఏర్పాటుకు భూమిని కేటాయించడం జరిగిందని త్వరితగతిన పనులు చేపట్టి పూర్తి చేయాలని తెలిపారు. రహదారి ప్రమాదాలు, మరణాలు తగ్గించేలా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు. డి.సి.పి. మాట్లాడుతూ జిల్లాలో 2026 సంవత్సరంలో ఇప్పటివరకు 429 ప్రమాదాలు జరిగాయని, ఈ ప్రమాదాలలో 95 మంది మృతి చెందారని తెలిపారు. జిల్లాలో ప్రమాదాల నివారణకు పటిష్టమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. బెల్లంపల్లి కన్నాల ప్రాంతంలో, నస్పూర్ లోని కలెక్టరేట్ కమాన్ ప్రాంతంలో రంబల్ స్ట్రిప్స్ ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. అనంతరం మాదకద్రవ్యాల నియంత్రణపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మాదక ద్రవ్య రహిత మంచిర్యాల జిల్లా సాధనలో భాగంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. జిల్లాలో ఈ సంవత్సరం ఇప్పటి వరకు 63 కేసులు నమోదు చేయడం జరిగిందని, ఇందులో 133 మందిని అరెస్టు చేసి 35 మందిని డ్రగ్ డి-అడిక్షన్ కేంద్రాలకు తరలించి కౌన్సిలింగ్ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. మాదకద్రవ్యాల నియంత్రణలో భాగంగా వైద్యుల ప్రిస్క్రిప్షన్ లేకుండా మందులు ఇవ్వకుండా చర్యలు తీసుకోవాలని, జిల్లా మాధ్యమిక విద్యాధికారి ఆధ్వర్యంలో జూనియర్ కళాశాలలో అబ్నార్మల్ బిహేవియర్ ఉన్న విద్యార్థులను గుర్తించి సంబంధిత ఎస్ హెచ్ ఓ కు సమాచారం అందించాలని తెలిపారు. విద్యార్థులకు మాదకద్రవ్యాల నియంత్రణపై క్విజ్, డ్రాయింగ్ మొదలగు పోటీలను నిర్వహించాలని తెలిపారు. విద్యాసంస్థలకు 100 మీటర్ల పరిధిలో బెల్ట్ షాపులు నిర్వహించడం, పొగాకు సంబంధిత ఉత్పత్తులను అమ్మడం నిషేధించడం జరిగిందని, ఆ దిశగా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని తెలిపారు. మెడికల్, ఐటిఐ, ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాలలలో నిత్యం మాదక ద్రవ్యాల వినియోగంపై విద్యార్థులను గమనిస్తూ మాదక ద్రవ్యాల వినియోగం వలన కలిగే నష్టాలపై అవగాహన కల్పించాలని తెలిపారు. జిల్లాలోని మద్యం దుకాణాలు నిర్ణీత సమయానికి మూసివేసేలా చర్యలు తీసుకోవాలని, బెల్ట్ షాపులను నియంత్రించాలని తెలిపారు. వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో గంజాయి తదితర మొక్కల సాగు చేసే వారిని గుర్తించాలని తెలిపారు. డ్రగ్ ఇన్స్పెక్టర్ ఆధ్వర్యంలో మెడికల్ షాప్ లను నిత్యం పర్యవేక్షించాలని, సరైన ప్రిస్క్రిప్షన్ లేకుండా మందులను విక్రయించే షాపులపై కఠిన చర్యలు తీసుకోవాలని తెలిపారు. డి అడిక్షన్ కేంద్రాలలో అవసరమైన కిట్లను అందుబాటులో ఉంచాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ విలాయత్ అలీ, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# కొత్త రకం స్కామ్.. ఐటీ రిటర్న్స్ ఆలస్యమంటూ దోచేస్తున్నారు! ముఖ్యంగా..

పన్ను వాపసులలో జాప్యం కారణంగా మోసగాళ్లు నకిలీ సందేశాలు, కాల్స్‌తో ప్రజలను లక్ష్యంగా చేసుకుంటున్నారు. ఆదాయపు పన్ను శాఖ అధికారులుగా నటిస్తూ ఓటీపీలు, బ్యాంక్ వివరాలను డిమాండ్ చేస్తున్నారు. ఎటువంటి తెలియని లింక్‌లపై క్లిక్ చేయవద్దని, వ్యక్తిగత సమాచారం పంచుకోవద్దని ఐటీ శాఖ హెచ్చరించింది. వాపసులలో జాప్యం జరుగుతుందనే నివేదికల మధ్య మోసగాళ్ళు ఇప్పుడు నకిలీ సందేశాలు, ఇమెయిల్‌లు, కాల్‌ల ద్వారా ప్రజలను లక్ష్యంగా చేసుకుంటున్నారు. ఆదాయపు పన్ను శాఖ అధికారులుగా నటిస్తూ ఈ వ్యక్తులు పన్ను చెల్లింపుదారుల నుండి ఓటీపీలు, బ్యాంక్ వివరాలను డిమాండ్ చేస్తున్నారు. సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ ఎక్స్‌లో, ఆదాయపు పన్ను శాఖ ప్రజలు తెలియని లింక్‌లపై క్లిక్ చేయవద్దని లేదా వారి వ్యక్తిగత సమాచారాన్ని పంచుకోవద్దని హెచ్చరించింది. నకిలీ సందేశాలు తరచుగా చిన్న స్పెల్లింగ్ తప్పులను కలిగి ఉంటాయని, నిజమైన వెబ్‌సైట్‌ల వలె కనిపించే నకిలీ లింక్‌లను అందిస్తాయని ఆ శాఖ వివరించింది. వీటిపై క్లిక్ చేయడం వలన గుర్తింపు దొంగతనం, బ్యాంక్ మోసం లేదా వ్యక్తిగత సమాచారం దుర్వినియోగం జరిగే అవకాశం ఉంది. పన్నుకు సంబంధించిన ఏదైనా సమాచారాన్ని అధికారిక వెబ్‌సైట్ www.incometax.gov.inలో మాత్రమే తనిఖీ చేయాలని ఆ శాఖ స్పష్టంగా పేర్కొంది. ఇమెయిల్, ఎస్ఎంఎస్ లేదా సోషల్ మీడియా ద్వారా వచ్చే రీఫండ్ అప్‌డేట్ లింక్‌లను నమ్మవద్దు. స్కామర్లు మీ రీఫండ్ నిలిచిపోయిందని, మీ రిటర్న్ అసంపూర్ణంగా ఉందని లేదా తక్షణ ధృవీకరణ అవసరమని పేర్కొంటూ సందేశాలను పంపుతారు. సందేశాలు తరచుగా "ఎమర్జెన్సీ రియాక్షన్ నీడ్" "రీఫండ్ పెండింగ్" లేదా "జరిమానా విధించబడుతుంది" వంటి బెదిరింపు పదాలను ఉపయోగిస్తారు. ఒక వ్యక్తి లింక్‌పై క్లిక్ చేసిన తర్వాత, వారు వారి పాన్ నంబర్, బ్యాంక్ వివరాలు, ఓటీపీని అడిగే నకిలీ వెబ్‌సైట్‌కు మళ్లిస్తారు.

**ఎలా ఫిర్యాదు చేయాలి?**

పాస్‌వర్డ్ లేదా బ్యాంక్ వివరాలను ఎప్పుడూ పంచుకోవద్దు.




అధికారిక పోర్టల్‌లో మాత్రమే అన్ని సమాచారాన్ని తనిఖీ చేయండి. మీకు ఏదైనా అనుమానాస్పద సందేశం వస్తే, దానిని webmanager@incometax.gov.in కు నివేదించండి.

అలాగే incident@cert-in.org.in కు కాపీని పంపండి.

సహాయం కోసం, హెల్ప్‌లైన్ నంబర్ 1800 103 0025 లేదా 080-46122000 ని సంప్రదించండి.

# ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు

**జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**





**పోరు తెలంగాణ, మంచిర్యాల, సెప్టెంబర్ 20 :** ప్రజావాణి కార్యక్రమంలో అందిన దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి త్వరగా పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. సోమవారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్లు పి.చంద్రయ్య, వి.రాములు, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ విలాయత్ అలీ లతో కలిసి అర్జీదారుల నుండి దరఖాస్తులు స్వీకరించారు. నెన్నెల మండలం నందులపల్లి గ్రామానికి చెందిన ఇందూరి నాగయ్య తన కుమారుడు తన భూమిలోకి రాకుండా అడ్డుకొని భయపెడుతున్నాడని, ఈ విషయమై తనకు న్యాయం చేయాలని కోరుతూ అర్జీ సమర్పించారు. క్యాతనపల్లి మున్సిపల్ పరిధిలోని 5వ వార్డుకు చెందిన గుర్రం అంకమ్మ తాను చుట్టూ రేకులతో తాత్కాలిక ఇల్లు ఏర్పాటు చేసుకొని నివసిస్తున్నానని, తనకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. లక్షెట్టిపేట మండలం లక్ష్మీపూర్ గ్రామానికి చెందిన కల్లు సునీత తనకు ఇందిరమ్మ ఇల్లు మంజూరై బేస్మెంట్ స్థాయి వరకు నిర్మాణం పూర్తి చేయడం జరిగిందని, బిల్లు ఇప్పించాలని కోరుతూ అర్జీ సమర్పించారు. నెన్నెల మండలం గన్‌పూర్ గ్రామానికి చెందిన కొట్టే అశోక్ తన తండ్రి పేరిట గల భూమి నిషేధిత జాబితాలో ఉందని, ఇట్టి భూమిని రికార్డుల ప్రకారం సవరించాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. జన్నారం మండలం కవ్వాల్ గ్రామ సర్పంచ్ తమ గ్రామపంచాయతీలో స్థానికంగా లేని కొంతమంది వ్యక్తులు తమ పేర్లను ఓటరు జాబితాలో నమోదు చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నారని, ఈ విషయంపై తగు విచారణ జరిపి ఓటరు జాబితా ప్రక్రియ సక్రమంగా చేపట్టాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. దండేపల్లి మండల కేంద్రానికి చెందిన జి. శైలజ తాను కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో ఫిజిక్స్ గెస్ట్ టీచర్ గా విధులు నిర్వహించానని, తనకు రావలసిన వేతనం ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి కార్యక్రమంలో అందిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరితగతిన పరిష్కరించే విధంగా అధికారుల సమన్వయంతో చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. అంతకుముందు జిల్లాలోని మందమర్రి మున్సిపల్ పరిధిలోని శ్రీపతి నగర్ లో అక్షర యూత్ గణేష్ మండలి వారు ఏర్పాటు చేసిన మట్టి వినాయకుడిని మున్సిపల్ కమిషనర్ రాజలింగు తో కలిసి దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా వినాయక మండలి వారు మట్టి వినాయకుడిని పూజించడం సంతోషంగా ఉందని, ఇదే స్ఫూర్తితో అన్ని గణేష్ మండళ్ల నిర్వాహకులు మట్టి వినాయకుని పూజించాలని తెలిపారు. వినాయక విగ్రహాల తయారీకి వినియోగించే ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ రంగుల ద్వారా వాయు, జల, నేల కాలుష్యం జరుగుతుందని, ఈ కాలుష్యాన్ని నియంత్రించే మట్టి వినాయకులను పూజించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# బంగారం, వెండిని ఇలా కొన్నారంటే.. మీ సంపద 3 రెట్లు పెరిగినట్టే..!



బంగారం, వెండి ధరలు ఆకాశాన్నంటుతున్న తరుణంలో, స్మార్ట్ పెట్టుబడి పద్ధతులు అధిక లాభాలను ఆర్జించేందుకు దోహదపడతాయి. ఆభరణాలు, నాణేలు వంటి భౌతిక రూపాల కన్నా గోల్డ్, సిల్వర్ ఈటీఎఫ్‌లు మెరుగైన ఎంపిక. తక్కువ ఖర్చు, సులభమైన కొనుగోలు-అమ్మకం, నిల్వ సమస్యలు లేకపోవడం, నియంత్రణ వంటి ప్రయోజనాలతో ఈటీఎఫ్‌లు అధిక రాబడికి సురక్షితమైన మార్గం. ఇటీవలి రోజుల్లో బంగారం, వెండి ధరలు భారీగా పెరిగాయి. సామాన్య మధ్య తరగతి ప్రజలు బంగారం కొనాలంటే బెంబేలెత్తిపోయే పరిస్థితి నెలకొంది. కానీ, పెట్టుబడిదారులు మాత్రం ఇదే అదునుగా పసిడిపై భారీగా పెట్టుబడులు పెడుతున్నారు. దీంతో ధరలు మరింతగా ఆకాశన్నంటుతున్నాయి. వెండి, గోల్డ్ ధరలు విపరీతంగా పెరుగుతున్న ఈ సమయంలో మీరు సరైన పెట్టుబడి పద్ధతిని ఎంచుకుంటే తక్కువ ఖర్చుతో పెద్ద లాభాలను ఆర్జించవచ్చని మార్కెట్ నిపుణులు అంటున్నారు. ధరలు పెరుగుతున్న నేపథ్యంలో సరైన పద్ధతిలో చేస్తే మీరు ఆదా చేసుకున్న డబ్బుపై ఊహించనంత లాభం పొందుతారు. అదేలాగో ఇక్కడ తెలుసుకుందాం.. సాధారణంగా బంగారం, వెండిలో పెట్టుబడి పెట్టేవారు ఆభరణాలు, నాణేలు, బిస్కెట్లను ఎంచుకుంటారు. కానీ, ఇటీవల నిపుణులు బంగారం, వెండి ఈటీఎఫ్‌లు (ఎక్స్ఛేంజ్ ట్రేడెడ్ ఫండ్స్) మెరుగైన, సులభమైన పెట్టుబడి ఎంపిక అని సూచిస్తున్నారు. ఈటీఎఫ్‌ల ప్రధాన ప్రయోజనాలు తక్కువ ధర, సులభంగా కొనుగోలు చేయడం, అమ్మడం లేదంటే, నిల్వ చేయడంలో ఇబ్బంది లేకపోవడం. బంగారు ఆభరణాలు కొనుగోలు చేసేటప్పుడు మేకింగ్ చార్జీలు పెద్ద భారంగా మారుతుంది. అలాగే, అమ్మేయాలనుకుంటే.. మనం పెట్టిన పెట్టుబడి పూర్తిగా తిరిగి రాదు. దీని వలన ఆభరణాలు లాభదాయకమైన పెట్టుబడి కాదని నిపుణులు అంటున్నారు. ఈ సంవత్సరం జనవరి నుండి డిసెంబర్ వరకు బంగారం ధర 82 శాతం, వెండి ధర 175 శాతం పెరిగింది. జనవరి 1న 10 గ్రాముల బంగారం ధర రూ. 76,772 ఉండగా, డిసెంబర్ 26న రూ. 1,39,890కి చేరుకుంది. అదేవిధంగా, వెండి ధర కిలోకు రూ. 87,300 నుంచి రూ. 2,40,300కి పెరిగింది. ఈటీఎఫ్‌ల ద్వారా పెట్టుబడి పెట్టడం వలన మీరు తీసుకున్న గోల్డ్ క్యారెట్ స్వచ్ఛత, తక్కువ కొనుగోలు చార్జీలు, అధిక ద్రవ్యత లభిస్తాయి. డీమ్యాట్ ఖాతా ద్వారా స్టాక్‌ల మాదిరిగానే ఈటీఎఫ్‌లను కొనుగోలు చేయవచ్చు లేదా విక్రయించవచ్చు, అవసరమైనప్పుడు నిధులను సులభంగా యాక్సెస్ చేయవచ్చు. డిజిటల్ గోల్డ్ కూడా ప్రజాదరణ పొందుతున్నప్పటికీ, ఇది సెబీ నియంత్రణలో ఉన్న ఉత్పత్తి కానందున కొన్ని నష్టాలు ఉన్నాయి. అందువల్ల, సెబీ నియంత్రణలో ఉన్న బంగారం, వెండి ఇటిఎఫ్‌ల ద్వారా పెట్టుబడి పెట్టడం సురక్షితమైన ఎంపిక అని నిపుణులు సూచిస్తున్నారు.

# త్వరలో రైతులందరికీ అకౌంట్లోకి రూ.2 వేలు.. మీకు వస్తాయో..? రావో? ఇలా చెక్ చేసుకోండి..



దేశవ్యాప్తంగా రైతులందరికీ కేంద్ర ప్రభుత్వం గుడ్ న్యూస్ తెలిపింది. ఫిబ్రవరిలో పీఎం కిసాన్ నిధులను విడుదల చేయనుంది. ఈ మేరకు రూ.2 వేలు రైతుల అకౌంట్లో నేరుగా జమ చేయనుంది. ఈ క్రమంలో మీకు అందుతాయో.. లేదో చెక్ చేసుకోవడం ఎలా అంటే.. దేశంలోని రైతులందరికీ త్వరలో కేంద్ర ప్రభుత్వం శుభవార్త అందించనుంది. పీఎం కిసాన్ సమ్మాన్ నిధి నిధులను త్వరలోనే రైతుల ఖాతాల్లోకి జమ చేసేందుకు సిద్ధమవుతోంది. ఫిబ్రవరిలో పీఎం కిసాన్ నిధులను కేంద్రం రైతుల అకౌంట్లలో నేరుగా జమ చేయనుంది. ఇందుకోసం ప్రాసెస్ జరుగుతుండగా.. ప్రధాని నరేంద్ర మోదీ ఎప్పటిలాగే స్వయంగా తన చేతుల మీదుగా పీఎం కిసాన్ నిధులను విడుదల చేయనున్నారు. ప్రతీ ఏడాది ఈ పథకం ద్వారా దేశవ్యాప్తంగా ఉన్న రైతులకు రూ.6 వేల సహాయం అందిస్తోంది. వీటిని రూ.2 వేల చొప్పున మూడు విడతలుగా జమ చేస్తున్నారు. నాలుగు నెలలకు ఒకసారి రూ.2 వేల చొప్పున వీటిని విడుదల చేస్తూ వస్తోంది. 5 ఎకరాల్లోపు పొలం ఉన్న రైతులకు మాత్రమే ఈ పథకం ద్వారా లబ్ధి చేకూర్చుతోంది ఫిబ్రవరిలో నిధులు విడుదల దాదాపు దేశవ్యాప్తంగా 9 కోట్ల మంది రైతులు పీఎం కిసాన్ లబ్దిదారులుగా ఉన్నారు. 22వ విడత డబ్బులను ఫిబ్రవరిలో విడుదల చేసేందుకు ముహూర్తం ఫిక్స్ అయిన క్రమంలో లబ్దిదారులు మీకు పీఎం కిసాన్ నిధులు వస్తాయా.. లేదా అనేది ఆన్‌లైన్ ద్వారా తెలుసుకోవచ్చు. పీఎం కిసాన్ వెబ్ సైట్ లేదా యాప్ ద్వారా చెక్ చేసుకోవచ్చు. ఒకవేళ మీకు రాకపోతే ఎందుకు రాలేదనే రీజన్ కూడా మీరు తెలుసుకోవచ్చు. ఇటీవల అనర్హులుగా తేలిన కొంతమంది రైతులను లబ్దిదారుల జాబితా నుంచి కేంద్ర ప్రభుత్వం తొలగించింది. మీ పేరు లబ్దిదారుల జాబితాలో ఉంటేనే నగదు జమ అవుతాయి మీకు డబ్బులు వస్తాయో..? రావో? చూసుకోవడమెలా.. వెబ్‌సైట్లోకి వెళ్లాలి -ఖఅశీష్‌శీబతీ ్ౕఘబం ఆప్షన్ ఎంచుకోవాలి -రిజిస్ట్రేషన్ నెంబర్ లేదా మొబైల్ నెంబర్ ఎంటర్ చేయాలి.

పోరు తెలంగాణ
డిజిటల్ తెలుగు దినపత్రిక



# భానుమూర్తి మన ప్రాణ దీప్తి!










సూర్యుడు అనంత చైతన్య స్వరూపుడు. అఖండ శక్తి సమన్వితుడు. కాలాన్ని నడిపించేదీ, కాల గమనాన్ని శాసించేదీ ఆయనే. గూటిలోని గువ్వపిట్టను మేల్కొలిపేదీ, నిద్రపుచ్చేదీ ఆయనే. మనలో జఠరాగ్నిని రగిల్చేదీ, కడుపు నింపేదీ కూడా ఆ ప్రత్యక్ష దైవమే. చెట్టూ పుట్టా జనమూ జలమూ అన్నిటికీ భాస్కరుడే బలం. అంతెందుకు, అవతార పురుషుడైన రామచంద్రుడికే అలసిన వేళ ఆలంబన అయ్యింది అద్భుతమని చెప్పుకోదగ్గ ఆదిత్య హృదయం. భానుడు సాక్షాత్తూ వేద స్వరూపుడు అంటుంది మంత్రం. ఆయన అనుగ్రహం అక్షయం. అందుకే ఆయన కదిలితే పండుగ. ఆయన మరలితే పర్వం. పన్నెండు రాశుల్లోనూ సంచరించే సూర్యుడు ఇప్పుడు మకర రాశిలో ప్రవేశిస్తున్నాడు. ఆ సందర్భాన్నే మకర సంక్రాంతిగా ఊరూవాడా జరుపుకొంటుంది. ఆయన ప్రసాదమైన ధాన్యపురాశుల్ని ముంగిట నింపుకొని ఆనందపు హేలలో మునిగితేలుతుంది. కాలగతి ఉత్తరాయణ పుణ్యకాలంలోకి అడుగిడుతున్న వేళ.. ఆ అక్షయ మూర్తికి అక్షర నీరాజనమిది. సప్తాశ్వ రథ ఆరూఢుడై భానుడు కదలి వస్తుంటే తెలిమంచు తెరలు తీస్తుంది. ఇలాతలం ఆప్యాయంగా ఆహ్వానం పలుకుతుంది. భోగిమంట ధూపమేస్తుంది. కళ్లాపి చప్పుళ్లు జేగంటలు మోగిస్తాయి. సప్తవర్ణాల ముగ్గులు బంగారు కిరణాలతో జతకూడి, సంరంభ సమాయత్తం చేస్తాయి. గొబ్బిళ్లు, చిక్కుళ్లు, రేగిపళ్లు సవినయంగా స్వాగతాంజలి ఘటిస్తాయి. సంక్రాంతి పండుగ అచ్చంగా సూర్యుడి పండుగే. సకల శుభంకరుడూ, సర్వ మంగళుడూ అయిన సూర్యుడు మరిన్ని మంగళాలను కలిగించే కాలానికి ప్రారంభం ఇది. అందుకే ప్రకృతినీ, మనిషినీ మమేకం చేస్తూ వేడుక చేసుకుంటాం ఇప్పుడు. నిరంతర చైతన్యశీలి అయిన సూర్యభగవానుడు మకర రాశిలో ప్రవేశించి, తన రథ గమనాన్ని ఈ రోజు ఉత్తర దిశగా మళ్లిస్తాడు. ఉత్తర దిశకు కుబేరుడు అధిపతి. దిక్కుల్లో ఉత్తమైనదిగా దీనికి పేరుంది. అందుకే ఈ సమయం ఉత్తరాయణ పుణ్యకాలమైంది. ఈనాటి నుంచే దేవతలకు పగలు ప్రారంభమవుతుంది. ఇప్పటినుంచి దక్షిణాయనం ప్రారంభమయ్యే వరకూ వారికి ఉదయ సమయం. అందుకే ఈ నెలల్లో పండుగలు ఎక్కువ. ఆధ్యాత్మిక ఉపాసకులకు పరమోత్తమ కాలం. దేవతల అనుగ్రహం మెండుగా లభించే ఈ సమయాన భానుడు ప్రచండుడుగా వెలుగులు విరజిమ్ముతుంటాడు. అనంతవిశ్వం నుంచి ఆధ్యాత్మిక తరంగాలను ఆయన కిరణాల ద్వారా జనులందరిపైనా కురిపించి తరింపజేస్తాడు.

### ఆయన రాకపోతే అంతమే

సూర్యుడు కాల స్వరూపుడు. సమయమూ భానుడూ వేరు వేరు కాదు. ఆదిత్యుడు ఆలస్యంగా ఉదయించే కాలాల్లో గడియారాలను ఓ గంట వెనక్కి మళ్లించడాన్నీ, ఆయన తొందరగా వచ్చే సమయాన వాటిని మళ్లీ అదే గంట

వ ు ు ం ద ు క ు
జరపడాన్నీ పాశ్చాత్య దేశాల్లో మనం గమనిస్తున్నాం. అంటే సూర్యుడి రథ చక్రానికి సమాంతరంగా గడియారం ముల్లు నడుస్తాయి. నడవాలి కూడా! ఎందుకంటే, మనలో జీవశక్తిని మేల్కొలిపే ఆయన కిరణ శక్తి లేకపోతే శరీరం ఎలా పనిచేస్తుంది? అలాగని ఒక్క రోజూ, ఒక్క నిమిషమైనా ఆయన ఆలస్యం చేసిన దాఖలాలూ కనిపించవు. ఆ విషయం సూర్యోదయ సూర్యాస్తమయ సమయాలను పరిశీలిస్తే తేటతెల్లం అవుతుంది. ఏడాదిలో ఒక రోజు ఒక చోట ఎన్నింటికి ఉదయించి, ఎన్నింటికి అస్తమిస్తాడో మళ్లీ అదే రోజు ఠంచనుగా అదే సమయానికి తూరుపు వేదిక మీద వెలుగుల పువ్వుగా వికసిస్తాడు. అంటే 2025 జనవరి 1వ తేదీన హైదరాబాద్‌లో సూర్యోదయం 6:46 గంటలకు అయితే, 2035, 2050 అయినా సరే జనవరి ఒకటో తేదీ సూర్యోదయం 6:46 గంటలకే ఉంటుంది. అలాగే అస్తమయమూ. ఆ రోజు 5:53 సూర్యాస్తమయం అయితే మళ్లీ జనవరి 1 ఎప్పుడు వచ్చినా అదే సమయానికి పడమటి రేవున పయనమైపోతాడు. అంత నిక్కచ్చిగా ఉండబట్టే కాలాలు సక్రమంగా సాగుతున్నాయి. పంటలు పండి మనుషుల ఆకలి తీరుతున్నది. అదే సూర్యుడు ఒక్క 3 రోజులు కనిపించకపోతే వాయు మండలంలోని జలం ఘనీభవించి మంచు తుపాను చెలరేగుతుంది. భూమి అంతా అమాంతంగా చల్లబడిపోయి సమస్త ప్రాణికోటి అంతరించిపోతుంది. నిరంతరం ప్రభవించే వెచ్చటి కిరణాలతో మనల్ని చల్లగా కాపాడుతున్నాడు కనుకనే ఆయన ప్రత్యక్ష నారాయణుడు. భారతీయులు, భారతదేశం లాంటి పదాల్లోనే ఇక్కడి ప్రజలకు సూర్యుడు అంటే ఎంతో ప్రీతి అన్న విషయం దాగి ఉంది. భా అంటే ప్రకాశం, వెలుగు అనే అర్థాలున్నాయి. రతము అంటే ప్రేమ, ప్రీతి, మక్కువ. అలాగే భరతుడు అంటే అగ్నిహోత్రుడు. అంటే సూర్యుడే. భారతీయులు అంటే వెలుగు పైన మక్కువ కలిగిన వారు అని అర్థం. వెలుగు మరోపేరు అఖిల విద్యలకున్ అంటుంది శాస్త్రం. విద్యల మీదా, ఇంకా లోతుకు వెళితే జ్ఞానం మీదా మక్కువ కలిగిన వారు భారతీయులు. అందుకే భారతదేశం జ్ఞానభూమి అయింది. ఆ వెలుగుకు ప్రత్యక్ష స్వరూపుడు సూర్యుడు. అందుకే మన దగ్గర సూర్యుడికి దివాకర్, ప్రభాకర్, భాను, రవి, భాస్కర్, సూర్య, ఆదిత్య, తేజస్వి, సవిత, మిత్ర, అర్క, మార్తాండలాంటి పేర్లు లెక్కకు మిక్కిలి ఉంటాయి. ప్రపంచ వ్మాయంలో సూర్యుడికి ఇన్ని పేర్లు మరెక్కడా కనిపించవు. అదీ భారతీయులకు భానుడి మీద ఉన్న ప్రీతి. మన దేశంలో ఇప్పటికీ సూర్యుడిని చూడనిదే భోజనం ముట్టని వాళ్లు ఉన్నారు. మన దగ్గర వేదకాలంలోనే భూమికి సూర్యుడి నుంచి ఉన్న దూరాన్ని సుస్పష్టంగా లెక్కవేశారు. భూమి నుంచి 14.98 కోట్ల కిలోమీటర్ల దూరంలో ఉన్న సూర్యుడి కిరణాల ప్రయాణ వేగం ఒక సెకనుకు 3 లక్షల కిలోమీటర్లు, అవి భూమిని చేరడానికి పట్టే కాలాన్ని 8 నిమిషాలుగా అంచనా కట్టారు ఖగోళ శాస్త్రవేత్తలు. ఇక్కడ భారతీయులు పరమ పవిత్ర గ్రంథంగా భావించే రామాయణంలోని ఓ విషయాన్ని చెప్పుకోవాలి. బాల్యంలో హనుమంతుడు నారింజ రంగులోని సూర్యుణ్ని చూసి పండు అనుకుని, తిందామనే ఉద్దేశంతో అక్కడికి ఎగిరి వెళ్లాడట. అందుకోసం ఆయన వెళ్లిన దూరాన్ని, 'యుగ సహస్ర యోజన పరభాను' అని తులసీదాస్ హనుమాన్ చాలీసాలో చెబుతారు. దీన్ని లెక్క కడితే 'యుగం.. 12000 ఏళ్లు, సహస్రం.. 1000, యోజనం.. 8 మైళ్లు, మైలు 1.6 కిలోమీటర్లు వెరసి దాదాపు 15 కోట్ల కిలోమీటర్లు. ఇది 'భూమి నుంచి సూర్యుడికి ఉన్న దూరం 14.98 కోట్ల కిలోమీటర్లు' అని శాస్త్రవేత్తలు చెబుతున్న లెక్కకు అటూ ఇటుగా సరిపోతుంది.

### నెలకో సూర్యుడు

సనాతన హైందవ సంప్రదాయంలో సూర్యోపాసనకు ప్రత్యేక స్థానముంది. పంచాయతనాల్లో సౌరం ఒక ఆరాధనా పద్ధతి. అందులో సూర్యుడే ప్రధాన దేవత.

'నమస్సవిత్రే జగదేకచక్షుషే జగత్ప్రసూతి స్థితినాశహేతవే
త్రయీమయాయ త్రిగుణాత్మధారిణే విరించి నారాయణ శంకరాత్మనే'

'జగత్తుకు నీవే కన్ను. సృష్టి స్థితి లయలకు కారకుడివి. సత్వ రజో తమో గుణాలూ నీలోనే ఉంటాయి. బ్రహ్మ విష్ణు మహేశ్వరుల సమైక్య మూర్తీ నమోస్తుతే' అంటూ ప్రార్థిస్తాం. భానుడు త్రిమూర్తుల సమైక్య రూపం కాబట్టే ప్రభాతంలో బ్రహ్మగా, మధ్యాహ్నం వేళ శివ స్వరూపుడిగా, సాయం సంధ్యలో విష్ణు రూపుడిగా కొలుస్తాం. భవిష్య, మార్కండేయ, బ్రహ్మాండ, విష్ణు పురాణాల్లో సూర్యమండల వర్ణన అద్భుతంగా ఉంటుంది. రామాయణ, మహాభారతాల్లో అనేక చోట్ల సూర్యుడి ప్రస్తావన కనిపిస్తుంది. ప్రశ్న, తైత్తరీయ, ఛాందోగ్య, బృహదారణ్యకాది ఉపనిషత్తులూ ఆయన్ను అమిత బలవంతుడిగా చూపించాయి. అసలు వేదమంతా కలుపుకొంటే సూర్యమండలమే. సూర్యుడి జననానికి సంబంధించి పురాణేతిహాసాల్లో పలు రకాల కథలు ఉన్నాయి. బ్రహ్మపురాణం ప్రకారం కశ్యప ప్రజాపతి, అదితి దంపతులకు సూర్యుడు జన్మించాడు. తల్లి కడుపులో ఉండగా సూర్యుడి వేడి వల్ల గర్భం విచ్ఛిన్నమవుతుంది. దైవానుగ్రహంతో ఆ గర్భం నుంచే సూర్యుడు ప్రభవించాడంటారు. అందుకే సూర్యుడిని మృతాండుడు, మార్తాండుడు అనే పేర్లతో పిలుస్తారు. సూర్యుడు ఒక్కడిగా కనిపించినా ఆయన చుట్టూ పెద్ద పరివారమే ఉంటుంది. ఏడు విభిన్న గణాలు ఉంటాయందులో. అందులో ద్వాదశ ఆదిత్యులు కూడా ఉన్నారు. మహాభారతం ప్రకారం.. వీళ్లంతా కశ్యప, అదితి సంతానమే. వీరి పేర్లు ధాత, మిత్ర, అర్యమ, ఇంద్ర, వరుణ, అంశు, భగ, వివస్వంత, పూష, సవిత, త్వష్ట, విష్ణు. వీళ్లు పన్నెండు మాసాల్లో సూర్యుడి శక్తిని పన్నెండు రకాలుగా భూమికి అందిస్తారు. ఇక మిగిలిన ఆరు గణాలు అప్సరస, రుషి, అసుర, సర్ప, యక్ష, గంధర్వులు. మొత్తంగా ఒక్కో సూర్యుడితో కలిసి వీళ్ల గణాల నుంచి ఒక్కొక్కరు ఒక్కో నెలను పరిపాలిస్తారు. ఆ కారణంగానే మాసాలు మారుతున్న కొద్దీ ప్రకృతితో మన అనుభూతీ విభిన్నంగా ఉంటుంది.

### సీతమ్మ మనసుకు మందు

పవళించే భువనాలను తన పావన కిరణ స్పర్శతో మేలు కొలుపుతాడు భానుడు. ఆయన సరిగ్గా కనిపించని రోజు శరీరాన్ని బద్ధకం ఆవరిస్తుంది. రోజులపాటు భానుడి ప్రతాపం తగ్గిందా అది కుంగుబాటుగానూ మారుతుంది. అమెరికాలాంటి దేశాల్లో చలికాలంలో ప్రతి 10 మందిలో నలుగురిని మానసికమైన దిగులు ఆవరిస్తున్నదని అమెరికన్ సైకియాట్రీ అసోసియేషన్ ఒక అధ్యయనంలో వెల్లడించింది. అంతేకాదు తీవ్రమైన కుంగుబాటు, బైపోలార్ డిజార్డర్‌లాంటి సమస్యల బారిన పడుతున్న వారి సంఖ్యా తక్కువేం కాదు. ఐరోపా దేశాల్లోనూ ఈ సమస్య పెద్ద స్థాయిలోనే కనిపిస్తుంది. సూర్యరశ్మి సరిగ్గా సోకకపోతే శరీరంలో మెలటోనిన్, సెరటోనిన్ హార్మోన్ల స్థాయుల్లో తేడా రావడమే దీనికి కారణం. ఇవి నిద్రను, మనసుని ప్రభావితం చేస్తాయి. ఇలాంటి సమస్యలు వచ్చినప్పుడు సూర్యరశ్మి లేదా అంతకు సమానమైన కాంతి కలిగిన ప్రత్యేక లైట్లతో దీనికి 'లైట్ థెరపీ' అనే చికిత్స చేస్తారు. మొత్తంగా చెప్పాలంటే మానసిక సమస్యలకూ సూర్యుడే మందు. ఈ విషయం రామాయణంలో సీత విషయంలోనూ కనిపిస్తుంది. సీతను క్షోభకు గురిచేయాలని భావిస్తాడు రావణుడు. రామలక్ష్మణుల మాయా తలలను తెచ్చి, యుద్ధంలో చంపానంటూ ఆమె ముందుంచుతాడు. వాటిని చూసి కంపించిపోతుంది సీత. తీవ్ర దుఃఖితురాలైన ఆమెతో అసలు నిజాన్ని చెబుతుంది విభీషణుడి కూతురు. అది అబద్ధమని తెలిసినా ఆమె దిగ్భ్రమ నుంచి బయటికి రాలేకపోతుంది. ఆ శోకం నుంచి విముక్తి పొందేందుకు ధ్యానంలోకి వెళుతుందామె. ప్రభాకరుడిని ఆశ్రయించు అంటూ మది నుంచి వచ్చిన సూచనతో సూర్యుడికి నమస్కారం చేస్తుంది. ఆ విధంగా కుంగుబాటు నుంచి బయటపడిందట. అంతేకాదు, అవసరమైనప్పుడు అనన్య సామాన్యమైన బలాన్నీ సూర్యుడు అందిస్తాడు. అజ్ఞాత వాసంలో ఉన్నప్పుడు ద్రౌపదిని చూసి మోహిస్తాడు కీచకుడు. ఏదో ఒక సాకుతో తన మందిరానికి రప్పించుకుంటాడు. అక్కడికి వెళ్లవలసిన తప్పని పరిస్థితి ఏర్పడ్డప్పుడు సూర్యుడికి నమస్కారం చేసుకుంటుంది ద్రౌపది. అప్పుడు తన గణాల్లోంచి ఓ రాక్షసుడిని ఆమె వెంట అదృశ్య రూపంలో పంపుతాడు ప్రత్యక్ష నారాయణుడు. అంతే కీచకుడు ద్రౌపది చేయి పట్టుకోగానే చప్పున దూరి తన పని పూర్తిచేస్తాడు. మహా బలవంతుడిగా పేరున్న కీచకుడు కూడా ద్రౌపది చేయి విదల్చగానే ఆమడదూరంలో ఎగిరిపడి, వణికి పోతాడు.

### సూర్యకాంతికీ బీఎంఐకీ సంబంధం

సూర్యకాంతికీ, మనం ఎత్తుకు-వయసుకు తగ్గ బరువు ఉండటానికీ సంబంధం ఉందని కొన్ని అధ్యయనాలు నిరూపిస్తున్నాయి. బాడీమాస్ ఇండెక్స్ (బీఎంఐ)గా పిలిచే ఇది చాలా కోణాల్లో మనం ఎండలో ఉండటం మీద ఆధారపడుతుంది. విటమిన్-డి అన్నది జీవక్రియ (మెటబాలిజం) బాగా జరగడానికి, తిన్న ఆహారంలోని క్యాలరీలు ఖర్చు అవ్వడానికి తోడ్పడుతుంది. విటమిన్-డి లోపం ఉన్న పిల్లల్లో జీవక్రియావేగం మందగించి ఊబకాయం తలెత్తుతున్నదట. మన శరీరంలోని లెప్టిన్ అనే హార్మోన్ ఆకలి లేదా, కడుపు నిండిన భావనలను నియంత్రిస్తుంది. ఇది సక్రమంగా విడుదలై పనిచేయడానికి సూర్యకాంతి సహకరిస్తుంది. ఉదయ, సాయంత్రాల్లో ఎండలో ఉండటం వల్ల బరువు నియంత్రణలో ఉండటం, గుండెజబ్బులు వచ్చే అవకాశం తగ్గడాన్ని జంతువుల మీద చేసిన వివిధ ప్రయోగాల్లో గుర్తించారు. రోగనిరోధక శక్తిని పెంచేందుకు సూర్యరశ్మి ఎంతగానో సహకరిస్తుంది. మెదడు ఏకాగ్రంగా పనిచేయడానికీ, మనసు ఆహ్లాదంగా ఉండటానికీ ఇదే కీలకం. శరీర గాయాలను మాన్పడంలోనూ ఎండ ప్రధాన పాత్ర పోషిస్తుంది. రుమటాయిడ్ ఆర్థరైటిస్, ఆస్తమాలాంటి ఎముక, శ్వాస సంబంధ వ్యాధుల నివారణకూ ఇది ఎంతగానో తోడ్పడుతుంది. ఇన్ఫెక్షన్లను దరిచేరనీయకుండా చేయడమే కాదు, మనలోని రకరకాల హార్మోన్లను నియంత్రణలో ఉంచేందుకూ ఇది మూలంగా పనిచేస్తుంది. అందుకే 'ఆరోగ్యం భాస్కరాధిచ్ఛేత్' అంటుంది శాస్త్రం. సూర్యుడు నమస్కార ప్రియుడు. ఆ కారణంగానే ఆరోగ్యం కోసం సూర్య నమస్కారాలను సూచిస్తుంది యోగ శాస్త్రం. సూర్య నమస్కారాలు మొత్తం 12 ఆసనాల సమాహారం. ఇందులో ప్రణామాసనంతో పాటు హస్త ఉత్థానాసనం, పాదహస్తాసనం, పర్వత, భుజంగాసనాల్లాంటివి ఉంటాయి. వీటన్నిటికీ ద్వాదశాదిత్యులకు సంబంధించిన మంత్రాలూ ఉంటాయి. అవి చదవడం, చదవకపోవడం అన్నది వ్యక్తిగత ఇష్టం. ఇక, ఉచ్ఛ్వాస నిశ్వాసలను సమన్వయం చేసుకుంటూ ఈ నమస్కారాలు చేయాలి. రక్తశుద్ధికి, రక్తప్రసరణ బాగా జరగడానికి, బరువు నియంత్రణలో ఉండటానికి, థైరాయిడ్, థైమస్‌లాంటి వివిధ గ్రంథులు సక్రమంగా పనిచేయడానికీ ఇవి బాగా ఉపకరిస్తాయి. వీటిలో ఒక్కొక్క ఆసనానికీ ఒక్కొక్క ప్రయోజనం ఉంటుంది. ఉదాహరణకు చేతులు పైకెత్తి వెనక్కి వంగి చేసే హస్త ఉత్థానాసనం వల్ల వెన్ను బలంగా అవుతుంది, నడుము నొప్పులు రావు. అలాగే నడుము వంచి అరచేతులతో పాదాలను పట్టుకునే పాదహస్తాసనం వల్ల గుండెకు రక్తం బాగా సరఫరా అవుతుంది. మైగ్రెయిన్, బీపీలాంటివి నియంత్రణలో ఉంటాయి. పెరిగే పిల్లలు వీటిని సాధన చేస్తే శరీరం దృఢంగా తయారవుతుంది.

### అక్షయ మూర్తి

జగత్తుకు మూలకర్తా, పోషకుడూ అయిన సూర్యనారాయణ మూర్తి అనుగ్రహం అక్షయం. అది మనకు పురాణేతిహాసాల్లో పలు సందర్భాల్లో ప్రస్ఫుటం అవుతుంది. మహాభారతంలో పాండవుల వనవాస ఘట్టంలో అలాంటి కరుణామృత ధార దర్శనమిస్తుంది. కుంతీ పుత్రులు, పరివారంతో కలిసి అడవులకేగినప్పుడు వాళ్ల వెంట రుషి ముని గణం కూడా బయల్దేరుతుంది. 'అయ్యో నేనే రాజ్యాన్ని వదిలి, కుటుంబంతో కలిసి కానలకు పోతున్నాను. మేమంటే ఏదో కందమూలాలు తిని జీవిస్తాం. మిమ్మల్ని నేనెలా పోషించగలను. అయినా ఈ రాజ్యానికి రాజు దుర్యోధనుడు మీరు ఆయనతో ఉండాలి కదా' అంటాడు ధర్మరాజు. 'మాకు పదవులతో పనేం ఉంది. ధర్మం వెంటే ఉంటాం, ధర్మం గెలవడం కోసం తపస్సు చేస్తాం' అని వాళ్లూ పాండవులతో పాటు కదిలారు. ఆ సందర్భంలోనే ధర్మరాజు సూర్యుణ్ని ఉపాసిస్తాడు. ఆయన అవసరాన్ని గ్రహించి, అద్భుతాలకే అద్భుతం అయిన 'అక్షయ పాత్ర'ను ప్రసాదిస్తాడు భానుడు. ఏ పదార్థం ఎంత కావాలన్నా ఇస్తూ, వేల మంది ఆకలి తీర్చే ఆ అమృతభాండం ఆయన అపార కరుణకు నిదర్శనం. అంతెందుకు, రోజుకు పన్నెండు బారువుల బంగారాన్నిచ్చే 'శమంతక మణి'ని సత్రాజిత్తుకు వరంగా ఇచ్చిందీ ఆదిత్యుడే. అందుకే ఆయన అక్షయమూర్తి. ప్రత్యక్షనారాయణుడిని ఉపాసిస్తే జయం, అక్షయ శుభం కలుగుతుందన్నది వేదవాక్కు.

### ఆదిత్యహృదయం పుణ్యం సర్వశత్రువినాశనమ్
### జయావహం జపేన్నిత్యమక్షయం పరమం శివమ్

అంటుంది ఆదిత్య హృదయంలోని మరో శ్లోకం. శాస్త్ర పరంగా జయం అంటే%ొ% ధర్మ, అర్థ, కామ, మోక్షాలన్నిటా సంపూర్ణత్వాన్ని పొందడం. అలాంటి విజయవంతమైన జీవితాన్ని ప్రసాదించమని ఆ ప్రత్యక్ష నారాయణుడిని ఈ పండుగ వాకిట వేడుకుందాం%ొ% సూర్య నారాయణా వేద పారాయణా అంటూ మనస్ఫూర్తిగా పాడుకుందాం!

### తేజోమయం ఆదిత్య హృదయం

శ్రీరామచంద్రుడు రావణాసురుడితో యుద్ధంలో ఉన్నాడు. ఈయన అవతార పురుషుడైతే ఆయన తపోసంపన్నుడు. అనేక వరాలు పొందినవాడు. అందుకే, యుద్ధ సమయంలో దెబ్బ తిన్నా మళ్లీ మళ్లీ బలం పుంజుకుని తిరిగి వస్తున్నాడు. దీంతో సాక్షాత్తూ రామభద్రుడికే ఓసారి విపరీతమైన అలసట ఆవరించిందట. ఆ సమయంలోనే రాముణ్ని సమీపిస్తాడు అగస్త్య మహర్షి. 'రామచంద్రా! నీకు అమిత బలప్రదాయిని అయిన ఓ దివ్య స్తోత్రాన్ని ఉపదేశిస్తాను దానివల్ల యుద్ధంలో నువ్వు ఇట్టే విజయం సాధించగలవు' అంటూ ఉత్సాహపరుస్తాడు. అలా అగస్త్యుడు రాముడికి ఉపదేశించిన మంత్రమే, సూర్యగీతగా ప్రసిద్ధి చెందిన'ఆదిత్య హృదయం'. ఇందులో సూర్యుడి వైభవం ఉంటుంది. ఆయన ఈ సృష్టికి చేస్తున్న మేలు ఉంటుంది. సూర్యుడి నామాల ప్రస్తావన కనిపిస్తుంది. భానుణ్ని కొలవడం వల్ల ఎంతటి మహత్తర ప్రయోజనాలు లభిస్తాయన్న వివరమూ ఉంటుంది. అందులో ఒక శ్లోకం ఇలా చెబుతుంది

## సర్వదేవాత్మకో హ్యేష తేజస్వీ రశ్మిభావనః
## ఏష దేవాసురగణాంల్లోకాన్ పాతి గభస్తిభిః

సూర్యుడు సర్వదేవాత్మకుడు. ఆత్మ అనే పదానికి స్వరూపం, శరీరం అనే అర్థం కూడా ఉంది. అంటే సర్వదేవతలకూ స్వరూపం ఈయనే. అందరికీ ఆత్మ ఇతడు. తేజస్వి అనే పదానికి కాంతి అనే కాదు, బీజశక్తి అనే అర్థం కూడా ఉంది. అంతమంది దేవతల ఏకీకృత రూపమైన ఈ పరమాత్మ సర్వజగత్తునూ తనలో దాగి ఉన్న బీజాలతో వ్యాప్తి చేస్తున్నాడు. రశ్మిభావనః అంటే రశ్ములను కలిగించువాడు. రశ్మి%ొ% అంటే అన్నప్రదాత. రశ్ములు అంటే సర్వ జీవులనూ పోషించే సూర్య కిరణ శక్తులు. అవి పై నుంచి కిందకి వస్తూ ప్రతి జీవిలోకీ ప్రవేశిస్తాయి. సూర్య రశ్ములను ప్రకృతి అంతా పొందుతుంది. సూర్యుడి వెలుగు తగలగానే అప్పటివరకూ మొగ్గలుగా ఉన్నవి పువ్వులుగా విచ్చుకుంటాయి. పక్షులు గూళ్లు వదులుతాయి. పర్వతాలు, ఇతర జడ పదార్థాలు, చెట్లూ పుట్టలూ వాటి వాటి ధర్మానుసారం రశ్ముల్ని తీసుకుంటాయి. మనిషి శరీరం ఒకలా స్వీకరిస్తుంది. అన్ని దిక్కులా వ్యాపించి ఉండే ఈ కిరణాల నుంచి వసువులు మొదలైన దేవతలు కూడా ఆహారాన్ని స్వీకరిస్తున్నారు. ఈ రశ్ములు ప్రతి జీవిలోకీ ప్రవేశిస్తాయి. దేవతల ఆహారమేమిటో వారికి, మన ఆహారం మనకు, జంతువుల ఆహారం జంతువులకు%ొ% ఆయనే ఇస్తున్నాడు. కాబట్టి ఆయన తేజస్వీ రశ్మిభావనః. ఆ సూర్యుడే తన చుట్టూ వ్యాపించి ఉన్న దేవ అసుర గణాలతో, ఆయన కిరణాల ద్వారా ఈ భూమిని పాలిస్తున్నాడు. ఇందులో సూర్యుడు పరమేశ్వరుడు ఎలా అయ్యాడో చెప్పారు. ఇక, ఈ స్తోత్రాన్ని పారాయణం చేయడం వల్ల శుభాలకే శుభం జరుగుతుంది. దీర్ఘాయుష్షు, సంపద, బ్రహ్మ వర్చస్సు.. కలుగుతాయి. ఇది శోక వినాశిని, శత్రు నాశిని అని చెబుతాడు అగస్త్య మహర్షి. ఆయన మాట ప్రకారం రాముడు దీన్ని విని పఠనం చేశాడు. ఒకే ఒక్క దెబ్బలో రావణున్ని పడగొట్టి అఖండ విజయాన్ని సాధించాడు. అంతటి శక్తిమంతమైనది కాబట్టే సూర్య ఉపాసనా సంప్రదాయంలో దీనికి విశిష్ట స్థానముంది.

# ఘనం.. పీవీ వనం

## నేచురల్ ఆస్పిరిన్!



నోరూరించే దానిమ్మ పండు అందరికీ తెలిసిందే. పూతకొచ్చిన కాలంలో దానిమ్మ పొద ఎంతో అందంగా ఉంటుంది. ఈ పండు ఎరుపు, పసుపు రంగులు మిళితమై ఆకర్షణీయంగా కనిపిస్తుంది. అనేక సంప్రదాయ ఆచారాల్లో, ఔషధాల్లో దానిమ్మ పండు వినియోగిస్తున్నారు. మత విశ్వాసాల్లో ఇది సంపదకు చిహ్నం. సీమంతం వేడుకలో గర్భిణిని ఆశీర్వదించే ముత్తైదువలు అయిదు రకాల పండ్లతో ఒడినింపుతారు. వాటిలో దానిమ్మ పండు మొదటిది. ప్రాచీన కాలంలో నేటి ఇరాన్, ఉత్తర భారత భూభాగాల్లో దానిమ్మ పండేది. ఇక్కడి నుంచి ఇతర ప్రాంతాలకు విస్తరించిందీ చెట్టు. సమశీతోష్ణ వాతావరణంలో, వర్షపాతం తక్కువగా ఉండే ప్రాంతాల్లోనూ ఎదుగుతుంది. ప్రపంచంలో అయిదు వందల పేర్లతో దానిమ్మ చెట్లున్నాయి. పొద ఎత్తు, పూలు, కాయ పరిమాణం, రంగు, రుచిని బట్టి ఒకే రకమైన దానిమ్మకు అనేక పేర్లున్నాయి. ఇందులో గింజలు గట్టిగా ఉండేవి, మెత్తగా ఉండేవి, అతి పుల్లగా ఉండేవి, కెంపు, తెలుపు, లేత ఆకుపచ్చలో ఉండే రకరకాల దానిమ్మలు ఉన్నాయి. ఇవి 11 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత కంటే తక్కువ ఉష్ణోగ్రతను తట్టుకుని పెరుగుతాయి. మన దేశంలో దోల్కా, కంధారి, స్పానిష్ రూబీ, గణేష్, ఆలంది దానిమ్మ పండ్లు పండుతున్నాయి. దానిమ్మలో యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉన్నాయి. శరీరంలోని కణాలను ధ్వంసం చేసే ఫ్రీరాడికల్స్ ప్రభావాన్ని ఇవి నివారిస్తాయి. దానిమ్మ రసానికి రక్తాన్ని పలుచన చేసే గుణం ఉంది. చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గిస్తుంది. అందువల్ల రక్తనాళాల్లో సరఫరా వేగవంతమవుతుంది. గుండెపోటు ప్రమాదాన్ని నివారిస్తుంది. అందుకే దానిమ్మ ఫలాన్ని 'నేచురల్ ఆస్పిరిన్' అని పిలుస్తారు. రోజూ అర కప్పు దానిమ్మ రసం తాగితే గుండె జబ్బులు రావు. నొప్పులు తగ్గించడానికీ, దగ్గు, మూత్రాశయ వ్యాధులు, జీర్ణాశయ సమస్యలు, క్యాన్సర్ నివారణకు దానిమ్మ తోడ్పడుతుంది. ఆకలిని పుట్టిస్తుంది. పూలతో కూడా ఔషధాలను తయారు చేస్తారు. దానిమ్మ తొక్కను అద్దకం కుటీర పరిశ్రమల్లో రంగుల తయారీ కోసం ఉపయోగిస్తారు. దానిమ్మ కాయ, తొక్క నుంచి తీసిన ద్రావణం కీటక నాశినిగా ఉపయోగపడుతుంది.

# మన చుట్టూ పరిసరాల్లో పెరిగే ఈ మొక్క కనబడితే వెంటనే ఇంటికి తెచ్చుకోండి ఎందుకంటే



దవనం మొక్క గురించి అందరికీ తెలిసిందే. దీన్ని చాలా మంది తమ ఇంటి పెరట్లో పెంచుతారు. ఈ మొక్క ఆకులను పువ్వుల దండల్లో ఎక్కువగా ఉపయోగిస్తారు. దవనం ఆకులు అద్భుతమైన సువాసనను అందిస్తాయి. అందుకనే ఈ మొక్క ఆకులను పూల దండల్లో వాడుతుంటారు. అయితే దవనం మొక్క ఆకుల్లో అనేక ఔషధ గుణాలు ఉంటాయి. ఈ ఆకులను ఆయుర్వేద, యునాని వైద్య విధానంలో పలు ఔషధాలను తయారు చేసేందుకు ఉపయోగిస్తారు. ఇక దవనం ఆకుల నుంచి ప్రత్యేకంగా నూనెను తయారు చేస్తారు. ఇది అద్భుతమైన సువాసనను అందిస్తుంది. ఈ నూనె వాడితో మనకు అనేక ఆరోగ్య ప్రయోజనాలు కలుగుతాయి. దవనం నూనె వల్ల ఎలాంటి లాభాలు కలుగుతాయో ఇప్పుడు తెలుసుకుందాం.

### ఒత్తిడి, ఆందోళన తగ్గుతాయి..

దవనం మొక్క అనేక ఔషధగుణాలను కలిగి ఉంటుంది. దీన్ని ఆధ్యాత్మిక పరంగా కూడా ఉపయోగిస్తారు. ఆయుర్వేదం, యునాని వైద్యంలోనూ దవనం మొక్కకు ప్రత్యేక స్థానం ఉంది. ఈ మొక్క ఆకుల నుంచి తీసి నూనె అనేక ఆరోగ్య ప్రయోజనాలను అందిస్తుంది. దవనం నూనెను సవాసన కోసం ఉపయోగిస్తారు. ఈ నూనెను వాసన పీలుస్తుంటే ఒత్తిడి, ఆందోళన తగ్గుతాయి. దీంతో మైండ్ రిలాక్స్ అవుతుంది. మానసిక ప్రశాంతత లభిస్తుంది. మానసిక ఆరోగ్యం మెరుగు పడుతుంది. డిప్రెషన్ నుంచి బయట పడవచ్చు. రాత్రి పూట ఈ మొక్క ఆకుల వాసన లేదా నూనె వాసనను పీలిస్తే మైండ్ రిలాక్స్ అయి చక్కగా నిద్ర పడుతుంది. నిద్రలేమి నుంచి బయట పడవచ్చు. నిద్ర సమస్యలను తగ్గించడంలో దవనం నూనె లేదా ఆకులు అద్భుతంగా పనిచేస్తాయి.

### చర్మ సమస్యలకు..

శరీరంపై వచ్చే దురదలు, దద్దుర్లను తగ్గించడంలోనూ దవనం నూనె అద్భుతంగా పనిచేస్తుంది. సమస్య చోట ఈ నూనెను రాస్తుంటే ఫలితం ఉంటుంది. దీంతో ఎలాంటి చర్మ సమస్యను అయినా సరే తగ్గించుకోవచ్చు. ముఖ్యంగా శరీరంపై వచ్చే దద్దుర్లు, పుండ్లు తగ్గిపోతాయి. గాయాలు కూడా త్వరగా మానిపోతాయి. మహిళలు ప్రసవం అనంతరం తమ పొట్టపై వచ్చే స్ట్రెచ్ మార్క్‌లను తగ్గించుకునేందుకు కూడా దవనం నూనె పనిచేస్తుంది. దీన్ని పొట్ట భాగంపై రోజూ మర్దనా చేస్తుంటే ఎలాంటి స్ట్రెచ్ మార్క్స్ అయినా సరే తగ్గిపోతాయి. మహిళలు ఈ నూనెను తరచూ వాడుతుంటే నెలసరి సరిగ్గా వస్తుంది. హార్మోన్ల సమస్యలు ఉండవు. అలాగే తిన్న ఆహారం సరిగ్గా జీర్ణం కావాలంటే కూడా ఈ నూనెను పొట్టపై మర్దనా చేయవచ్చు.